


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


పంట వ్యర్థాల దహనాన్ని 'రాజకీయం చేయొద్దు' 05

తెలంగాణకు మణిహారం 'ఎర్త్ యూనివర్సిటీ' 03

నిర్దేశిత సమయంలో మేడారం అభివృద్ధి పనులు పూర్తి : సిఎం


సంపుటి 09, సంచిక: 06 | మంగళవారం | 02-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00







# అభివృద్ధిని అడ్డుకునే వాళ్ళొద్దు

"పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా, ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఎంత డబ్బు ఖర్చయినా సరే మక్తల్ – నారాయణపేట ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌ను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం. - సిఎం

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వారిని గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు
- వందేళ్లుగా బిసిల లెక్కలే లేవు
- కెసిఆర్ అప్పులు తీరుస్తూనే పథకాలు అమలు చేస్తున్నాం
- ఉమ్మడి ఎపి, తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్‌పై నిర్లక్ష్యం
- పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం
- నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో సిఎం రేంత్‌రెడ్డి

ప్రజాక్షం/వనపర్తి/ నారాయణపేట

'అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వాళ్లను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపిస్తేనే గ్రామం బాగుపడుతుంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. బిసిలు ఎంతమంది ఉన్నారో వందేళ్లుగా లెక్కలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక కుల సర్వే చేసి అన్ని కులాల లెక్కలు తీసుకున్నామని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి పోయారని విమర్శించారు. ఓవైపు కెసిఆర్ చేసిన అప్పులు తీరుస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో మాట్లాడారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేశారని, ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నాయకుడు కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తికావొస్తుందని రేవంత్ గుర్తు చేశారు. రెండు తరువాయి 2లో



# 'సర్'పై నిరసనలతో తొలి రోజు వాయిదా

- పార్లమెంట్‌లో చర్చకు ప్రతిపక్ష పార్టీలు పట్టు
- వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు
- కొనసాగిన వాయిదాల పర్వం
- సభ నేటికి వాయిదా
- మణిపూర్‌లో జిఎస్‌టి బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. లోక్‌సభ తొలిరోజే అట్టుడికిపోయింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చర్చకు ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. దీంతో మధ్యాహ్నం 2.20 గంటల ప్రాంతంలో సభను మంగళవారానికి వాయిదా వేశారు. విపక్షల సభ్యుల కోలాహలం మధ్య మణిపూర్‌లో జిఎస్‌టి చట్టానికి సవరణలను అమలు చేయడానికి బిల్లును కొద్దిసేపు చర్చ తర్వాత ఆమోదించారు. సభ మరుసటి రోజుకు వాయిదా పడడానికి ముందు కూడా పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం ప్రశ్నోత్తరాల సమయంలో సభ రెండుసార్లు వాయిదా పడింది. 15 పనిదినాల్లో సమావేశాలు జరిగే శీతాకాల సమావేశాల మొదటి రోజే తరచూ అంతరాయం ఏర్పడింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీరో అవర్‌లోని 12 నిమిషాల సమయంలో సీతారామన్ 2025–2026 సంవత్సరానికి తరువాయి 2లో

పార్లమెంట్‌లో డ్రామాకు చోటు లేదు : మోదీ | 05 | మోదీ 'అతిపెద్ద డ్రామాబాజ్': కాంగ్రెస్



# రెండు నెలల్లో ఎఐ యూనివర్సిటీ

- ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో ప్రారంభిస్తాం
- సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీర్లు, చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు నూతన నైపుణ్యాల్లో శిక్షణ
- ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి
- మాదాపూర్‌లో కోవాసెంట్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీర్లు, చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు దీని ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. మాదాపూర్‌లో కోవాసెంట్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లు పనిచేస్తున్న కోవాసెంట్ మరో రెండేళ్లలో 3000 మంది ప్రతిభావంతులను ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. ఎఐ సాంకేతిక దూకుడుతో కోడింగ్‌లో ఉన్నవారు ఇతర ప్లాట్ ఫారాల్లో పనిచేస్తున్నవారు నైపుణ్యాలను పెంచుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. వారందరికీ ఎఐ యూనివర్సిటీ ద్వారా రీస్కిల్, అప్ స్కిల్స్ అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కోవాసెంట్ చైర్మన్ సి.వి.సుబ్రమణ్యంను తరువాయి 2లో

'గిగ్‌కార్మికులకు భద్రతా చట్టం'

# ప్రభుత్వానికి విధానపరమైన సిఫార్సు పత్రం



- నివేదికను అందజేసిన సిఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బృందం
- ధన్యవాదాలు తెలిపిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- మరిన్ని సూచనలు చేయాలని మంత్రి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

'గిగ్‌కార్మికుల భద్రత'చట్టాన్ని రూపొందించేందుకు విధానపరమైన సిఫార్సులతో కూడిన పత్రాన్ని, నివేదికను సి.ఆర్. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ తరువాయి 2లో



# 25 వేల ఓటర్లతో క్లస్టర్

- వైశాల్యానికి అనుగుణంగా క్లస్టర్‌ల అనుసంధానంతో మహా జిహెచ్‌ఎంసి వార్డుల ఏర్పాటు
- పూర్తయిన వార్డుల పునర్విభజన
- మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల విలీనం కోసం 'మహా' క్రతువు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో 20 మున్సిపాలిటీలు, 7మున్సిపల్ కార్పొరేషన్‌ల విలీన ప్రక్రియపై చేపట్టిన కసరత్తు సుదీర్ఘంగా సాగుతోంది. ఈ క్రతువులో జిహెచ్‌ఎంసి, శివారు మున్సిపల్ సంస్థలకు చెందిన టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగాల యంత్రాంగం తలమునకలైంది. అయితే వార్డుల పునర్విభజనపై ప్రధానంగా యంత్రాంగం దృష్టిసారించింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి పరిధిలో 150 వార్డులు ఉన్నాయి. విలీనమయ్యే మున్సిపల్ సంస్థలలో ఎన్ని వార్డులు ఏర్పాటు చేయాలి, ఎంతమంది ఓటర్లతో ఏర్పాటు చేయాలనే అంశాలపైనే ప్రధానంగా దృష్టిసారించారు. ఇందుకు ఒక అంచన కోసం ప్రాథమికంగా జిహెచ్‌ఎంసితో పాటు విలీనమయ్యే ప్రాంతాలలో 25 వేల ఓటర్లతో క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 25 వేల ఓటర్లతో కలిపి క్లస్టర్‌లను సిద్ధం చేశారు. దీనికోసం ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగం సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసిహెచ్‌ఆర్‌డి)లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి)లో జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగాలు, జిహెచ్‌ఎంసిలో విలీనమయ్యే మున్సిపల్ సంస్థలకు చెందిన టౌన్ ప్లానింగ్, ఎన్నికల విభాగాల అధికారులు పలు పంచుకుంటున్నారు.

### క్లస్టర్‌ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి..

టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో 25 వేల ఓటర్లతో కూడిన క్లస్టర్ ఏరియాల రూపకల్పన చేపట్టారు. ఈ క్రమంలో ఏ ప్రాంతంలో ఓటర్ల సంఖ్య ఎంత ఉంది, ఆ ప్రాంతంలో 2011 లెక్కల ప్రకారం జనాభా, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం తరువాయి 2లో




# సైబర్ ఖాతాల ఫ్రీజ్‌కు ఎఐ ఎందుకు వాడట్లే?

- కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- డిజిటల్ అరెస్ట్ మోసాలపై ముందుగా దర్యాప్తుకు సిబిఐకి ఆదేశం
- అనుమతి ఇవ్వాలని అన్ని రాష్ట్రాలకు సూచన

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలపై ముందుగా దర్యాప్తు చేపట్టాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన కేసుల దర్యాప్తును సిబిఐకి అప్పగించేలా అనుమతి ఇవ్వాలంటూ బంగాల్, తమిళనాడు, కర్ణాటక, తరువాయి 12లో

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు

# క్షమాభిక్ష వద్దు

- ఇజ్రాయెల్‌లో ప్రజాగ్రహం
- అధ్యక్షుడి నివాసం వెలుపల ప్రదర్శన

**టెల్‌అవీవ్:** అవినీతి, మోసం కేసుల్లో నిందితుడుగా ఉన్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ (76) క్షమాపణ కోరుతూ దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు లేఖ సమర్పించడంపై ఆ దేశంలో తీవ్ర ఆగ్రహం చెలరేగింది. ఆయన క్షమాపణ లేఖ సమర్పించిన కొద్ది గంటల వ్యవధిలోనే భారీసంఖ్యలో ప్రజలు ఆదివారం రాత్రి పొ ద్దుపోయాక టెల్‌అవీవ్‌లోని దేశాధ్యక్షుడి నివాసం వెలుపల గుమిగూడి నిరసన ప్రదర్శన జరిపారు. అవినీతి ప్రధానమంత్రికి ఏ విధంగా క్షమాభిక్ష ఇస్తారని నిలదీశారు. ఆయనకు క్షమాభిక్ష ఇవ్వకూడదని నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఎలాంటి జవాబుదారీ లేకుండా మోసాల నుండి ఎలా విముక్తి అడుగుతారని నిలదీశారు. నెతన్యాహూ తరువాయి 12లో






నాలుగు ఆగ్నేయ ఆసియా దేశాల్లో

# 1000 మంది మృతులు


- తుఫానులు, భారీ వరదల ధాటికి మృత్యువాత
- లక్షలాది మంది నిరాశ్రయులు

**కొలంబో:** ఆగ్నేయ ఆసియాలో శ్రీలంక,ఇండోనేసియా,థాయ్‌లాండ్, మలేసియా నాలుగు దేశాలను వారం రోజులకుపైగా తుఫానులు, భారీ వరదలు సహా ఇతర ప్రకృతి విలయాలు కుదిపేయడంతో 1000 మందికిపైగా ప్రజలు మరణించారు. లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఐతే ఈ దేశాలలో పరిస్థితులు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నప్పటికీ సహాయ కార్యక్రమాలు తరువాయి 12లో



# కేరళ సిఎంకు ఇడి షోకాజ్ నోటీసు

**తిరువనంతపురం :** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. సిఎం వ్యక్తిగత కార్యదర్శితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్‌కు ఈ నోటీసులు అందాయి. 2019లో మసాలా బాండ్ జారీలో విదేశీ మారకపు నిర్వహణ చట్టాన్ని (ఫెమా) ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ అయ్యాయి. 2019లో కేరళ రాష్ట్రం మసాలా బాండ్లను జారీచేసింది. ఆ తరహా బాండ్లను తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్‌లో ఇళ్ళువదలి పారిపోయిన ప్రజలు



**కార్టూమ్:** సూడాన్‌లో అంతర్యుద్ధం ముదిరిపోవడంతో దక్షిణ కోర్డోఫోస్‌లోని కెర్తాల్ పట్టణం నుండి ఒక్కరోజు వ్యవధిలోనే 1600 మంది ప్రజలు భయంతో ఇళ్ళు వదలి పారిపోయారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఒఎం) సోమవారం ఈ విషయం ప్రకటించింది. సాధారణ సైన్యంపై అంతర్యుద్ధం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ ఇటీవల తనంతట తానుగా కాల్పుల విరమణను పాటించినప్పటికీ, ప్రజలపై దాని ఆగడాలు మితిమీరుతున్నాయి. సూడాన్ పీపుల్స్ లిబరేషన్ మూమెంట్ నార్త్ మద్దతులో ఆర్‌ఎస్‌ఎఫ్ దాడులు చేస్తూ ఉండటంతో ప్రజలు అభద్రతతో ఇళ్ళు వదలి పారిపోతున్నారని ఐఒఎం తెలిపింది.
2023 నుండి సూడాన్‌లో రెండు సైనిక వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతున్నది.

## బ్రిటన్ ఎంపి సహా హసీనా సిస్టర్స్‌కు
# జైలుశిక్ష విధించిన బంగ్లాదేశ్ కోర్టు



**ఢాకా :** బ్రిటన్ దేశ మహిళా ఎంపి తులిప్ సిద్ధిఖ్ (ముజిబుర్ రెహ్మాన్ మనుమరాలు)కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ బంగ్లాదేశ్ కోర్టు తీర్పు చెప్పింది. పూర్వాంచల్ ప్రాంతంలో నివాసిత ప్రాంతాల ప్రాజెక్టుకు సంబంధించిన ఫ్లాట్ల కేటాయింపులో అవినీతి అక్రమాలు జరిగాయంటూ పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా (78)పై పలు కేసుల్లో విచారణ జరుగుతోంది. ఈ విచారణ కొనసాగింపు చర్యల్లో భాగంగా హసీనాతోపాటు ఆమె చెల్లెలు షేక్ రెహనాలతోపాటు బ్రిటన్ ఎంపి తులిప్‌కు కూడా వేరువేరుగా జైలుశిక్షలు విధిస్తూ ఢాకాలోని కోర్ట్ నెం–4 ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ రబియుల్ అలమ్ సోమవారం తీర్పులు చెప్పారు. మొత్తం 17 మందిపై అవినీతి వ్యతిరేక విభాగం కేసులు నమోదు చేసింది. వీరిలో మరో 14 మందికి ఐదేసి సంవత్సరాలు వంతున శిక్షలు విధించింది. అదేవిధంగా హసీనా, రెహనా, సిద్ధిఖ్‌లకు ఒక లక్ష టాకాల వంతున జరిమానా కూడా విధించారు. మొత్తం 17 మందికీ ఈ లక్షవంతున జరిమానాలు పడ్డాయి. జరిమానా చెల్లించలేక పోతే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.
గత ఏడాది జులై విద్యార్థి ఉద్యమంలో నిరాయుధులైన యువకులను మారణాయుధాలతో హింసాత్మకంగా అణచివేయడానికి ప్రధాన కారకురాలు హసీనా అని తేల్చి చెప్పిన ఐసిటి (అంతర్జాతీయ క్రైమ్ ట్రిబ్యునల్) ఆమెకు ఉరిశిక్ష విధించింది. ఆ తర్వాత మరో న్యాయస్థానం ఫ్లాట్ల కేటాయింపు అవినీతిలో ఆరు కేసుల విచారణ చేపట్టింది. వీటిల్లో మూడు కేసులకు సంబంధించి ఇచ్చిన తీర్పుల్లో హసీనాకు 21 ఏళ్ళు జైలుశిక్ష పడింది. ఇప్పుడు తాజాగా సోమవారం వెలువడిన తీర్పులో హసీనాకు ఐదు సంవత్సరాలు జైలుశిక్ష పడింది. ఆమె సోదరి రెహనాకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించగా వారితో ఈ అవినీతిలో భాగస్వామిగా ఉన్న బ్రిటన్ ఎంపి తులిప్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. ఐతే ఈ శిక్షల తీర్పులు, ఈ కేసుల విచారణ నిందితుల సమక్షంలో జరగలేదు. వారంతా కోర్టులోగానీ, బంగ్లాదేశ్‌లో లేరు. వారు లేకుండానే ఈ కేసుల విచారణ, శిక్ష తీర్పులు వెలువడ్డాయి.
దీంతో షేక్ హసీనాపై ఇప్పటివరకూ నాలుగు అవినీతి కేసుల్లో మొత్తం 26 సంవత్సరాలు జైలు శిక్షలు (మూడు కేసుల్లో 21 సంవత్సరాలు, ఒక కేసులో ఐదు సంవత్సరాలు) పడినట్లయింది. ఇంకా రెండు అవినీతి కేసులలో విచారణ, తీర్పులు పెండింగ్‌లో ఉన్నాయి. బంగ్లాదేశ్ ఎసిసి (అవినీతి వ్యతిరేక కమిషన్) ఈ కేసులు వారిపై నమోదు చేసింది.
**ఎవరీ తులిప్ సిద్ధిఖ్?:** బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ మనుమరాలు తులిప్ సిద్ధిఖ్ (42) బ్రిటన్ మాజీ మంత్రి. లేబర్ పార్టీ తరపున ఆమె హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్నింటికంటే ఎక్కువగా బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సోదరి, బంగ్లాదేశ్ అవామీ లీగ్ నాయకురాలు రెహనా కుమార్తె తులిప్ సిద్ధిఖ్. పూర్వాంచల్ అవినీతిలో తన పెద్దమ్మను తులిప్ ప్రభావితం చేశారన్నది ఆమెపై అవినీతిశాఖ అభియోగం. ఆమె 1982లో లండన్‌లోని షట్టన్‌లో ప్రొఫెసర్ షఫీక్ అహ్మద్ సిద్ధిఖ్, రెహనాలకుజన్మించారు.

# ట్రంప్ జవాబివ్వాలని చట్టసభ డిమాండ్



**వాషింగ్టన్ :** కరీబియన్ జలాల్లో డ్రగ్స్ బోట్లపై దాడుల విధానం, వాటి పర్యవసానాలపై సమాధానం చెప్పాలని అమెరికా చట్టసభ సభ్యులు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నిలదీశారు. కరీబియన్ దీవుల్లో బోట్లపై క్షిపణి దాడులు చేసి స్వాధీనం చేసుకున్న తర్వాత ఆ బోట్లలో ఇంకా సజీవంగా ఉన్నవారిపై పదే పదే దాడులు చేసి చంపాలంటూ ఆదేశాలిచ్చారని వచ్చిన నివేదికపై సమాధానం చెప్పాలని వారు ట్రంప్ పాలనాయంత్రాంగంపై ఒత్తిడి చేశారు. ఒకవేళ అదే నిజమైతే ఈ ఆదేశాలు యుద్ధనేరంతో సమానంగా పరిణించాల్సి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిని అన్యాయంగా, అమానుష చర్యగా పేర్కొన్నారు. మొదట దాడి చేసిన తర్వాత ఇంకా సజీవంగా ఉన్నవారిని కూడా చంపాలంటూ ఎందుకు ఉత్తర్వులు ఇచ్చారని, ఇది చాలా తీవ్రమైన విషయమని అమెరికా చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇకమీదట మాదకద్రవ్యాల పడవలపై దాడులు చేసే పెంటగాన్ రక్షణ దళాలపై చాలా తీక్షణమైన పర్యవేక్షణ, నిఘా కొనసాగిస్తామని ఈ నివేదిక బయటకు వచ్చిన తర్వాత రిపబ్లికన్ చట్టసభ్యుల నాయకత్వానగల కమిటీలు ప్రతిజ్ఞ చేశాయి. సెప్టెంబరు రెండో తేదీన అమెరికా నౌకా, వాయుసేన దళాలు కరీబియన్ జలాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో కొన్ని పడవలపై దాడులు చేశాయి. మొదట దాడుల తర్వాత పడవల్లో ఇంకా కొంత మంది సజీవంగా ఉన్నారు. కానీ ''అందరినీ చంపండి'' అంటూ అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ ఆదేశాలు ఇవ్వడంతో మళ్ళీ మళ్ళీ ఆ పడవలపై దాడులు జరిగాయని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నివేదిక అలజడి సృష్టించింది. దీనిపై మంత్రి పీటర్ హెగ్సెత్ వివరణ ఇస్తూ, వీటిని నకిలీ వార్తలుగా కొట్టిపారేశారు. ఆయన (హెగ్సెత్)ను నూటికి నూరుపాళ్లు విశ్వసిస్తున్నానని ట్రంప్ అన్నారు. ఐతే హెగ్సెత్ మొదట పడవలో ఉన్నవారందరినీ చంపాలని ఆదేశాలు ఇచ్చారనీ, ఆ తర్వాత ఈ దాడులను పర్యవేక్షించే అధికారికి మరోసారి అవే ఆదేశాలు జారీ చేశారని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. ఆదివారం జరిగిన టాక్ షోలో పాల్గొన్న రిపబ్లికన్, డెమోక్రటిక్‌పార్టీలకు చెందిన సభ్యులు అమెరికన్ కాంగ్రెస్ సమర్పించిన నివేదికలకు తాము మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ''పత్రికా నివేదిక నిజమోకాదో మాకు తెలియదు, కానీ క్షిపణి దాడులు చేసిన తర్వాత సజీవులను అరెస్టు చేయకుండా రెండోసారి కూడా మళ్ళీ మరణించేవరకూ దాడులు చేయడం యుద్ధ నేరం స్థాయికి చేరుతుంది'' అని 'ఫేస్ ద నేషన్' టాక్ షోలో డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ టిమ్‌కైన్ అన్నారు. సమీపంలో ఉన్న దేశంపై మరో ఖరీదైన యుద్ధానికి అమెరికా సిద్ధపడుతోందని డెమోక్రాట్ సభ్యుడు చక్‌షుమర్ ఇప్పటికే ట్రంప్‌ను నిశితంగా విమర్శించారు.
**మదురోతో మాట్లాడా నిర్ధారించిన ట్రంప్ :** కరీబియన్ దీవుల్లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ట్రంప్–నికొలస్ మదురో (వెనిజులా అధ్యక్షుడు) మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. ఐతే మదురోతో ట్రంప్ మాట్లాడారంటూ వచ్చిన వార్తలను ఆయన సోమవారం ధృవీకరించారు. ''నేను మదురోతో ఫోన్ సంభాషణ చేసిన మాట నిజమే'' అని ట్రంప్ స్పష్టం చేశారు. కానీ వారిమధ్య సంభాషణ ట్రంప్‌వైపు ఏకపక్షంగానే కొనసాగింది. ఆయన షరతులను అంగీకరించక పోవడంవల్లనే వెనిజులా గగనతలంపై ట్రంప్ నిషేధం విధించారని భావిస్తున్నారు. మదురో మొదటి నుండీ సామరస్య ధోరణితో మాట్లాడుతూ వచ్చారు. వెనిజులాలో డ్రగ్స్ ముఠాలను అదుపు చేశామని, అనేకమందిని అరెస్టు చేశామని ట్రంప్‌కు చెప్పారు. తమ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడానికి, అమెరికా దురాక్రమణ అడ్డుకోవడానికి వెనిజులాలో ప్రతి పౌరుడూ యుద్ధ శిక్షణ తీసుకుంటాడని ప్రకటించారు.

## హోండూరాస్ ఎన్నికల ఫలితాల్లో..
# ట్రంప్ మద్దతుదారుడు ముందంజ



**టెగుసిగాల్ప :** సెంట్రల్ అమెరికాలో పసిఫిక్ తీర దేశం హోండూరాస్‌లో అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల లెక్కింపు ఫలితాల్లో మితివాద నేషనల్ పార్టీ అభ్యర్థి నస్రీ అస్ఫురా (67) స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. తాను ఇష్టపడే అభ్యర్థి ఎన్నికల్లో విజయం సాధించకపోతే హోండూరాస్‌కు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని తగ్గించేస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పోలింగ్‌కు ముందుగానే ఆ దేశ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేశారు. తాను నస్రీ అస్ఫురాకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కానీ ట్రంప్ మద్దతు పొందిన నస్రీ అస్ఫురా మిగిలిన ఇద్దరు ప్రధాన అభ్యర్థుల కంటే కౌంటింగ్‌లో స్వల్ప ఆధిక్యంలో మాత్రమే కొనసాగుతున్నారు. రెండు మితవాదపార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్య కౌంటింగ్‌లో గట్టి పోటీ జరుగుతోందని జాతీయ ఎన్నికల సంఘం తన ప్రాథమిక ఫలితాల్లో పేర్కొంది. అస్ఫురాకు దేశ ఉపాధ్యక్షుడు, మాజీ టీవీ హోస్ట్ సాల్వడార్ నస్రుల్లా పెద్ద పోటీ ఇస్తున్నారు. తుది సమాచారం ప్రకారం అస్ఫురాకు 40.5 శాతం ఓట్లు లభించగా, నస్రుల్లాకు 39 శాతం ఓట్లు వచ్చాయి. అధికార వామపక్ష పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి రిక్సీ మోంకడా 20 శాతం ఓట్లతో మూడోస్థానంలో బాగా వెనుకబడ్డారు. ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. కానీ ప్రధాన పోటీ ఈ ముగ్గురు మధ్యే జరుగుతోంది.

## 25 వేల ఓటర్లతో క్లస్టర్
(మొదటి పేజీ తరువాయి)

జిహెచ్‌ఎంసిలో ఉన్న కొన్ని డివిజన్‌లలో చేపట్టిన క్లస్టర్ విధానంలో ఒక్కో డివిజన్‌లో రెండు చొప్పున క్లస్టర్‌లు వస్తుండగా, మరికొన్ని డివిజన్‌లలో ఒకటి మాత్రమే వస్తుంది. అలాగే కొన్ని అస్లెంబ్లీ నియోజకవర్గాలలో 25 వేల ఓటర్లతో చేపట్టిన క్లస్లర్‌లు భారీగా పెరిగిపోగా, పాతబస్తీలోని కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఇప్పటికే డివిజన్‌లలోనే ఇమిడిపోతున్నాయి. జిహెచ్‌ఎంసిలో మొదలు కొని శివారు మున్సిపల్ సంస్థలలో కూడా సమానంగా 25 వేల ఓటర్లతో కూడిన క్లస్టర్‌లు రూపొందించారు. వీటికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియను సైతం టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం పూర్తి చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను సైతం సిజిజి అందించినట్లు తెలిసింది. రైల్వే ట్రాక్, జాతీయ, రాష్ట్ర, జిహెచ్‌ఎంసి ప్రధాన రహదారులతో కూడిన సహజ సరిహద్దులతో పాటు నాలాలు, చెరువులు, భౌగోళిక అంశాలను వార్డుల పునర్విభజనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న క్లస్టర్‌లలో ఉపయోగించారు. శాస్త్రీయ విధానంలో క్లస్టర్‌ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టినట్లు ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. జిల్లాలు, లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులలోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.
ఇందుకోసం చాలా పెద్ద ఎత్తున కసరత్తు చేయాల్సి వచ్చిందని ఉన్నతాధికారులు చెప్పారు. వైశాల్యానికి అనుగుణంగా క్లస్టర్‌ల అనుసంధానంతో నూతన వార్డుల ఏర్పాటు ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం విడుదల చేసే గేజిట్ ద్వారా పూర్తి సమాచారం వెలుగులోకి రానుంది.
**క్లస్టర్‌ల అనుసంధానంతో వార్డుల ఏర్పాటు..**
ప్రస్తుతం 25 వేల ఓటర్లతో క్లస్టర్లుగా ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో వార్డుల పునర్విభజన ప్రక్రియ సులభతరంగా మారనుంది. 50 వేల నుంచి లక్ష జనాభాకు ఒక్క వార్డుగా ఏర్పాటు చేయాల్సి వస్తే ప్రస్తుతం ఏర్పాటు చేసిన క్లస్టర్‌లను అనుసంధానం చేస్తే సరిపోతోంది. అందుకే ముందస్తు వ్యూహంలో భాగంగానే ప్రభుత్వం 25 వేల మంది ఓటర్లతో కూడిన ప్రాంతాన్ని క్లస్టర్‌గా రూపొందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. క్లస్టర్‌ల ఏర్పాటు పూర్తయిన ఎంత మంది ఓటర్లతో వార్డు ఏర్పాటు చేయాలనుకుంటే అంత మేరకు ఏర్పాటు చేసేందుకు వీలవుతుంది. అయితే జిహెచ్‌ఎంసి పరిధిలో ఓటర్ల సంఖ్య ఎక్కువ, వార్డు వైశాల్యం తక్కువ ఉండే అవకాశం ఉంది. అలాగే శివారు ప్రాంతాల్లో మాత్రం ఓటర్ల సంఖ్య తక్కువ, వార్డుల వైశాల్యం ఎక్కువ ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారనే విషయం తెలియాల్సి ఉంది.

## ఎఐ యూనివర్సిటీ
(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ప్రశంసించారు. 18 మంది ఉద్యోగులతో దశాబ్దాల క్రితం సిగ్నిటీ పేరుతో సాఫ్ట్ వేర్ కంపెనీని ప్రారంభించిన ఆయన ఇవ్వాళ వేల మంది సిబ్బందితో ప్రపంచస్థాయి సంస్థగా కోవాసెంట్ ను తీర్చిదిద్దారని శ్రీధర్ బాబు చెప్పారు. టెక్నాలజీ అంటే సిలికాన్ వ్యాలీ, ప్రపంచ ప్రొడక్షన్ సెంటర్ గా చైనాలోని షెంజెన్, క్రమశిక్షణ, సుపరిపాలన కలిగిన దేశంగా సింగపూర్ ల గురించి చెబ్తారని, ఈ మూడు లక్షణాలు కలగలిసిన నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. ఇక్కడ ఉన్న అనుకూల పర్యావరణం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. 'అత్యధిక సంఖ్యలో గ్లోబల్ సామర్థ్య కేంద్రాలున్న నగరంగా అగ్రస్థానంలో నిల్చింది. ప్రపంచంలోని దిగ్గజ బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు జిసిసిల ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంచుకున్నాయి. ఇది అత్యంత గర్వించదగ్గ అంశం. లైఫ్ సైన్సెస్ రంగంలో గణనీయ ప్రగతిని సాధించాం. దేశంలో తయారయ్యే వ్యాక్సిన్లలో మూడో వంతు ఇక్కడే తయారవుతున్నాయి. హెల్త్ కేర్ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి ఎకోసిస్టం మరెక్కడా కనిపించదు'. తమ ప్రభుత్వ దృఢ సంకల్పం వల్ల ఇవన్నీ సాధ్యమయ్యాయని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. సమావేశంలో కోవాసెంట్ ఛైర్మన్ సుబ్రమణ్యం, ఐటి, ఇండస్ట్రీస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ, యుకె డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ వయన్ ఒవెన్‌లు పాల్గొన్నారు.

## సిఫార్సు పత్రం
(మొదటి పేజీ తరువాయి)

టి.సురేష్‌బాబుతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ మేరకు వారు హైదరాబాద్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం దేశంలో మొట్టమొదటి సారి 'గిగ్ ఎకనామీ'పైన సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ కింగ్సుక్ సర్కార్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ మాజీ లేబర్ కమిషనర్, షేక్ సలాహుద్దీన్, గిగ్ కార్మిక ఫెడరేషన్ నాయకులు , డా.పిఎస్‌ఎం రావు, ఆర్థిక సామాజిక సమస్యల విశేషకులు, ఎఐటియుసి నాయకుడు బి.వెంకటేశం,ఉబర్,ఓలా, స్విగ్గీ, జోమాటో వంటి సంస్థల గిగ్ కార్మికులు పాల్గొన్నారు. పరిశోధకులు , నిపుణులు,న్యాయ సమర్థకుల కోసం ఏర్పాటు చేసిన సదస్సులో గిగ్ కార్మికుల సవాళ్లు, అవకాశాలు, విధాన పరిష్కారాలపై చర్చించి రూపొందించిన నివేదికను పల్లా వెంకట రెడ్డి, నెల్లికంటి సత్యం, టి.సురేష్‌బాబు కూడిన బృందం మంత్రికి అందజేశారు. ఇందుకు మంత్రి వివేక్ వెంకట స్వామి వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న గిగ్ కార్మికుల భద్రత చట్టాన్ని అధ్యయనం చేసి, మరిన్ని సూచనలు చేయాలని ప్రతినిధి బృందానికి మంత్రి వివేక్ సూచించారు.

## తొలిరోజు వాయిదా
(మొదటి పేజీ తరువాయి)

గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్లను ప్రవేశపెట్టడంతో పాటు మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. పొగాకుష పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం విధించడానికి రెండు బిల్లులు, పాన్ మసాలా తయారీపై కొత్త సెస్సును ప్రవేశపెట్టారు. ఈ మూడు బిల్లుల్లో సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025, ఆరోగ్య భద్రత, జాతీయ భద్రతా సెస్సు బిల్లు, 2025 ఉన్నాయి. ఉభయసభలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతి చెందిన సభ్యులకు లోక్‌సభ సంతాపం ప్రకటించింది. వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టుకు సభ్యులు అభినందలు తెలిపారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాలను గంట పాటు చేపట్టగా, విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య మణిపూర్ జిఎస్‌టి బిల్లు ఆమోదం ఈశాన్య రాష్ట్రంలో జిఎస్‌టి 2.0 సంస్కరణలను అమలు చేయడానికి జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో మణిపూర్ జిఎస్‌టి బిల్లును సర్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల మధ్య లోక్‌సభ సోమవారం ఆమోదించింది. క్లుప్త చర్చ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన తర్వాత లోక్‌సభ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, 2025ను ఆమోదించింది.
అక్టోబర్ 7, 2025న జారీ చేసిన మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ఆర్‌ఎస్‌పి సభ్యుడు ఎన్‌కె ప్రేమచంద్ర ప్రతిపాదించిన చట్టబద్ధమైన తీర్మానాన్ని, 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేయడంతో మూజువాణి ఓటు ద్వారా తిరస్కరించారు. స్పీకర్ స్థానంలో ఉన్న టిడిపి సభ్యుడు కృష్ణ ప్రసాద్ టెన్నెటి తీర్మానంపై మాట్లాడటానికి ప్రేమచంద్రన్‌కు అవకాశమిచ్చారు. కానీ ఆర్‌ఎస్‌పి సభ్యుడు సభ సరిగ్గా లేదని ప్రిసైడింగ్ అధికారికి చెప్పారు. ఆ బిల్లును తర్వాత మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. అంతకు ముందు జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి ఈ బిల్లు ప్రయత్నిస్తుందని సీతారామన్ అన్నారు.కేంద్ర వస్తువులు, సేవల పన్ను చట్టం, 2017 నిబంధనలను ఆర్థిక చట్టం, 2025లోని సెక్షన్లు 121 నుండి 134 వరకు సవరించామని, 56వ జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం ప్రకారం, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను చట్టం, 2017లో ఇలాంటి సవరణలను వీలైనంత త్వరగా చేపట్టాలని సీతారామన్ అన్నారు. మణిపూర్ ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్నందున, సవరణలను అమలు చేయడానికి అక్టోబర్ 7న ఒక ఆర్డినెన్స్ జారీ చేయబడిందని సీతారామన్ చెప్పారు.

# తెలంగాణ పోలీసుల ముందడుగు

### మహిళా భద్రతకు 'టి-సేఫ్'
### విప్లవాత్మక విధానం
### డిజిపిల సదస్సులో ప్రజెంటేషన్ ఇచ్చిన శివధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు ఉద్దేశించిన 'టిసేఫ్' వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక ముందడుగు అని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన వార్షిక డిజిపిల కాన్ఫరెన్స్‌లో 'టిసేఫ్ మహిళల కోసం సురక్షిత ప్రయాణం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చి, ఈ సాంకేతిక పరిజ్ఞానం యొక్క విశిష్టతను వివరించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2022 ప్రకారం, భారతదేశంలో అత్యధికంగా శ్రామిక మహిళల శాతం తెలంగాణలోనే ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో మహిళల ప్రయాణాన్ని అత్యంత సురక్షితం చేయాలనే లక్ష్యంతో 2024లో 'టిసేఫ్' యాప్‌ను ప్రారంభించినట్లు డిజిపి వెల్లడించారు. ఇప్పటివరకు మహిళా భద్రత కోసం ఉన్న సౌకర్యాలు కేవలం అత్యవసర ప్రతిస్పందన కోసం మాత్రమే పనిచేస్తుండగా, 'టిసేఫ్' మాత్రం ప్రయాణం మొదలైనప్పటి నుంచే పర్యవేక్షణ ప్రారంభిస్తుంది. ఈ విధంగా, ఇది కేవలం 'ప్రతిస్పందించే విధానానికి బదులుగా, 'ముందస్తు నివారణ' విధానంలో పనిచేయడం దీని ప్రధాన ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.'ట్రావెల్‌సేఫ్' లేదా 'టిసేఫ్' యొక్క ముఖ్య లక్షణాలలో ఒకటి దీనికి స్మార్ట్ ఫోన్ అవసరం లేకపోవడం. ఇందులో ఆటోమేటెడ్ రైడ్ ట్రాకింగ్ ఫీచర్ అందుబాటులో ఉంది. ఇది రూట్ డివియేషన్స్ చేరుకోవాల్సిన అంచనా సమయం ఆలస్యం, వెరిఫికేషన్ కాల్‌కు సమాధానం ఇవ్వకపోవడం, ప్రయాణం ఎక్కువ సమయం తీసుకోవడం, తప్పు పాస్‌కోడ్‌ను నొక్కడం వంటి 42 రకాల డివియేషన్స్ గుర్తించగలదు. ఈ ఫీచర్ మొదలైనప్పుడు సమీపంలోని వ్యాన్లు లేదా పోలీస్ పెట్రోల్ మోటార్‌సైకిళ్లు తక్షణమే బాధితురాలి ప్రదేశానికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సదుపాయానికి మహిళల నుంచి 5 కు గాను 4.7 రేటింగ్ లభించిందని ,ఈ విషయంలో ఇప్పటికే 350కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని డిజిపి తెలియజేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఉబర్, ఓలా, రాపిడో , మేరు, అభిబస్, వంటి అన్ని క్యాబ్ అగ్రిగేటర్‌లతో టిసేఫ్‌ను సమగ్రపరచాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, కృత్రిమ మేధ ఉపయోగించి మహిళా భద్రతకు బలహీన ప్రాంతాలను గుర్తించిన తర్వాత ఆటోమేటెడ్ సేఫ్టీ చెక్ కాల్స్‌ను ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఏదైనా ప్రమాదాన్ని గుర్తించడానికి, మహిళకు ప్రమాదం ఉన్నట్లు సంకేతాలను అందించే వాయిస్ రికగ్నిషన్‌ను కూడా ఎఐ ద్వారా అమలు చేయాలని ప్రతిపాదించారు. ప్రమాదాలను గుర్తించడానికి ఎప్పటికప్పుడు డ్రోన్ మరియు సిసిటివి ఫుటేజీలను తనిఖీ మరియు విశ్లేషణ చేయబడుతుందని ఆయన వివరించారు. డిజిపి తన ప్రజెంటేషన్‌లో విజన్ 2047 నాటికి పోలీసు విభాగంలో మహిళల నిష్పత్తిని 50శాతం వరకు పెంచాలని, పోలీస్ శాఖలో పనిచేసే మహిళలకు అనుగుణంగా తయారు చేయాలని ప్రతిపాదించారు. సామాజిక అవగాహన కోసం, ఎస్ ఎస్ సి ఇ ఆర్ టి తో కలిసి తెలంగాణా పోలీసులు క్లాస్ 1 నుండి క్లాస్ 10 వరకు సిలబస్‌లో మార్పులు చేసి, లింగతటస్థ కథనాలను చేర్చినట్లు తెలిపారు. అలాగే, తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్, 'సేఫ్ విలేజ్ ప్రోగ్రామ్'ను ఏడు జిల్లాల్లో ప్రారంభించింది. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోలీసుల మొదటి ఉమ్మడి చొరవగా 'సాహస్ ' కార్యక్రమం ద్వారా కార్పొరేట్ సంస్థలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటుకు శిక్షణ ఇస్తున్నట్లు డిజిపి వివరించారు.

## మున్సిపల్ సంస్థలలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం అన్నారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డితో కలిసి ఏసురత్నం సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఎసి) డాక్టర్ టి.కె. శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఏసురత్నం మాట్లాడుతూ జిల్లాలలో మున్సిపల్ కార్మికుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఖమ్మం జిల్లాలోని 15 మందిని ఔట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని కోరారు. కల్లూరు మున్సిపల్‌లో ఐదు నెలల నుండి కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. కార్మికులు అప్పులు చేసి విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మున్సిపల్‌లో 50 మంది కార్మికులని స్పెషల్ డ్రైవ్ అని పేరు పెట్టి కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారన్నారు. వారికి రూ. 10 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. అన్ని మున్సిపాలిటీలలో ఇచ్చినట్లు రూ. 16,500 వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా మున్సిపల్, తాగునీటి విభాగాలలో పనిచేస్తున్న కార్మికులని, పారిశుద్ధ్య పనులు చేయాలని చెప్పడం సరికాదన్నారు. వారిని యధావిధిగా తాగునీటి విభాగాలలో కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 15 క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు అమలు చేయాలన్నారు. ఈఎస్‌ఐ, పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్‌లో మరణించిన కార్మికులకు అంతిమ సంస్కారాల ఖర్చులు రూ. 30 వేలు ఇవ్వాలని కోరామని ఏసురత్నం చెప్పారు. కమిషనర్ సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.



## అడ్డుకునే వాళ్ళొద్దు
(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాలు విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని, పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని వెల్లడించారు. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. పదేళ్ల నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని అన్నారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంపై కేసులు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకు వచ్చామని, పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా, ఇక్కడి నేలకు నీళ్లు అందలేదని, మాయగాళ్ల మాటలు విని ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని సూచించారు. ఎంత డబ్బు ఖర్చయినా సరే మక్తల్ నారాయణపేట ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ చేశారు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌ను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నామని సిఎం తెలిపారు. వలసలు పోవటం వల్ల పాలమూరు జిల్లా బిడ్డలు విద్యకు దూరమయ్యారని అన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజురు చేశామని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఐఐటీ మంజూరు చేసుకున్నామని, పాలమూరు యూనివర్సిటీకి అడిగిన కోర్సులన్నీ మంజూరు చేశామని తెలిపారు. ఒకప్పుడు మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఛార్జీలకు ఇబ్బంది పడేవారని అన్నారు. ఛార్జీ డబ్బుల కోసం భర్త మీద, పిల్లల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని, మహిళలు ఉచితంగా బస్సుల్లో తిరుగుతుంటే కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. మహిళలు బస్సుల్లో ఉచితంగా తిరగటమే కాదు బస్సులకు యజమానులు అయ్యారని అన్నారు. పొదుపు సంఘాల మహిళలు పెట్రోలు బంక్‌లకు యజమానులు అయ్యారని, ధనవంతులు తిన్నట్టే పేదలు కూడా సన్నబియ్యం తినాలని భావించామని చెప్పారు. హైటెక్ సిటీలో 150 క్యాంటీన్లను మహిళా సంఘాలకు కేటాయించామని, పేదలందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారమైందని వివరించారు.
**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
నారాయణపేట, వనపర్తి జిల్లాల పర్యటనలో భాగంగా ముందుగా మక్తల్‌లో రూ.200 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మక్తల్ నారాయణపేట మధ్య 4 లైన్ల రోడ్డు నిర్మాణానికి, మక్తల్‌లో క్రీడాభవనం, ఇతర అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. వనపర్తి జిల్లాలో రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు, జూరాల దిగువన రూ.121.92 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కాగా, నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో వెలిసిన పడమటి అంజనేయస్వామి దేవాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆయనకు మక్తల్ పట్టణ అంబేద్కర్ చౌరస్తాలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జిల్లెల చిన్నారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి ఎస్‌పి డి.సునీత, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రేపు దేవాదాయ ఉద్యోగుల జెఏసి మహాసభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం బొగ్గులకుంటలోని సారస్వత భవనంలో ఉద్యోగుల సంఘాల జెఏసి ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించనున్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన 121 జిఒ సవరణ చేయాలని, అలాగే 2017 నుంచి విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌తో ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు జెఏసి నేత క్రిష్ణమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు హాజరవుతారన్నారు. జెఏసి నేతలు గంగు ఉపేంద్ర శర్మ, డివిఆర్ శర్మ, మారుతి సత్యనారాయణ, రవీంద్ర ఆచార్యులు, కాందారు కృష్ణమాచారి, చింతపట్ల అగ్నిహోత్ర చంద్రశేఖర్ శర్మ, తీగ వరపు ప్రసాద్, విద్యాసాగర్, నాగరాజు, ముకుందలతో పాటు పలువురు నేతలు ఈ మహాసభలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

# నిర్దేశిత సమయంలో మేడారం అభివృద్ధి పనులు పూర్తి



### ఆచార సంప్రదాయాలు, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
### మేడారం అభివృద్ధి పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు, ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు తదితర ప్రతి ఒక్క అంశంపై అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. పనులు కొనసాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రోడ్లు, భవనాలు, విద్యుత్‌శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వయంతో సాగాలని సిఎం సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్దపీట వేయాలని సిఎం తెలిపారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, రోడ్లు, భవనాల శాఖ ఎన్‌సి మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**తక్కువ వడ్డీతో అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు రుణాలు మంజూరు చేయండి : ఎ.రేవంత్ రెడ్డి**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సిఎం హడ్కో చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి, హడ్కో చైర్మన్ల మధ్య చర్చ జరిగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్షన్) అంశాన్ని సిఎం హడ్కో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో చైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సిఎం కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో చైర్మన్ సిఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని సిఎం కోరగా చైర్మన్ కులశ్రేష్ఠ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న భారత్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హడ్కో చైర్మన్‌ను సిఎం ఆహ్వానించారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్, హడ్కో రీజినల్ చీఫ్ పి.సుభాష్ రెడ్డి, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్లు ఆశీష్ గుండాల, సయ్యద్ రహీముద్దీన్ పాల్గొన్నారు.



# బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు కృషి

### నూతి బాధ్యతల స్వీకరణ సభలో డిప్యూటీ సిఎం భట్టి
### మంత్రులు తుమ్మల, పొంగులేటి, పలువురు కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భటి విక్రమార్క కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియామకమైన నూతి సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామని ఇది దేశానికే తలమానికం కానుందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని కేవలం సంక్షేమ పథకాల కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ వేదికగా పోరాడతామన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించిన రాష్ట్రపతి వద్ద ఆ బిల్లు ఆగిపోయిందన్నారు. ధర్నా చేసిన ఫలితం లేకుండా పోయిందని భట్టి తెలిపారు. బలహీన వర్గాలకు పార్టీ పరంగా అన్ని విధాలా మేలు చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ తల ఎత్తుకుని నిలబడేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబర్ 10 నుంచి 13 వరకు విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన నూతి సత్యనారాయణ కుటుంబం స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబమని నూతి అనంతరాములు తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. స్థలానికి సంబంధించి ప్రభుత్వానికి డబ్బులు కూడా చెల్లించామని ఆయన తెలిపారు. సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎంఎల్‌ఎలు రాంచందర్ నాయక్, రాగమయి, నాయకులు నాయుడు సత్యనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వైరా నుంచి భారీగా ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## అణు ఇంధన సంస్థలో ప్రైవేటు భాగస్వామ్యం
# అనాలోచిత నిర్ణయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశ ప్రతిష్టకు ప్రతీకగా నిలిచిన అణు ఇంధన సంస్థలో ప్రైవేటు భాగస్వామ్యం కలిపిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అనాలోచిత నిర్ణయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ అనాలోచిత, అనర్ధదాయక, కార్పొరేట్ అనుకూలమైన నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రతిష్టకు శాస్త్ర, సాంకేతిక రంగానికి ప్రతిబింబంగా నాటి నెహ్రూ ప్రభుత్వం అను ఇంధన శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అనేక విదేశీ రాజకీయ ఒత్తిళ్లను ఎదిరించి 1948లో అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేసి, దీనికి ఓమి జే బాబాను బాధ్యునిగా నియమించిందని పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ఆ కమిషన్‌నే డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఇ) పేరుతో ముంబాయి మహానగరంలో ఏర్పా టు చేశారన్నారు. హోమి జే బాబా, శాంతి స్వరూప్ బట్నాగర్, డి.ఎన్.వాడియా లాంటి అనేక మంది సైంటిస్టులతో కలిసి అహోరాత్రులు కష్టపడి డిఎఇ సంస్థను ప్రపంచ వ్యాపితంగా ప్రఖ్యాత సంస్థగా తీర్చిదిద్దారని వివరించారు. అణు ఇంధన సంస్థను భారత్ స్థాపించడం గిట్టని పెట్టుబడిదారి దేశాలు ఆ సంస్థ మూల పురుషుడైన ఓమి జే బాబాను విమాన ప్రమాదంలో చంపారనే పరిష్కారం కాని సంఘటన అని అన్నారు. అనేక రాష్ట్రాలల్లో అణు ఇంధనంతో నడిచే విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి భారతదేశానికి కావాల్సిన విద్యుత్‌ను అతి తక్కువ ఖర్చుతో దేశ ప్రజలకు అందించారని, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్‌ఎఫ్‌సి) హైదరాబాద్‌లో హెవీ వాటర్ ప్లాంట్‌ను కొత్తగూడెంలో, ఎలాక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను (ఇసిఐఎల్) హైదరాబాద్‌లో డిఎఇ విభాగాలు స్థాపించి, అనేక మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఇస్రో లాంటి సంస్థలకు కావాల్సిన ఇంధనాన్ని అభివృద్ధి చేసి వారి పరిశోధనల పురోభివృద్ధికి అండగా నిలబడిందని, భారతీయ శాస్త్రవేత్తల కృషి, త్యాగాలతో ఏర్పడి అభివృద్ధి పథంలో నడుస్తున్న అణు ఇంధన సంస్థలో స్వార్థపరులు, అవినీతిపరులు, దేశంకన్నా లాభాలే ప్రధానంగా భావించే ప్రైవేటు వారికి భాగస్వామ్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పటం ద్రోహపూరిత చర్యగా అభివర్ణించారు. దేశానికి అంకితమైన శాస్త్రవేత్తల కృషికి అవమానకరంగా కేంద్ర ప్రభుత్వ చర్య ఉన్నదని బోస్ మండిపడ్డారు.

# మహిళా సంఘాలకు మరో 448 ఆర్‌టిసి అద్దె బస్సుల కేటాయింపు

### మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహదం : మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్‌టిసి అద్దె బస్సులు కేటాయించడానికి సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) వెల్లడించారు. మహిళా సంఘాల నిబద్ధత, క్రమశిక్షణ రాష్ట్ర ప్రజా రవాణా రంగానికి కొత్త దిశను చూపుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.





ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 152 ఆర్‌టిసి అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో మరో 448 అద్దె బస్సులను మహిళా సంఘాలకే అప్పగించే ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తి చేసి, వాటిని ఆర్‌టిసికి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే ఆ బస్సులను ఆర్‌టిసికి అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఆర్‌టిసిలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తోందన్నారు. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభించడం, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలకంగా మారిందన్నారు. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల విజయవంతమైన నిర్వహణను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడటమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రత్య క్ష భాగస్వాములుగా మారడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. మహిళలు రాష్ట్రాభివృద్ధిలో మరింత భాగస్వామ్యం అవడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పేర్కొన్నారు.

# ఎసిబి పేరుతో వసూళ్లు.. ముఠా అరెస్టు



వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఎసిబి అధికారుల ముసుగులో వసూళ్లకు పాల్పడుతున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో ఆర్టీఓ కార్యాలయంలో అధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుల నుండి 13 సెల్‌ఫోన్లు, 9700ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్టోబర్ నెలలో వరంగల్ జిల్లా రవాణా శాఖలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మల జయపాల్ రెడ్డికి రాచంపల్లి శ్రీనివాస్ ఏసీబీ డీఎస్పీ అని కాల్ చేసి మీమీద అవినీతి ఆరోపణలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఇందుకోసం రూ.10 లక్షలను వివిధ మార్గాల్లో దోచుకున్నాడని తెలిపారు. దోచుకోగా వచ్చిన డబ్బుతో గోవా, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్ళి జల్సాలు చేసి ఖర్చు పెట్టాడని వివరించారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి శ్రీనివాస్ అలియాస్ మంగళ శ్రీనుపై 78 కేసులు ఉన్నాయని తెలిపారు. అతను జైలు నుండి విడుదలైన తర్వాత కూడా సులభంగా డబ్బులు సంపాదించాలని ఏసీబీ, పోలీస్ అధికారుల అవతారం ఎత్తి ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఎవరైనా అధికారులను ఇలా బెదిరింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఘరానా మోసగాడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి డి.కవిత, వరంగల్ ఎసిపి ఎన్.శుబం ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఎసిపి ఏ.మధుసూదన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్లు ఎల్.పవన్ కుమార్, కె.శ్రీధర్, ఎల్.మంగిలాల్, మిల్స్ కాలనీ ఇన్స్‌పెక్టర్ బి.రమేష్, ఎస్‌ఐలు ఎస్.మహేష్, ఎం.సురేష్, టాస్క్‌ఫోర్స్, మిల్స్ కాలనీ పి.ఎస్. సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులను అందజేసారు.

# ఫిబ్రవరిలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరిలో జరుగనున్న నేపథ్యంలో అంతకుముందు అన్ని జిల్లాల మహాసభలు, రాష్ట్ర సంఘాలు, ప్రజాసంఘాల మహాసభలు నిర్వహించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఎఐటియుసి కార్యాలయంలో సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించాలని, అలాగే వలస కార్మికుల జిల్లా మహాసభలను నిర్వహించాలని, అలాగే ఈనెల 14, 15వ తేదీలలో బెంగుళూరులో జరుగుతున్న వర్కింగ్ ఉమెన్ ఫోరం సమావేశానికి పి.ప్రేంపావని, కరుణ కుమారిని ప్రతినిధులుగా పంపించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఎఐటియుసి శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించింది. ఫిబ్రవరి 8న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును నిర్వహించాలని, ఇందుకు ఎం.నర్సింహ, రామాంజనేయులు, నరాటి ప్రసాద్, నవీన్ (మహబూబాబాద్), మేకల శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫిబ్రవరి 3వ ఆదివారం 'గిగ్ వర్కర్స్ యూనియన్' రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేయాలని, ఇందుకు బి.వెంకటేశం బాధ్యులుగా వ్యవహరించాలని కార్యవర్గ సమావేశం తీర్మానించిందన్నారు.

# రామగుండంలో విమానాశ్రయం పునరుద్ధరణ

### ఎంపి గడ్డం వంశీకృష్ణ వెల్లడి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం గత రెండు సంవత్సరాలుగా జరుపుతున్న కృషిని మరో ముందడుగుకు తీసుకెళ్లినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ విషయంపై అనేకసార్లు సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలించిన సైట్‌లో కొండలు ఉండటం, అడ్డంకులు ఉండటం వల్ల వారు ఆ లొకేషన్‌ను రిజెక్ట్ చేశారని, మరొకసారి వారిపై ఒత్తిడి చేసి, ప్రీఫీజిబిలిటీ స్టడీని కొత్త లొకేషన్‌పై నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ.50 లక్షలు ప్రీ ఫీజిబిలిటీ స్టడీ కోసం సెంటర్‌కు చెల్లించినట్లు ఎంపీ తెలిపారు. ఈ స్టడీని వేగవంతం చేయడానికి సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీలో మంత్రి రామ్మోహన్ నాయుడును మరోసారి కలిసి చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి ఈ విషయమై డిసెంబర్ 3 లేదా 4 తేదీలలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టీమ్ రామగుండం ప్రాంతాన్ని సందర్శించి, కొత్త ల్యాండ్ సర్వే చేస్తుందని, ప్రీ ఫీజిబిలిటీ స్టడీ పూర్తయ్యాక భూసేకరణ, తుది నిర్ణయాలకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారని అన్నారు. ఎయిర్‌పోర్ట్ స్థాపన వల్ల రామగుండం, సింగరేణి ప్రాంతం, పెద్దపల్లి, మంచిర్యాల్, ఆదిలాబాద్ జిల్లాలు సహా మొత్తం పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని, ఇది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తీసుకొస్తుందనీ, దీనికి రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని, రామగుండంలో ఎయిర్‌పోర్ట్ వచ్చేవరకు నేను నిరంతరం కృషి చేస్తాను అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

# తెలంగాణకు మణిహారం ఎర్త్ యూనివర్సిటీ

### నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
### ప్రపంచంలోనే ఇది రెండో విశ్వవిద్యాలయం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ఇప్పటికే పరిశ్రమల ఖిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. రవాణాకు సైతం అనువైన ప్రాంతం కావడంతో విలువైన ఖనిజ సంపదలు ఈ నెలలో నిక్షిప్తమై ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ క్యాబినేట్ ఆమోదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనిని భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల సృష్టి కర్త డా.మన్మోహన్ సింగ్ పేరిట నెలకొల్పుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభానికి నోచుకుంది.



**ప్రపంచంలోనే రెండోది..** ఇప్పటి వరకు పలు రకాల యూనివర్సిటీలు ఉండగా డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా రెండోది. భారతదేశంలోనే మొదటిది. అందునా భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు కావడం తెలంగాణకే గర్వ కారణంగా మారింది. దీంతో జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జియో కెమిస్ట్రి, ఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, మినరల్ సైన్స్ పర్యావరణ, భూగర్భ శాస్త్రం వంటి అత్యాధునిక కోర్సులు ఈ యూనివర్సిటీ ద్వారా ప్రపంచానికి అందించనున్నారు.

**యూజి నుండి పిహెచ్‌డి వరకు..** గ్రాడ్యుయేషన్ మొదలుకుని పోస్టు గ్రాడ్యుయేషన్, యూజిసి ప్రమాణాలతో పిహెచ్‌డి కోర్సులు అందించనున్నారు. దేశ విదేశాల నుండి ఈ ఎర్త్ యూనివర్సిటీలో చదువుకునేందుకు తరలిరానున్నారు. దీంతో ప్రపంచమే భద్రాద్రి వైపు తొంగిచూడనుంది. ఖనిజ సంపదకు జిల్లా కేంద్రబిందువుగా ఉండటంతో యూనివర్సిటీ ఏర్పాటుతో సార్ధకత చేకూరనుంది. ఇప్పటికే మినీ స్టీల్ ప్లాంట్, ఫెర్రో అలాయిస్ యూనిట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఐటిసి పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నేషనల్ హై వే, రైల్వే లైన్, గోదావరి నది సమీపంలో ఉన్నాయి. మరో ప్రక్క విమానాశ్రయం ప్రతిపాదనలో ఉంది.

**యువతకు మేలు..** జిల్లాలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మరోపక్క యూనివర్సిటీ కేంద్రంగా పరిశోధనా అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రపంచ దేశాల నుండి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఇక్కడికి రానుండటంతో విద్య పరంగా ప్రపంచంలోనే మేటిగా ఈ జిల్లా మారనుంది.



**కూనంనేని కృషి అమోఘం..** ఎర్త్ యూనవర్సిటీ ఏర్పాటులో కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కృషి అమోఘం. యూనివర్సిటీకి అనువైన ప్రాంతం కావడంతో తుమ్మల నాగేశ్వర రావు యూనివర్సిటీ ఏర్పాటుకు చొరవ చూపారు. దీంతో తుమ్మల, కూనంనేని కలిసి దీనిపై కసరత్తు చేసి వివరాలు తెప్పించుకుని యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ జితేష్ విపాటిల్‌ను పరిశీలన చేయాలని సూచించారు. దీంతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన వాతావరణం, పర్యావరణం, భౌగోళ స్థితి గతులను అధ్యయనం చేయడంతో యూనివర్సిటీ ఏర్పాటుకు ఇదే అనువైన ప్రదేశంగా తేల్చారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని చేరవయగా క్యాబినేట్ ఆమోదం అనంతరం డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీగా నామకరణం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ యూనివర్సిటీ నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.19, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి, యూసఫ్‌గూడ, హైదరాబాద్.

'ఇ'ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నెం. 28/EE/DIV-19/SLPZ/GHMC/2025-26, తేది: 01.12.2025

NIT No. 28/EE/DIV-19/SLPZ/GHMC/2025-26, పనుల సంఖ్య: (3) పనులు, అంచనా వ్యయం: రూ.70.195 లక్షలు, ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం: 02.12.2025న మ.02.00గం.ల నుండి 05.12.2025న మ.02.00గం.ల వరకు మాత్రమే. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్‌ఎంసి. శ్రీ బి.భద్రు. సెల్ నెం. 9989930549. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ -19, (ఎస్‌ఎల్‌పిజెడ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11589-PP/CL/ADVT/1/2025-26, Date: 01-12-2025

**శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము**
ఊరుకొండపేట, మం॥ ఊరుకొండ, జిలా॥ నాగర్‌కర్నూల్.

10/SAST/2025 బహిరంగవేలము ప్రకటన తేది: 01.12.2025

ఇందు మూలముగా సమస్త ప్రజానికానికి, మరియు గ్రామస్తులకు తెలియజేయటం ఏమనగా శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రా, ఊరుకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణా రాష్ట్రం యొక్క ఈ దిగువ తెలిపిన వివిధ టెండర్స్ బహిరంగవేలము మరియు సీల్డ్ టెండర్స్ ద్వారా తేది: 18.12.2025 గురువారము రోజు మధ్యాహ్నము 12:30 గం. లకు శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రామము నందు నిర్వహించుటకు నిర్ణయించుటమైనది. ఈ బహిరంగ వేలములో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరూ వేలంపాటకు ముందుగా మధ్యాహ్నము 12:30 గం.ల లోపల నిర్ణహించిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయటమైనది. సీల్డ్ టెండర్స్ నిర్ణయించిన డిపాజిట్ తో పాటు ముందుగా మధ్యాహ్నము 12:30 గం.ల లోపల సమర్పించగలరు. ఇతర వివరములకు ఫోన్: 9010901099 సంప్రదించగలరు.

| క్ర.సం. | పద్దుల వివరములు | కాల పరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 01.01.2026 TO 31.12.2026 | రూ. 500000.00 |
| 2 | తలనీలాలు సేకరణ హక్కు | 01.01.2025 TO 31.12.2026 | రూ. 100000.00 |
| 3 | కొబ్బరిముక్కలు సేకరణ హక్కు | 01.01.2026 TO 31.12.2026 | రూ. 100000.00 |
| 4 | కిరాణా సామగ్రి సరఫరా | 01.01.2026 TO 31.12.2026 | రూ. 10000.00 |
| 5 | దేవస్థాన షాప్స్ (3 years) | From 01.01.2026 | రూ. 10000.00 |

నోట్ : బహిరంగ వేలము మరియు సీల్డ్ టెండర్స్‌లో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరూ వేలంపాటకు ముందుగా టెండర్ షెడ్యూలు ఫారం రూ.500/- తీసుకోగలరు అని మనవి. ఇతర వివరములకు ఫోన్: 9010901099 సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి

DIPR R.O. No. : 11556-PP/CL/ADVT/1/2025-26, Date: 01-12-2025

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



**ప్రజాపక్షం/ హాలియా:** ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పి శరత్‌చంద్ర పవర్ అన్నారు. సోమవారం మండలంలోని పులిమామిడి గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగాలని ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని చెప్పారు. ఎన్నికల సమయంలో బెదిరింపులకు దౌర్జన్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. డబ్బు, మద్యం ప్రలోభాలు చూపడం వంటి చర్యలు చేపడితే నేరం చేసినట్లేనని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఎస్పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ దేశిడి సతీష్ రెడ్డి, ఎస్సై బండి సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనంలో ధ్యాన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక బౌద్ధ కేంద్రం బుద్ధ వనములో ప్రతి ఆదివారం ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధవనం మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో దమ్మ నాగర్జున విపష్యన కేంద్రం వలంటీర్ల చే ఈ ధ్యాన శిక్షణా తరగతుల కార్యక్రమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 11:30 నిమిషముల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 3.30 నిమిషముల వరకు ధ్యాన తరగతులు నిర్వహిస్తామన్నారు.ధ్యానం చేసుకునేవారు కేటాయించిన సమయంలోపు ధ్యాన మందిరంలోకి చేరుకొని, ధ్యానం ముగిసేవరకు ఉండాలని, ఈ అవకాశాన్ని బుద్ధవనం సందర్శకులు వినియోగించుకోవాలని వారు కోరారు.


# మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి రూల్స్

**ఊరి బయటే మద్యం షాపులను ప్రారంభించిన వ్యాపారులు**

**ఒంటి గంట తరువాతే షాపులు ఓపెన్, సాయంత్రం 6 గంటల నుంచి పర్మిట్ రూంలోకి అనుమతి**

**పంతం నెగ్గించుకున్న మునుగోడు ఎమ్మెల్యే**



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో మద్యం పాలసీకి భిన్నంగా మునుగోడులో రాజన్న రూల్స్‌ను మద్యం వ్యాపారులు అమలు చేయడం విశేషం. వచ్చే రెండు సంవత్సరాలకు గాను మద్యం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నూతన వైన్ షాపులకు టెండర్లు నిర్వహిస్తున్న క్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు ఊరి బయటే వైన్ షాపులను ఓపెన్ చేయాలని, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే విక్రయాలు మొదలు పెట్టాలని, సాయంత్రం 6 గంటల నుంచి పర్మిట్ రూంలోకి అనుమతివ్వాలని సూచన చేశారు. ఆ తర్వాత ఇదే విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్‌ని కలిసి వినతి పత్రం కూడా ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం రూల్స్‌కు భిన్నంగా వ్యవహరిస్తున్నాడన్న వివాదం చెలరేగింది. ప్రభుత్వ పెద్దలు పార్టీ పెద్దలనుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ తీసుకున్న నిర్ణయానికి వెనకడుగు వేయకుండా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి టెండర్లను వైన్ షాపులను దక్కించుకున్న యజమానులతో చర్చలు చేసి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం పట్ల నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా మద్యం షాపులు ఉంటాయి ఇందులో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 7 మినహాయించగా మిగతావన్నీ మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నాయి. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు 2 సంవత్సరాల గడువుతో ఇటీవల టెండర్లు నిర్వహించిన విషయం విదితమే. కాగా మద్యం షాపులకు కొత్తగా టెండర్లు వేసే సందర్భంలోనే మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునే యజమానులకు బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ అవ్వకూడదని, ఊరి బయటే మద్యం విక్రయాలు జరపాలని, సాయంత్రం 6 గంటల నుంచి మాత్రమే పర్మిట్ రూంలకు అనుమతించాలని పలు సూచనలు చేశారు. రాష్ట్ర అబ్కారి శాఖ పాలసీకి భిన్నంగా రాజన్న చేసిన సూచనలు ఉండటంతో ఈ అంశాలను రాజన్నకు గిట్టని వారు కొంతమంది కావాలని వివాదానికి తెర లేపారు. అయినప్పటికీ ఆయన ఎక్కడ వెనకడుగు వేయకుండా తన పంతాన్ని నెగ్గించుకునే ప్రయత్నం చేసి సఫలీకృతం అయ్యారు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులతో హైదరాబాదులోని తన నివాసంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాను సూచించిన అంశాలకు లోబడి మద్యం షాపులు నిర్వహించాలని వారితో చేసిన చర్చలు ఫలించడం వల్ల మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు నియోజకవర్గ వ్యాప్తంగా నూతన మద్యం దుకాణాలను సోమవారం ఊరి బయటనే ప్రారంభించి, మధ్యాహ్నం 1:00 గంటల నుండి విక్రయాలు మొదలు పెట్టారు. అధిక తాగుడు వద్దు ఆరోగ్యమే ముద్దు అనే రాజగోపాల్ రెడ్డి సంకల్పానికి మద్యం షాప్ యజమానులు మద్దతుగా నిలవడం పట్ల నియోజకవర్గ ప్రజల సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**బెల్ట్ షాపుల నిర్మూలనతో తగ్గిన క్రైమ్ రేట్**

ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరికే మద్యం వల్ల ఎంతోమంది యువకులు తాగుడుకు బానిసై తమ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్న తీరును చూసి, విచ్చలవిడిగా మద్యం సేవించి గ్రామాలలో అకారణంగా ఘర్షణలకు తావిస్తున్న తీరును చూసి, మద్యానికి బానిసై అనారోగ్యాలకు గురై ప్రజలు చనిపోతున్న సంఘటనలు చూసి చలించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే బెల్ట్ షాపులను నిర్మూలించారు. బెల్ట్ షాపులకు నిర్మూలించిన గ్రామాలకు అభివృద్ధి నిధులు కేటాయించారు. దీంతో గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడి మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా క్రైమ్ రేటు తగ్గిందని పోలీసులు విశ్లేషిస్తున్నారు. కొత్తగా మద్యం టెండర్ల ప్రక్రియ మొదలవగానే టెండర్ల ప్రక్రియలోనే మునుగోడులో మద్యం షాపుల నిర్వహణ, మద్యం నియంత్రణపై సూచనలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. మునుగోడులో మద్యం షాపులు నిర్వహించాలనుకునే వాళ్ళు తాము సూచించిన పద్ధతిలోనే నిర్వహించాలని బహిరంగంగా చెప్పారు. ప్రజలను ఆరోగ్యంగా, ఆర్థికంగా చిన్నబిన్నం చేస్తున్న మద్యం అధిక తాగుడుకు కళ్లెం వేయడానికి మద్యాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్యం షాపుల యజమానులు తోడ్పాటును అందిస్తూ మద్యం షాపులను నిర్వహించడానికి ముందుకొచ్చారు. మద్యం షాపుల నిర్వహణ నియంత్రణ విషయంలో రాజగోపాల్ రెడ్డి సంకల్పానికి మద్యం షాపుల యజమానులు అందిస్తున్న తోడ్పాటు ఆదర్శప్రాయంగా మారనున్నది.

## పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చ జరగకూడదన్నదే బిజెపి ఎజెండా

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** దేశంలో నెలకొన్న కీలక సమస్యలపై చర్చ జరగకూడదన్నదే బీజేపీ ఎజెండాగా కనిపిస్తోందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేవలం 15 రోజులు మాత్రమే పార్లమెంట్ శీతాకాల సమావేశాలను నిర్వహించాలని ఎన్డీయే, బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడమే ఎందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. సోమవారం పార్లమెంటు సమావేశాలకు హాజరు కావడానికి ముందు మీడియాతో ఆయన ఢిల్లీలో మాట్లాడారు. దేశంలో ఉన్న అనేక సమస్యలపై పార్లమెంటులో చర్చలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున సమావేశాలను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ భద్రతపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సెక్యూరిటీ ఆఫ్ పీపుల్, సెక్యూరిటీ ఆఫ్ డెమోక్రసీపై పార్లమెంట్‌లో చర్చ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర బాంబు దాడి జరిగితే కేంద్ర హోంశాఖ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఎస్.ఐ.ఆర్ (సర్) పేరిట ప్రజల ఓటు హక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. అధికారంలో పర్మినెంట్‌గా ఉండాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై విపక్ష పార్టీల ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని ఈ అంశంపైన నిలదీస్తామన్నారు. హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, అస్సాం, ఏపీ, తెలంగాణ లాంటి రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు కేంద్రం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. 18వ లోక్ సభలో తమ పట్టు కోల్పోకుండా ఉండేందుకు అలయన్స్ పార్టీలకు మాత్రమే మోడీ సర్కార్ నిధులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్లస్టర్ నామినేషన్ కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు నిర్వహించనున్న దామరచర్ల మండల కేంద్రంలోని దామరచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్లస్టర్‌లో ఇప్పటివరకు వచ్చిన నామినేషన్ల వివరాలను, నామినేషన్ పత్రాలు, నామినేషన్ వేసేందుకు వచ్చేవారికి హెల్ప్ డెస్క్ ద్వారా అందిస్తున్న సమాచారం, నామినేషన్ వేసేటప్పుడు సమర్పించాల్సిన ధృవపత్రాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్ తదితర అంశాలన్నింటిని పరిశీలించారు. వచ్చిన నామినేషన్‌లన్నింటిని ఎప్పటికప్పుడు స్కాన్ చేయడం, రిజిస్టర్‌లో నమోదు చేయడం, నామినేషన వివరాలను సకాలంలో డీపీవో కార్యాలయానికి పంపించడం, టీపోల్‌లో అప్‌లోచేయడం లాంటివి జాప్యం లేకుండా చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. నామినేషన్ స్వీకరించే గదిలో డిజిటల్ క్లాక్, వంద మీటర్ల పరిధిలో బందోబస్తు, ఓటరు జాబితా ప్రచురణ తదిర అంశాలను కూడా ఆమె పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో, ఎంపీవో, ఆర్వో తదితరులు ఉన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని మిస్సింగ్

**పాఠశాల ఎస్ఓ పుష్పలతను సస్పెండ్ చేసిన కలెక్టర్**

**డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ**

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కస్తూర్బా పాఠశాల నుండి విద్యార్థిని మిస్సయిన సంఘటన చోటుచేసుకుంది. ఆ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ సిఇసి చదువుతున్న ఓ విద్యార్థిని గత నెల ఏడున ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి గత నెల 30 తేదీన ఆదివారం ఉదయం ఏడు గంటలకు తమ సమీప బంధువు వచ్చి తొలివెళ్లగా ఆరోజు సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చుంటూ తోటి విద్యార్థులతో కలవకుండా ఏకాంతంగా గడిపింది. సుమారు సాయంత్రం ఏడు గంటల సమయంలో విద్యార్థినిలకు భోజనం పెట్టే సమయానికి ఆ విద్యార్థిని కనిపించకపోవడంతో పాఠశాలలో ఇన్చార్జి ఉపాధ్యాయురాలు చుట్టుపక్కల వెతికిన కనిపించకపోవడంతో ఆ పాఠశాల ఎస్ఓ పుష్పలత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం జిసిడిఓ అరుంధతి,చండూరు సిఐ ఆదిరెడ్డి మునుగోడు ఎస్సై ఇరుగు రవి పాఠశాలను సందర్శించి ఆ విద్యార్థి యొక్క వివరాలను అడిగి తెలుసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ పాఠశాల ఎస్ఓ పుష్పలతను సస్పెండ్ , డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులని , డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలు రాధకు షోకాజ్ నోటీస్ జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

## వాహనాల తనిఖీలో మద్యం పట్టివేత

**రూ. 1 లక్ష విలువైన 528 క్వార్టర్ బాటిల్స్ సీజ్**



**ప్రజాపక్షం/చివ్వెంల :** వాహనాల తనిఖీలు చేస్తుండగా రూ. ఒక లక్ష విలువైన 528 క్వార్టర్ మద్యం బాటిల్స్ సీజ్ చేసిన సంఘటన చివ్వెంల మండలంలో చోటుచేసుకుంది. చివ్వెంల ఎస్ఐ వి మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దురాజుపల్లి ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా టిజి 29 టి 0002 నంబరు గల ఎర్టిగా కారులో అనుమతి లేకుండా (11) ఇంపీరియల్ బ్లూ క్వార్టర్ బాటి ల్స్ కాటన్‌లు సూర్యాపేట నుండి మున్యానాయక్ తండకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవర్ ధరావత్ సైదా, అట్టి సరుకును కొను గోలు చేసిన ధరావత్ నాగులను విచారించి పంచనామా జరిపి మద్యాన్ని, కారును సీజ్ చేసి చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. సీజ్ చేసిన మొత్తం మద్యం 528 క్వార్టర్ బాటిల్స్ విలువ లక్ష రూపాయలు ఉంటుందన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఎవరైనా బెల్ట్‌షాపులు నడపడం నిషేధం ఉంద న్నారు. ఎవరైనా మద్యాన్ని ఇండ్ల వద్ద గాని, షాపుల యందు గాని నిల్వ ఉం చినా, రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీకి అధికసంఖ్యలో ఆసక్తి



రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి గ్రామాలలో ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పోటీకి వస్తున్నారని తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందేనన్నారు. సూర్యాపేట నియోజక వర్గానికి సంబంధించి 2 మండలాలు మొదటి విడతలో, మిగిలిన 2 మండలాలు రెండో విడతలో పూర్తి చేసే కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రకటించిందని వివరించారు. గ్రామాల్లో విశేష స్పందన కనిపిస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఫలాలను అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులలో ఎక్కువగా మహిళలకు, బిసిలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాని ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని ఒకవేళ ఎన్నికలు ఆలస్యమైతే గ్రామాలకు అందవల్సిన నిధులు తిరిగి వెళ్ళే పరిస్థితి ఉన్నందున ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందని కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు, మహిళా సంఘాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చి వారిని కోటీశ్వర్లుగా చేసే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, దేవేందర్, బైరబోయిన శ్రీనివాస్, యాట వెంకన్న, నేరెళ్ళ మధు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా జోనల్ అధికారులు విధులు



**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా జోనల్ అధికారులు తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల జోనల్ అధికారులతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమీక్షించి తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోనల్ అధికారులు ఎన్నికల నిర్వహణలో కీలక సమన్వయకర్తగా పోలింగ్ సాఫీగా జరిగేలా, శాంతి భద్రత కాపాడబడేలా, సామగ్రి మరియు సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండేలా చూసే బాధ్యత జోనల్ అధికారుల పై ఉందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జోనల్ అధికారులు చాలా కీలకమైన బాధ్యతలు నిర్వహించాలని, ఎన్నికల నిర్వహణపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తమ జోన్లో వచ్చే అన్ని పోలింగ్ స్టేషన్లపై పర్యవేక్షణ, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చర్యలు సరిగా జరుగుతున్నాయో లేదో పరిశీలించాల్సిన బాధ్యత జోనల్ అధికారులు పై ఉందన్నారు. పోలింగ్ స్టేషన్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలన్నారు. పోలింగ్ అధికారుల నియామకం, శిక్షణ, హాజరు వంటి విషయాలను తరచూ పర్యవేక్షించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎన్నికల సామగ్రి సరఫరా, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీ వంటి అవసరమైన సామగ్రి పోలింగ్ సిబ్బందికి అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, యంపిడిఓలు, జోనల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫేస్2 రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రిటర్నింగ్ అధికారికి పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అభ్యర్థి రోజు వారి ఎన్నికల ఖర్చు వివరాలను తనిఖీ చేయడం, వివరాలు ఇవ్వడంలో విఫలమైతే వారికి నోటీసులు జారీ చేసే అధికారం ఉందన్నారు. సూర్యాపేట జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం మీ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

**నామినేషన్ సరళిపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మండల ఎన్నికల అధికారి టి ఆంజనేయులు, తహశీల్దారం యం వెంకన్నలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో సుమారు అర గంట పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం మామిళ్ళగూడెం నామినేషన్ కేంద్రం పరిశీలన చేశారు. మండలంలోని పలు క్లస్టర్‌లలో నామినేషన్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి వివరాలు తప్పులు లేకుండా సక్రమంగా నామినేషన్ పత్రాలు నింపే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విషయంలో అధికారులు సమయస్ఫూర్తితో ఉండాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు.

**నామినేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని చందుపట్ల గ్రామ పంచాయితీ నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియను పరిశీలించి, రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ దయాకర్, పంచాయితీ కార్యదర్శులు, జిపిఓలు ఉన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి : ఎస్పి



**ప్రజాపక్షం/చివ్వెంల :** రెండో విడుత గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ చివ్వెంల మండల కేంద్రం, చందుపట్ల గ్రామాలలో ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను, పోలీస్ బందోబస్తును పరిశీలించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, చివ్వెంల ఎస్ఐ వి మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.


**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే పిడియాక్ట్**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఆమలులోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గ్రామ పంచాయితీ ఎన్నికలు 2025 దృష్ట్యా పోలీసు శాఖ ప్రణాళికతో పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలుకు నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరు ఎన్నికల కోడ్ నియమావళిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు చాలా కీలకమన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే, అలవాటుగా నేరాలకు పాల్పడితే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సిఎం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఈనెల 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నల్గొండ జిల్లా దేవరకొండ మునిసిపాలిటిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనే నిమిత్తం దేవరకొండకు వస్తున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్‌లు సోమవారం పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న పనులు, హెలిప్యాడ్, బహిరంగ సభ, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిక లోబడి విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని అధికారులకు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్‌తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంకేఆర్ పరిసరాలు, అలాగే ముదిగొండ రోడ్‌లో హెలిప్యాడ్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పబ్లిక్ మీటింగ్ స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమణారెడ్డి, డిఎస్పి శ్రీనివాస్‌రావు, మునిసిపల్ కమిషనర్, ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీధర్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తదితర శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పార్లమెంట్‌కు కుక్కతో రేణుకా చౌదరి

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం నాడు ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరి కారులో కుక్కను పార్లమెంటు ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఇది గమనించిన భద్రతాసిబ్బంది ఆ కుక్కను తిరిగి ఆమె నివాసానికి పంపేశారు. దీనిపై బిజెపి విమర్శలు గుప్పించింది. ఇది ఎంపిలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలను దుర్వినియోగం చేయడమమే అవుతుందని విమర్శించింది. అయితే దీనిపై రేణుకా చౌదరి ఘాటుగా స్పందించారు. 'ఒక మూగజీవి కారులో ఉండే వారికి ఎందుకు అంత ఇబ్బంది? దీనిపై ఏదైనా చట్టం ఉందా? నేను వస్తుండగా దారిలో ఒక స్కూటరు, కారు ఢీకొన్నాయి. చిన్న కుక్క రోడ్డుపై తిరుగుతోంది. దానికి దెబ్బతగిలి ఉంటుందని అనిపించి దానిని కారులో ఎక్కించుకున్నాను. నేరుగా పార్లమెంటుకు వచ్చాను. వెంటనే దాన్ని వెనక్కి పంపించేశాను. కారు వదిలిపెట్టినట్టే కుక్క విషయంలోనూ చేశాను. దీనిపై చర్చించేదేముంది? కుక్కపిల్ల ఎవరినీ కరవదు. నిజంగా కాట్లు పడిన వారు పార్లమెంటులో కూర్చున్నారు. వాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

### సిద్ధరామయ్యను బ్రేక్‌ఫాస్ట్‌కు
## ఆహ్వానించిన డికె



**బెంగళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల తన నివాసంలో బ్రేక్‌ఫాస్ట్‌కు ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను ఆహ్వానించారు. తాజాగా డికె శివకుమార్ మంగళవారంనాడు తన ఇంట్లో ఇచ్చే అల్పాహారం కోసం రావాల్సిందిగా సిద్ధరామయ్యను ఆహ్వానించారు. ఈ విషయాన్ని డికె కార్యాలయం ధ్రువీకరించింది. సిద్ధరామయ్య, డికె మధ్య అధికార పంపణీ విషయంలో విభేదాలు తలెత్తడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవల ఇద్దరు నేతలకు కొన్ని సూచనలు చేసింది. ముందుగా ఇరువురు నేతలు కలిసి చర్చించుకోవాలని, ఐక్యతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. పార్లమెంటు సమావేశాలు ఉన్నందున దానిపైనే ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ...ఇరువురు నేతలను వేచిచూడాలనే సందేశాన్ని పంపినట్టు సమాచారం. ఈ క్రమంలో తొలుత సిద్ధరామయ్య తన నివాసంలో ఇచ్చిన బ్రేక్‌ఫాస్ట్‌కు డికె హాజరయ్యారు. కాగా, డికె బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చే అవకాశంపై సిద్ధరామ్యయను మీడియా ప్రశ్నించినప్పుడు, తనను కలిసినప్పుడు మంగళవారంనాడు ఇంటికి రావాలని మాత్రమే డికె చెప్పి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి పిలుపు రాలేదని, పిలిస్తే తప్పనిసరిగా వెళ్తానని సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారంనాడు బ్రేక్‌ఫాస్ట్‌కు రావాల్సిందిగా సిద్ధరామయ్యను డికె ఆహ్వానించినట్టు ఆయన కార్యాలయ వర్గాలు సోమవారం వెల్లడించాయి.

## పార్లమెంట్‌లో డ్రామాకు చోటు లేదు

### నిరాశను వెళ్లగక్కేందుకు సభలను ప్రతిపక్షాలు ఉపయోగించుకుంటున్నాయ్ : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. పార్లమెంటు నాటకీయతకు వేదిక కాదని, ప్రసంగించడానికి ఒక వేదిక అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరాశను వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా సభను మార్చారని ఆరోపించారు. శీతాకాల సమావేశాలకు ముందు పార్లమెంటు వెలుపల విలేకరులతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సమావేశం రాజకీయ నాటకీయతకు వేదికగా మారకూడదని, నిర్మాణాత్మక, ఫలితాల ఆధారిత చర్చకు వేదికగా మారాలని, రాజకీయాల్లో సానుకూలతను తీసుకురావడానికి ప్రతిపక్షాలకు చిట్కాలు ఇవ్వాలని ఆయన సూచించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఎన్నికల జాబితాపై ప్రతిపక్షాల నిరసనల కారణంగా పార్లమెంటు వర్షాకాలు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై చర్చించకపోతే పార్లమెంటు శీతాకాల సమావేలను కూడా స్తంభింపచేస్తామని ప్రతిపక్షాలు హెచ్చరించాయి. ప్రధాని స్పందిస్తూ కొంతకాలంగా, మన పార్లమెంటును ఎన్నికలకు వేడెక్కించే వేదికగా లేదా ఓటమి తర్వాత నిరాశకు దారితీసే వేదికగా ఉపయోగిస్తున్నారని మోదీ మండిపడ్డారు. బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల పరాజయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతిపక్షాలు ఎన్నికల ఓటమితో కలవరపడ్డాయని, వైఫల్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయని ఆయన అన్నారు. బిహార్ ఎన్నికల్లో నమోదైన రికార్డు ఓటింగ్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలమని, ప్రతిపక్షాలు కూడా తమ బాధ్యతను నిర్వర్తించాలని, ప్రతిపక్షంతో సంభాషించరని ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరాశ నుండి బయటపడాలని సూచించారు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలని, కొన్ని చిట్కాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

### ప్రధాని మోదీ
## 'అతిపెద్ద డ్రామాబాజ్'



**న్యూఢిల్లీ :** చట్టసభల్లో డ్రామాలొద్దని, టిప్స్ ఇస్తానంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విసిరిన వ్యంగ్యాస్త్రాలపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. మోదీ 'అతిపెద్ద డ్రామాబాజ్' అని అభివర్ణించింది. పార్లమెంటులో ప్రతిపక్షాలు నాటకం ఆడుతున్నాయని ఆరోపించిన ఆయన ప్రకటన వంచన తప్ప మరొకటి కాదు అని పేర్కొంది. శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు మోదీ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందించారు. ప్రజల నిజమైన సమస్యను పరిష్కరించడానికి బదులుగా, ప్రధానమంత్రి మోదీ మరోసారి తన 'డ్రామేబాజీ డెలివరీ'ని చేశారని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వం పార్లమెంటరీ మర్యాద, వ్యవస్థను నిరంతరం తుంగలో తొక్కుతోందని, అలాంటి ఘటనల జాబితా అందరికీ తెలిసిందేనన్నారు. 'బిజెపి ఇప్పుడు ఈ పరధ్యాన నాటకాన్ని ముగించి, ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలపై పార్లమెంటు చర్చలో పాల్గొనాలి' అని ఖర్గే అన్నారు. సామాన్యులు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత, దేశంలోని విలువైన వనరులను దోచుకోవడంతో పోరాడుతున్నారని, అధికారంలో ఉన్నవారు అధికార దురహంకారంతో డ్రామాబాజీ ఆట ఆడుతున్నారని మండిపడ్డారు. గత వర్షాకాల సమావేశాల్లో కనీసం 12 బిల్లులను త్వరితంగా ఆమోదించారని, కొన్ని 15 నిమిషాల కంటే తక్కువ సమయంలో, మరికొన్నింటిని ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించారన్నారు. 'రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, జిఎస్‌టి, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత వంటి బిల్లులను ఎలా బుల్డోజ్ చేశారో దేశం మొత్తం చూసిందన్నారు. సర్ ప్రక్రియలో పనిభారం కారణంగా బిఎల్‌ఒలు నిరంతరం ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతిపక్షం 'ఓట్ల దొంగతనం' వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటోందని, తాము వాటిని పార్లమెంటులో నిరంతరం లేవనెత్తుతామని చెప్పారు. ప్రధాని ఎప్పుడూ పార్లమెంటుకు హాజరు కారని, దానిని బలహీనపరుస్తారని, ప్రతిపక్షంతో సంభాషించరని రమేష్ అన్నారు. అయినప్పటికీ ప్రతి సమావేశానికి ముందు ఆయన పార్లమెంటు భవనం వెలుపల నిలబడి, లోక్‌సభ, రాజ్యసభ సజావుగా సాగడానికి ప్రతిపక్షాల నుండి నిర్మాణాత్మక సహకారం కోరుతూ జాతిని ఉద్దేశించి గొప్పగా మాట్లాడతారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ప్రారంభమయ్యే ముందు ప్రధాని చేసిన ప్రకటన కపటత్వం తప్ప మరొకటి కాదు, వాటిలో అతిపెద్ద డ్రామాబాజ్ డ్రామా గురించి మాట్లాడటమని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు కనీసం తమ అభిప్రాయాన్ని చెప్పడానికి అవకాశం ఇవ్వకుండా ఆయన ఎల్లప్పుడూ తన ఇష్టానుసారం ఉండాలని కోరుకుంటాటాడన్నారు.

**తీవ్రమైన అంశాలపై చర్చ కోరితే డ్రామా ఎలా అవు-తుంది..? : ప్రియాంకాగాంధీ**

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఢిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణలో అవకతవకలు, ఎస్ఐఆర్, కాలుష్యం వంటివి తీవ్రమైన అంశాలని, వాటిని చర్చిద్దామని ప్రియాంకాగాంధీ అన్నారు. సీరియస్ అంశాలపై చర్చ లేకపోతే పార్లమెంట్ దేనికి..? అని ఆమె ప్రశ్నించారు. ఆయా అంశాలపై మాట్లాడటమేమీ డ్రామా కాదని, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అని వ్యాఖ్యానించారు.

### ఎస్ఐఆర్ పని ఒత్తిడి..
## మరో బిఎల్ఒ ఆత్మహత్య



**బరేలి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో పని ఒత్తిడి కారణంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒ) ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు కలవరపెడుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో బిఎల్ఒ బాధ్యతల్లో ఉన్న 46 ఏళ్ల ప్రభుత్వ టీచర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనను మొరాదాబాద్‌లోని భగత్‌పూర్ తాండా విలేజ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అసిస్టెంట్ టీచర్ సర్వేశ్ సింగ్‌గా గుర్తించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పనులతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాయని, తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యానని సింగ్ రికార్డు చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆత్మహత్య చేసుకుంటున్నందుకు క్షమించాలని కుటుంబసభ్యులను ఆ వీడియోలో కోరారు. ఆయనకు భార్య బాబ్లి, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం, బహెరి గ్రామంలోని తన నివాసంలో సింగ్ ఉరేసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆయన ముందుగా ఈ విషయాన్ని గుర్తించారు. తనకిచ్చిన పని పూర్తి చేసేందుకు తగిన సమయం లేకపోయిందని, పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందని పేర్కొంటూ సింగ్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపినట్టు ఠూకూర్ద్వారా సర్కిల్ ఆఫీసర్ ఆశిష్ ప్రతాప్ సింగ్ తెలిపారు.

## రాజ్యసభ చైర్మన్ ఇద్దరికీ ముఖ్యుడే...

### మాజీ చైర్మన్ ధన్‌ఖడ్ నిష్క్రమణపై ప్రస్తావన

రాజ్యసభలో ప్రతిపక్షనేత
మల్లికార్జున ఖర్గే వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** మాజీ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ మాజీ చైర్మన్ జగదీప్ ధన్‌ఖఢ్ ఆకస్మికంగా, ఊహించని విధంగా విధుల నుంచి నిష్క్రమించడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ప్రస్తావించారు. దీంతో అధికార పారీట సభ్యుల నుంచి కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. ఇది సందర్భంగాక కాదని పేర్కొన్నారు. కాగా, ధన్‌ఖడ్ రాజీనామా తరువాత ఉపరాష్ట్రతిగా సిపి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ఆయన రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఉండడంతో సోమవారం తొలిసారిగా రాజ్యసభకు విచ్చేశారు. దీంతో చైర్మన్ రాకను ప్రతిపక్ష పార్టీల తరపున ఖర్గే స్వాగతించారు. ఈ నేపథ్యంలోనే ధన్‌ఖడ్ అంశాన్ని, సమావేశాల ప్రారంభానికి కంటే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనను కూడా ప్రస్తావించారు. 'రాజ్యాంగ విలువలు, అనాదిగా గౌరవించబడిన పార్లమెంటరీ సంప్రదాయాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుంది' అని ఆయన అన్నారు. కార్యక్రమాల నిర్వహణలో సహకరిస్తామని హామీనిచ్చారు. అయితే, కార్యక్రమాల న్యాయమైన, నిష్పాక్షికమైన నిర్వహణ, ప్రతి పార్టీ సభ్యులకు న్యాయమైన అవకాశం కల్పించడం, ఈ కార్యాలయం విశ్వసనీయతకు చాలా అవసరం అని ఆయన అన్నారు. పార్లమెంటరీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా చైర్మన్ పదవి నుండి ఊహించని, ఆకస్మికంగా ధన్‌ఖడ్ నిష్క్రమించడాన్ని తాను ప్రస్తావించాల్సి వచ్చిందన్నారు. సభ సంరక్షకుడిగా రాజ్యసభ చైర్మన్ ప్రభుత్వానికి ఎంత ముఖ్యమో, ప్రతిపక్షానికి కూడా అంతే ముఖ్యుడని అని ఖర్గే అన్నారు. దీంతో అధికార పార్టీ బెంచ్‌ల నుండి కాస్త గందరగోళం నెలకొంది. ఈ సభకు ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలికే అవకాశం లభించకపోవడం తనకు నిరాశ కలిగించిందని కూడా ఖర్గే పేర్కొన్నారు. రాధాకృష్ణన్ కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్న మూడు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన మాజీ ఎంపి సికె కుప్పుస్వామికి బంధువు అని ఖర్గే కూడా ప్రస్తావించారు. 'మీరు రెండు పార్టీల మధ్య సమతుల్యతను పాటిస్తే మంచిది. మీరు విజయవంతంగా పదవీ కాలం గడపాలని కోరుకుంటున్నాను... మీరు వచ్చిన నేపథ్యాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు, కానీ మీరు కాంగ్రెస్ కుటుంబానికి చెందినవారని కూడా మీరు మర్చిపోకూడదు' అని ఆయన అన్నారు. అయితే ప్రధానమంత్రి పార్లమెంట్ వెలుపల ఒక ప్రకటన చేశారని, ఆయన పరోక్షంగా తమపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. దానికి తాము సభలో సమాధానం ఇస్తామన్నారు. 'సమస్యలపై చర్చించకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపి చేస్తున్న డ్రామాను ఆపేయాలి. సాధారణ పౌరులు నిరోద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలతో ఇబ్బందులు పడుతున్నారు. పార్లమెంట్‌లో మణిపుర్ సమస్య లెవనెత్తినప్పుడు అందరూ మౌనంగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాక దానిపై చర్చించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల పనిఒత్తిడి పెరిగి అనేక మంది బిఎల్‌ఒలు ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రతిపక్షాలు ఓట్ చోరీపైనా పోరాడాతున్నాయి. ఈ అంశంపైన పార్లమెంట్‌లో చర్చించేవరకు నిరంతరం పోరాడుతాం' అని ఖర్గే అన్నారు.

## సరిహద్దుల్లో కాపలా లేకపోవడమే పెద్ద సమస్య

### భారతీయుల రాకతో అపార ప్రయోజనం పొందిన అమెరికా:ఎలాన్‌మస్క్

**న్యూయార్క్:** భారతీయ నైపుణ్యంవల్ల, భారతీయులు వలస రావడంవల్ల అమెరికా అపార ప్రయోజనాలు పొందిందని ప్రపంచ కుబేరుడు, ఒకప్పటి ట్రంప్ అనుంగు మిత్రుడు ఎలాన్ మస్క్ అన్నారు. ''పీపుల్స్ బై డబ్ల్యుటిఎఫ్'' పేరుతో ఆదివారం విడుదలైన పాడ్‌కాస్ట్‌లో ఎలాన్ మస్క్ తన మనస్సులో ఉన్న అనేక అభిప్రాయాలు పంచుకున్నారు. పెట్టుబడిదారుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త నిఖిల్ కామత్‌కు పాడ్ కాస్ట్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎలాన్‌మస్క్ మాట్లాడుతూ, హెచ్1బి వీసాలు దుర్వినియోగం కావడంవల్ల వలసలు విపరీతంగా పెరిగాయని, ఈ వలసలవల్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఈ వ్యతిరేకతే కొత్త పరిణామాలకు దారితీసిందని అన్నారు. అదేసమయంలో ఆయన హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌కు చాలా బలంగా మద్దతు తెలియజేశారు. వీసాల దుర్వినియోగంవల్ల ఈ విధమైన పరిణామాలు సంభవించడం అమెరికాకు చాలా నష్టం కలిగించిందన్నారు. ఐతే ప్రపంచంలో అపారమైన ప్రతిభగలవారికి అవకాశం ఇచ్చేందుకు తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాంటివారికి సగటువేతనాలకంటే చాలా ఎక్కువగా చెల్లిస్తామన్నారు. అమెరికాకు రావాలని కోరుకునే యువ భారతీయులను తాము ఎప్పుడూ గౌరవిస్తామన్నారు.

''ఔను, ప్రతిభావంతులైన భారతీయుల నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడంవల్ల అమెరికా బ్రహ్మాండంగా ప్రయోజనాలు పొందింది, వారు అమెరికాకు రావడంవల్ల దేశానికి ప్రయోజనం కలిగింది'' అన్నారు మస్క్. హెచ్ 1 బి వీసా ప్రోగ్రామ్‌ను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేశాయని, దీనివల్ల ప్రతిభావంతులకు నష్టం జరిగిందని, ఇదే అమెరికాకు నష్టం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయకుండా ఉండాల్సిందన్నారు. హెచ్1 బి వీసాలను తాను రద్దుచేయాలని కోరుకోవడంలేదన్నారు. దేశంలోకి వలసలు విపరీతంగా జరుగుతున్నాయని, వీరిలో ఎలాంటి అర్హత పత్రాలు లేకుండా సరిహద్దుల నుండి దేశంలోకి చొరబడుతున్నారని, గత ప్రభుత్వం సరిహద్దుల్లో సరైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంవల్ల పొరుగు దేశాల నుండి ఇష్టానుసారంగా దేశంలోకి వలసలు వచ్చారని, వీరంతా ప్రభుత్వం నుండి ప్రయోజనాలు పొందడంతో మరిన్ని వలసలు పెరిగాయన్నారు. ఈ వలసలే అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడటానికి కారణమైందని, ఇది నైపుణ్యంగల ఇతర దేశీయులపైన, ప్రతిభావంతుల వలసపైన కూడా తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. అమెరికా దేశానికి ప్రతిభావంతుల అవసరం ఎప్పుడూ ఉంటూనే ఉంటుందని, ప్రతిభావంతులకు దేశం తలుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయని ఎలాన్‌మస్క్ అన్నారు. చాలా దేశాలకు ఇలాంటి పరిస్థితి ఉందన్నారు. జో బైడెన్ దేశాధ్యక్షుడుగా ఉండగా దేశంలోకి విపరీతంగా వలసలు జరిగాయని విమర్శించారు. ప్రాథమికంగా సరిహద్దుల్లో ఎక్కడా కాపలా లేకుండాపోయిందని, అందువల్ల అక్రమ వలసలను అరికట్టడానికి, అనర్హులను అదుపు చేయడానికి సరిహద్దులను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డోనాల్డ్ ట్రంప్ కూడా గతంలో దాదాపు ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఆయన గొప్ప ప్రతిభావంతులను దేశానికి ఆహ్వానిస్తామని చెబుతున్నారు. కాకపోతే చిన్న చిన్న ఉద్యోగాలలో కూడా తక్కువ జీతాలు ఇచ్చేందుకు వలసలను కొన్ని టెక్నాలజీ కంపెనీలు ప్రోత్సహించి వీసాలను దుర్వినియోగం చేశాయని ట్రంప్ ఇంతకుముందు విమర్శించారు. గడచిన సెప్టెంబరునెలలో ట్రంప్ విదేశీ కార్మికులు దేశంలోకి ప్రవేశించడంపై ఆంక్షలు అమలు చేశారు. ఇకమీదట హెచ్1బి వీసా పొందాలనుకున్నవారు ఒకేసారి 1,00,000 డాలర్లు చెల్లించాలని నిబంధన విధించారు. దీంతో టెక్నాలజీ కంపెనీలు గగ్గోలు పెట్టాయి.

### పునర్వినియోగ ఇంధనంపై
## కేంద్రం చెప్పేవన్నీ వట్టి కబుర్లే

### ఆదివాసీలను వెళ్ళగొట్టి అడవులను నాశనం చేస్తున్నారు
### రాజ్యసభలో మంత్రి బండారం బయటపడిందని

సిపిఐ ఎంపి సునీర్ విమర్శ



**న్యూఢిల్లీ:** దేశంలో రోజు రోజుకూ బొగ్గు ఉత్పత్తి పెరిగిపోతూ ఉండటంతో, పునర్వినియోగ ఇంధనంవైపు దేశం పరివర్తన చెందుతోందని కేంద్ర ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలన్నీ వట్టి కబుర్లు మాత్రమేనని కేంద్రమంత్రి ప్రకటన ద్వారా మరోసారి రుజువైంది. పార్లమెంటు సమావేశాల ప్రారంభం సందర్భంగా మొదటిరోజు సోమవారం రాజ్యసభలో సిపిఐ సభ్యుడు పిపి.సునీర్ లేవనెత్తిన ఒక ప్రశ్నకు బొగ్గుశాఖామంత్రి ఇచ్చిన సమాధానం కేంద్ర ప్రభుత్వ బూటకపు మాటలను చాలా స్పష్టంగా బహిర్గతం చేసింది. మంత్రి సమాధానంపై ఎంపి సునీర్ తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వాతావరణాన్ని పాడుజేస్తున్న ప్రభుత్వ విధానాలను విమర్శించారు. సిపిఐ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో 2015 తర్వాత బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించిన అధికారిక కార్యకలాపాలను సర్వస్వతంత్రంగా విశ్లేషించాలని సునీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీశాఖద్వారా అడవులను ఎంతమేరకు ఎవరెవరికి కేటాయించారో, పర్యావరణ ప్రయోజనాలకు భిన్నంగా అడవులను ఎటువైపు మళ్ళించారో వివరాలన్నీ పూర్తిగా బహిర్గతం చేయాలని కోరారు. పర్యావరణానికి హాని కలిగించే ఉపశమన విధానాలను అన్నింటినీ తక్షణం రద్దు చేయాలని, బొగ్గు ఉత్పత్తులపై దేశం ఆధారపడకుండా, బొగ్గు వినియోగాన్ని తగ్గించడంతోపాటు, పునర్వినియోగ ఇంధనం వైపు దేశం పరివర్తన చెందడానికి ఒక విశ్వసనీయమైన, కాలపరిమితితో కూడిన బృహత్తర ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బొగ్గు వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు కేంద్రం ప్రాముఖ్యతనిచ్చి శరవేగంగా చర్యలు తీసుకుంటున్నదని, వాతావరణాన్ని పరిరక్షించేందుకు పునర్వినియోగ ఇంధనంవైపు దేశం పరివర్తన చెందుతోందని ప్రధానమంత్రి పదే పదే చేస్తున్న ప్రకటనలన్నీ వట్టి కబుర్లేనని మంత్రి సమాధానం రుజువు చేసిందని.

## పంట వ్యర్థాల దహనాన్ని ... 'రాజకీయం చేయొద్దు'

### వాయుకాలుష్యంపై రైతులను నిందించడం సరికాదని 'సుప్రీం' హితవు
### డిసెంబరు 10న విచారణ కోసం పిటిషన్ జాబితా
### చర్యలపై వారం లోపు నివేదిక ఇవ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్‌కు ఆదేశం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో వాయుకాలుష్యంపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్య సమస్యను శీతాకాలంలో మాత్రమే జాబితా చేయాల్సిన 'ఆచార' కేసుగా పరిగణించలేమని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. ఈ ముప్పునకు స్వల్ప, దీర్ఘకాలిక పరిష్కారమార్గాలను కనుగొనేందుకు నెలలో రెండుసార్లు తీసుకుంటామని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'పంట వ్యర్థాలను తగులబెట్టే అంశాన్ని' అనవసరంగా రాజకీయ సమస్యగా లేదా అహంకార సమస్యగా పరిగణించకూడదు' అని ప్రధాన న్యామమూర్తి సూర్యకాంత్, జాయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీఎన్‌సిఆర్‌లో వాయుకాలుష్యానికి ప్రధాన కారణమైన పంట వ్యర్థాల దహనంపై సాధారణ నిందను ప్రశ్నిస్తూ హర్యానాలోని హిస్సార్‌కు చెందిన రైతు కుటుంబం నుండి వచ్చిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ 'కోవిడ్ సమయంలో పంట వ్యర్థాల దహనం జరిగింది. కానీ ప్రజలు ఇప్పటికీ నీలి ఆకాశాలను ఎందుకు చూడలేకపోతున్నారు? ఇది ఇతర అంశాలు కూడా ఇందులో ఉన్నాయనే విషయాన్ని సూచిస్తుంది' అని అన్నారు. ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో పెరుగుతున్న వాయుకాలుష్యానికి 'కోర్టులో ప్రాతినిధ్యం వహించని రైతులను లక్ష్యంగా చేసుకుని అనవసరంగా నిందించడం సరికాదు... కాబట్టి మేం పంట వ్యర్థాల దహనం గురించి వ్యాఖ్యానించదలచుకోలేదు' అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. పంట వ్యర్థాల దహనం సమస్య అనవసరంగా రాజకీయ సమస్యగా లేదా అహంకార సమస్యగా మారకూడదని ఆయన సూచించారు. తక్షణ, దీర్ఘకాలిక చర్యలపై స్పష్టత కోరుతూ, వాయు కాలుష్య ముప్పును పరిష్కరించడానికి స్వల్ప, దీర్ఘకాలిక గురించి తెలియజేయడానికి కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి), ఇతరులు తీసుకున్న నిర్దిష్ట చర్యలు ఏమిటో వివరించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రాన్ని కోరింది. ఇది డిసెంబరు 10న విచారణ కోసం పిటిషన్‌ను జాబితా చేసింది. దీనికి ముందు ప్రారంభంలో సిజెఐ సూర్యకాంత్ మాట్లాడుతూ ఢిల్లీ కాలుష్య అంశాన్ని అక్టోబరు నెలలో ఆచారంగా జాబితా చేయవచ్చు. దానిని నెలకు కనీసం రెండుసార్లు క్రమం తప్పకుండా జాబితా చేయవచ్చు అని అన్నారు. 'సోమవారం నాటి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) గురించి ఆయన ప్రస్తావిస్తూ నా సోదరుడు (జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి) ఈ అంశం ఈ రోజు జాబితా చేయబడిందని నాకు చెప్పారు. ఎక్యూఐ స్థాయిలలో మెరుగుదల కూడా ఉందని విన్నాను' అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభాటి వాయు కాలుష్యానికి సంబంధించిన కీలక కారణాలను ప్రస్తావించారు. 'పంట వ్యర్థాల దహనం, వాహనాల కాలుష్యం, నిర్మాణాల దుమ్ము, రోడ్ల దుమ్ము, జీవపదార్థాల దహనం వంటి అంశాలు ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యానికి దోహదపడే కారకాలు' అని ధర్మాసనానికి వివరించారు. 'ఒక్కో డిపార్ట్‌మెంట్ హెడ్స్ వాయు కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమేమిటన్న వివనగరాల అభివృద్ధి జీవన నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. సమస్యకు దోహదపడే అంశం ఏమిటో శాస్త్రీయ విశ్లేషణతో ఉండాలని ధర్మాసనం తెలిపింది.

## బెంగాల్‌లో బిఎల్‌ఒల నిరసన..
### 'సర్' పని ఒత్తిడిపై ఆందోళన

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విధులు నిర్వహిస్తున్న పోలింగ్ బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒ) భారీ నిరసన చేపట్టారు. పని ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్యంపై ఆందోళన చెందారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగామారింది. బిఎల్‌ఒ అధికార్ రక్షా కమిటీ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెలుపల భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'సర్' విధుల వల్ల ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కొందరు బిఎల్‌ఒలు ఆత్మహత్యలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో శాసనసభ్యుల బృందంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బిజెపికి చెందిన ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా 'వెనక్కి వెళ్లిపోండి' అంటూ నిరసన చేస్తున్న బిఎల్‌ఒలు బిజెపి నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు బిజెపి కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. నిరసన చేస్తున్న బిఎల్‌ఒలకు ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ బిజెపి నేతలు ఆ కార్యాలయంలోకి వెళ్లారు. బిఎల్‌ఒల పని పరిస్థితులకు టిఎంసి ప్రభుత్వమే కారణమని సువేందు అధికారి ఆరోపించారు.



ప్రజాపక్షం
మంగళవారం, 02 డిసెంబరు

# క్షమాభిక్షకై నెతన్యాహు విన్నపం

ఆధునిక ప్రపంచంలో నరహంతకుడెవరైనా ఉన్నారంటే అతడు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు. మైనారిటీ ప్రభుత్వ అధినేతగా కొనసాగుతున్న అతను గాజాలో పాలస్తీనా మిలిటెంట్‌లతో యుద్ధం పేరుతో మానవ హననం సాగిస్తున్నాడు. 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై పాలస్తీనా తీవ్రవాద సంస్థ హమస్ కేడర్లు ఆకస్మిక దాడిచేసిన అనంతరం ఇజ్రాయిలీ బందీల విడుదల పేరుతో గాజాపై నెతన్యాహు సాగిస్తున్న క్రూరమైన సైనికదాడిలో ఇప్పటివరకు 70,100మంది అమాయక ప్రజలు హతులైనారు. వారిలో హమస్ క్యాడర్లు కొద్దిమంది మాత్రమే. ఆసుపత్రులపై, ఆహార సరఫరా కేంద్రాలపై కూడా దాడులు చేయించిన పరమ కిరాతకుడతడు. తొలి శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన అనంతరం అతికష్టంమీద కుదిరిన రెండవ శాంతి ఒప్పందం (ట్రంప్ పథకం) తదుపరి కూడా ఏదోక సాకుతో గాజాను ధ్వంసం చేస్తున్న దుర్మార్గుడు నెతన్యాహు. లక్షలాది పాలస్తీనియన్‌లను వారి మాతృగడ్డనుంచి తరిమివేసి, ఇరుగుపొరుగు అరబ్ రాజ్యాలను సైనికంగా దెబ్బతీసి వాటికి పక్కలో బల్లెంలా వ్యవహరిస్తున్న ఈ యూదుమత జాత్యహంకారి పాలస్తీనియన్‌లకు సొంతరాజ్య స్థాపనతో, ఇజ్రాయిల్–పాలస్తీనా రెండు సహజీవనం చేసేలా ప్రతిపాదించబడిన 'రెండు రాజ్యాల' పరిష్కారాన్ని సైనిక గర్వంతో వ్యతిరేకిస్తున్నాడీ యుద్ధ పిపాసి. ఒకప్పుడు ఇజ్రాయెల్‌ను శత్రువుగా చూసిన అరబ్ రాజ్యాలు ఇప్పుడు రెండు రాజ్యాల పరిష్కారాన్ని ఆచరణాత్మక దృష్టితో అంగీకరిస్తున్నాయి. అయితే పశ్చిమాసియా రాజకీయ చదరంగంలో అమెరికా ప్రయోజనాలకు రక్షకుడిగా ఉన్న నెతన్యాహూకు అమెరికా పాలకులు (ఏ పార్టీ అధికారంలో ఉన్నా) సర్వ విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారు ఇరాన్‌ను బూచిగా చూపి ఇతర అరబ్‌రాజ్యాలను లొంగదీసుకున్నారు. ప్రస్తుత ట్రంప్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తొలిటరంలో వివాదాస్పదమైన జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి, అక్కడ తమ రాయబార కార్యాలయం నెలకొల్పి పాలస్తీనియన్‌లపై కవ్వింపు చర్యకు ఒడిగట్టారు. ఇప్పుడేమో ఇజ్రాయెల్‌కు సైనిక–ఆయుధ–ఆర్థిక సహాయం అందించటంతోపాటు నెతన్యాహును అవినీతి కేసులనుంచి కూడా తప్పించాలని చూస్తున్నాడు. ''దగా, విశ్వాస ఘాతుకం, లంచాలు స్వీకరించటం'' అనే ఆరోపణలతో నెతన్యాహు కోర్టుల్లో మూడు కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నందున ఆయనకు క్షమాభిక్ష ప్రకటించాల్సిందిగా ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్‌జోగ్‌కు ఇటీవల ట్రంప్ విజ్ఞప్తి చేశారు. దాని కొనసాగింపుగా ఇప్పుడు ప్రధాని నెతన్యాహు తమ అధ్యక్షునికి క్షమాభిక్ష అభ్యర్థన సమర్పించారు. తనకు స్నేహితులైన పచ్చి మితవాద నాయకులను కాపాడేందుకు ప్రయత్నించటం ట్రంప్ ఒక విధానంగా పెట్టుకున్నట్లున్నారు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో అవినీతిపై ఆ దేశ ప్రభుత్వం విచారణ జరుపుతుండగా దాన్ని రద్దు చేయాలని ట్రంప్ బ్రెజిల్ అధ్యక్షుడు డిసిల్వాకు విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాత ఒక కేసు విచారణలో బోల్సనారోకు 27 సంవత్సరాల జైలుశిక్ష విధించబడింది, అది వేరు విషయం. ఇతర దేశాల సర్వసత్తాక అధికారాల్లో ట్రంప్ జోక్యం అనవసరం, అభ్యంతరకరం. అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం.

నెతన్యాహు తమ క్షమాభిక్ష అభ్యర్థనలో తనపై ఆరోపణలు తిరస్కరిస్తూ ఈ కేసు ''మీడియా, పోలీసు, జ్యుడీషియరీ'' వేధింపు అని పేర్కొన్నారు. ''రాజకీయమైనది, అన్యాయమైనది'' అన్నారు. తాను దేశరక్షణకై యుద్ధంలో మునిగిఉంటే కేసులు బనాయించి వేధిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. నెతన్యాహు మరో వీడియో ప్రసంగంలో, ''ఈ కేసు విచారణ దేశాన్ని విభజించింది. వారానికి మూడు రోజులు తాను కోర్టుకు హాజరు కావాలన్న ఆదేశం నా విధుల నిర్వహణకు భంగం కలిగిస్తుంది. విచారణ కొనసాగింపు మనల్ని దేశంలోపలనుంచి చీల్చుతుంది, విభజనతెస్తుంది, వైరుధ్యాలు పెంచుతుంది'' అంటూ జాతీయ సామరస్యం పెంపుదలకోసం కేసును ఎత్తివేయాలి'' అని కోరారు. అధ్యక్షుడు ఐజాక్ హెర్‌జోగ్ గతంలో నెతన్యాహుకు రాజకీయ ప్రత్యర్థి. అయితే ప్రస్తుత పదవీ బాధ్యతల్లో వారు సామరస్యంతోనే పనిచేస్తున్నారు. అవినీతి ఆరోపణలపై న్యాయస్థానం విచారణనుంచి నిప్పులాగా బయటపడేబదులు నెతన్యాహు జాతీయవాద విజ్ఞప్తులతో బయటపడాలని చూస్తున్నాడు.

పాలస్తీనా, ఇజ్రాయెల్ 'రెండు రాజ్యాల' పరిష్కారాన్ని పోప్ లియో XIV ఏకైకమార్గంగా ఆదివారం పునరుద్ఘాటించారు. నెతన్యాహుకు క్షమాభిక్ష పెట్టకూడదని వేలాదిమంది టెల్‌అవీవ్‌లో అధ్యక్ష భవనాన్ని ముట్టడించటం తాజా పరిణామాలు.

# అరుదైన భూమి మూలకాల తవ్వకం భారత్‌కు వరం

టి.ఎన్.అశోక్

భవిష్యత్తులో కేరళ, తమిళనాడులోని ప్రశాంత తీరప్రాంతంలో ఉండే ఇసుకలో అపార ఖనిజాలు లభించే అవకాశాలు ఉన్నాయి. నియోడైమియం, డిస్‌ప్రోసియం, ప్రసోడైమియం వంటి సరిగా ఉచ్చరించలేని పేర్లతో కూడిన పదిహేడు రసాయనికంగా సారూప్యమైన లోహాలతో కలిగిన అరుదైన భూమి మూలకాలు ఆధునిక నాగరికతకు బలం.

అవి ఎలక్ట్రిక్ వాహనాలలోని మోటార్లకు శక్తినిస్తాయి, గాలి మరలను స్థిరీకరిస్తాయి, క్షిపణులను నిర్దిష్టంగా నడిపిస్తాయి. స్మార్ట్ ఫోన్‌లను కంపించేలా చేసే అయస్కాంతాలను అందిస్తాయి. ఈ మూలకాలను నియంత్రిస్తే, మీరు హరిత ఇంధన పరివర్తన ధమనులను, సైనిక హార్డ్‌వేర్ నాడీ వ్యవస్థను నియంత్రించగలుగుతారు.

మూడు దశాబ్దాలుగా చైనా దేశం ఉక్కు పట్టుతో ఆ నియంత్రణను కలిగి ఉంది. బీజింగ్ ప్రపంచ అరుదైన మూలకాల మైనింగ్‌లో దాదాపు 60 శాతం, ముడి ఖనిజాలు విలువైన లోహాలు, మిశ్రమాలుగా మారే శుద్ధి దశలో అద్భుతమైన 90 శాతం వాటా కలిగి ఉంది. చైనా ఈ గుత్తాధిపత్యాన్ని నిర్మించడాన్ని ప్రపంచం చూసింది. మొదట అనుమతిగల పర్యావరణ ప్రమాణాలు, తక్కువ కార్మిక వేతనాల ద్వారా, తరువాత నిర్దాక్షిణ్యంగా వివిధ దశలపై ఆధిపత్యం ద్వారా ఇది సాధించింది.

పాశ్చాత్య దేశాలు ప్రమాదాన్ని గుర్తించే సరికే ఆలస్యం అయిపోయింది. చైనా తన ఉత్పత్తిపై నియంత్రణ సాధించిన ఏకైక దేశంగా మారింది.

పారిశ్రామిక విప్లవాలలో ఆలస్యంగా ప్రవేశించినదిగా శాశ్వతంగా కొట్టిపారేయబడిన భారతదేశం ఇప్పుడు సాహసోపేతమైన పనికి పూనుకుంది. అది ఏమీ లేని స్థితి నుంచి ప్రత్యామ్నాయ అరుదైన మూలకాల సరఫరా గొలుసును నిర్మించడం. ఏటా 6,000 టన్నుల అరుదైన మూలకాలు శాశ్వత అయస్కాంతాలను తయారు చేసేందుకు ఉద్దేశించిన 890 మిలియన్ డాలర్‌ల పథకం అనేది పారిశ్రామిక విధానం కంటే భారీదే . ఇది పారిశ్రామిక విధాన ధిక్కరణ కూడా.

భారతదేశ ఆతృతను అర్థం చేసుకోవడానికి, మొదట అరుదైన మూలకాల ఆర్థిక శాస్త్రాన్ని గ్రహించాలి. విలువ గొలుసులో నాలుగు దశలు ఉన్నాయి. వెలికితీత, శుద్ధి, అయస్కాంత తయారీ, భాగాల ఏకీకరణ. గనుల నుంచి వెలికితీత తుది విలువలో కొంత భాగాన్ని మాత్రమే కలిగి ఉంటుంది. శుద్ధి, అయస్కాంత ఉత్పత్తి అనేది కచ్చితమైన లోహశాస్త్రం, పర్యావరణ నియంత్రణలు, సాంకేతిక నైపుణ్యం అవసరమయ్యే దశలు. మొత్తం విలువలో 50 శాతం నుండి 70 శాతం వరకు ఇవే కలిగి ఉంటాయి.

ఏళ్ళ తరబడి భారతదేశం దాని తీరాల నుండి అరుదైన భూమి ఖనిజాలను తవ్వి, శుద్ధి కోసం చైనాకు వెంటనే రవాణా చేసేది. తరువాత అది ఖర్చులు, లాభాలు జోడించిన ధరతో సిద్ధమైన అయస్కాంతాలను అక్కడి నుంచి దిగుమతి చేసుకుంది. ఇది ద్రాక్షను పండించడం, వాటిని చౌకగా ఎగుమతి చేయడం,విలాస ధరలకు షాంపైన్‌ను తిరిగి కొనుగోలు చేయడం వంటిది. భారతదేశ రక్షణ రంగం, దాని నూతన విద్యుత్ వాహన పరిశ్రమ, దాని పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు అన్నీ గుయాంగ్‌డాంగ్, జీయాంగ్జీలలో తయారైన అయస్కాంతాలపై ఆధారపడి ఉన్నాయి.

2024 ప్రారంభంలో చైనా జాతీయ భద్రత అంశాలతో అరుదైన భూమి పదార్థాలపై ఎగుమతి పరిమితులను విధించినప్పుడు భారతదేశం ఇబ్బంది పడింది. ధరలు పెరిగాయి. సరఫరా షెడ్యూలు తారుమారైంది. దుర్బలత్వం బయటపడింది. భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి బీజింగ్ సద్భావనపై ఆధారపడి ఉంది.

ఇలా ఆధారపడడాన్ని తిప్పి కొట్టే లక్ష్యంతో ఉత్పత్తి సంబంధిత ప్రోత్సాహకాలలో 780 మిలియన్ డాలర్ల మద్దతుతో ఈ కొత్త పథకం తీసుకువచ్చింది. భారతదేశం దేశీయ శుద్ధి సామర్థ్యాన్ని అభివృద్ధి పరచటం, అధిక పనితీరు గల సింటెర్డ్ మాగ్నెట్లను తయారు చేయడం, తేజస్ ఫైటర్ జెట్‌ల నుండి టాటా ఎలక్ట్రిక్ బస్సుల వరకు ప్రతిదానిలోనూ వాటిని అనుసంధానించాలని యోచిస్తోంది. విజయవంతమైతే, మోనాజైట్ వెలికితీత నుండి క్షిపణి మార్గదర్శక వ్యవస్థల వరకు మొత్తం విలువ గొలుసు భారత సరిహద్దుల్లోనే ఉంటుంది.

పాకిస్తాన్ అప్పుడప్పుడు అరుదైన భూమి మూలకాల చర్చలలోకి వస్తుంది. అది ప్రత్యేకించి బలూచిస్తాన్ లేదా గిల్గిత్ బాల్టిస్తాన్‌లో చైనా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు నిక్షేపాలను కనుగొన్న సమయాలలో. అయినప్పటికీ పాకిస్తాన్ అరుదైన భూమి మూలకాల కథ విజయం కంటే ఎక్కువ ఆకాంక్షలు కలిగి ఉంది. అవి అస్థిర ప్రావిన్సులలో ఉండడం, పూర్తిగా చైనా మూలధనం, నైపుణ్యంపై ఆధారపడి ఉండడంతో పాకిస్తాన్ నిల్వలు తక్కువగా అన్వేషించబడ్డాయి. ఇస్లామాబాద్‌లో పారిశ్రామిక స్థావరం, రాజకీయ స్థిరత్వం, ముఖ్యంగా పోటీతత్వంతోకూడిన అరుదైన భూమి మూలకాల పరిశ్రమను నిర్మించడానికి అవసరమైన దీర్ఘకాలిక క్షితిజాలు లేవు.

భారతదేశం ప్రయోజనం నిర్మాణాత్మకమైనది. ఇది ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద అరుదైన భూమి మూలకాల నిల్వలను కలిగి ఉంది. అలాగే పనిచేస్తున్న మైనింగ్ బ్యూరోక్రసీని కలిగి ఉంది. 1950ల నుండి మోనాజైట్‌ను వెలికితీస్తున్న ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించింది. అన్నిటికంటే ముఖ్యంగా, భారతదేశం దౌత్యపరమైన పరిధిని, సమగ్ర సరఫరా గొలుసుకు ఆర్థిక సహాయం చేయడానికి మూలధన మార్కెట్లను శాసిస్తుంది. దీనికి విరుద్ధంగా, పాకిస్తాన్ ప్రతి నిర్ణయం బీజింగ్ ద్వారా రావాలి. తన సొంత గుత్తాధిపత్యానికి పెంచుకోవడానికి ఎటువంటి ప్రోత్సాహం లేదు.

పాకిస్తాన్ ఆరంభించడానికి ముందే పోటీ నుండి సమర్థవంతంగా తొలగించడమే భారతదేశం వ్యూహం. ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందాలపై చర్చలు జరుపుతుండగా, న్యూఢిల్లీ కాంక్రీటును కురిపించి, ఒప్పందాలను అమలు చేసే పనిలో ఉంటుంది.

అయితే, ఒక అసౌకర్య వాస్తవికత భారతదేశం ప్రణాళికలను కమ్మేస్తుంది. అమెరికాకు అరుదైనభూమి మూలకాల మధ్యంతరాలను ఎగుమతి చేసే భారతదేశ సామర్థ్యాన్ని పరిమితం చేసే అనధికారిక ఏర్పాట్లను చైనా సాధించింది. ఈ ఒప్పందాలు, ఎప్పుడూ బహిరంగంగా క్రోడీకరించబడలేదు. ప్రత్యామ్నాయ సరఫరాదారుల కోసం అమెరికన్ సైనికపారిశ్రామిక సముదాయాన్ని ఆకలితో అలమటింపజేయాలనే బీజింగ్ దృఢ సంకల్పాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి.

అందుకు ప్రతిస్పందనగా భారతదేశం దాని కొనుగోలుదారుల పునాదిని వైవిధ్యపరుచుకోవాలి. 2023లో ఆమోదించబడిన యూరప్ క్రిటికల్ రా మెటీరియల్స్ చట్టం ప్రకారం వ్యూహాత్మక ఖనిజాలు చైనాయేతర సరఫరాదారుల ద్వారానే రావాలని స్పష్టంగా ఉంది. 2010లో చైనా విధించిన ప్రాదేశిక ఎగుమతి నిషేధంతో ఇప్పటికీ బెంబేలెత్తుతున్న జపాన్, ప్రత్యామ్నాయాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలు ముఖ్యంగా యుఎఇ, సౌదీ అరేబియా పునరుత్పాదక ఇంధన వనరులు, మరింత అధునాతన తయారీలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రతి ఒక్క దేశం భారతీయ అయస్కాంతాలకు సంభావ్య కొనుగోలుదారుగా సూచిస్తుంది.

భారతదేశం కూడా ద్విముఖ వ్యూహాన్ని అవలంభించింది. ఇది స్వదేశంలో శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకుంటూ విదేశాలలో అరుదైన భూమి మూలకాల ఆస్తులను పొందుతోంది. భారతదేశం ప్రభుత్వ మద్దతుగల మైనింగ్ కన్సార్షియం–కాబిల్ ద్వారా జాంబియా, టాంజానియా, నమీబియా, అర్జెంటీనా, బొలీవియా, పెరూలో నిక్షేపాలను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తోంది. ఈ భాగస్వామ్యాలు రెండు ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. అవి దీర్ఘకాలిక ఖనిజ సరఫరాలకు హామీ ఇస్తాయి. అలాగే చైనా చాలా కాలంగా ఆస్వాదిస్తున్నట్లు గా దక్షిణ భూగోళంతో రాజకీయ మూలధనాన్ని సమకూర్చుతుంది.

తరచుగా ప్రత్యేకమైన వెలికితీత హక్కులు, మౌలిక సదుపాయాల వనరుల మార్పిడిని కలిగి ఉన్న బీజింగ్ నమూనా మాదిరిగా కాకుండా భారతదేశం ఉమ్మడి శుద్ధీకరణ, ఆదాయభాగస్వామ్యం, పూర్తయిన అయస్కాంతాలను స్థిరమైన ధరలకు భాగస్వామి దేశాలకు తిరిగి విక్రయించే వాగ్దానాన్ని అందిస్తుంది. ఇది చైనా ఆధిపత్యం పట్ల భయపడే దేశాలను ఆకర్షించడానికి రూపొందించబడిన మృదువైన, మరింత బహుళత్వ విధానం.

యూరప్, తూర్పు ఆసియా, గల్ఫ్, లాటిన్ అమెరికాలకు నమ్మకమైన ప్రత్యామ్నాయ సరఫరాదారుగా భారతదేశం తనను తాను నిలబెట్టుకోగలిగితే, అది గణనీయమైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. అరుదైనభూమి అయస్కాంతాల ప్రపంచ మార్కెట్ 2030 నాటికి 30 బిలియన్‌ల డాలర్‌లకు మించి ఉంటుందని అంచనా వేయబడింది. అందులో 10 శాతం సాధించినా అది భారతదేశ తయారీ ఎగుమతులకు గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుంది.

అయితే, ఆశయం విజయానికి హామీ ఇవ్వదు. భారతదేశం బలీయమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. అరుదైన భూమి ఖనిజాలను శుద్ధి చేయడానికి సంక్లిష్టమైన రసాయన ప్రక్రియలపై పట్టు అవసరం. ఈ పద్ధతులను పరిపూర్ణం చేయడానికి చైనా దశాబ్దాలుగా వెచ్చించింది. సాంకేతిక బదిలీలు, నిపుణులను (వారిలో చాలా మంది చైనా శిక్షణ పొందిన ఇంజనీర్లు కూడా ఉన్నారు) నియమించడం ద్వారా భారతదేశం ఆ అభ్యాస ప్రక్రియను కుదించడానికి ప్రయత్నిస్తోంది .

అరుదైన భూమి మూలకాల శుద్ధి విషపూరిత వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. భారతదేశం అతుకుల బొంతలాంటి పర్యావరణ విధానం అమలు, వివాదాస్పద భూసేకరణ ప్రక్రియలు ప్రాజెక్టులను ఆలస్యం చేయవచ్చు. కేరళ లేదా ఒడిశాలో ప్రజా వ్యతిరేకత మైనింగ్ విస్తరణలను నిలిపివేయవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం కలిగిన అరుదైన భూమి మూలకాల పరిశ్రమను నిర్మించడం ఒక దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు స్థిరమైన పెట్టుబడిని కోరుతుంది. భారతదేశానికి ద్రవ్య లభ్యత పరిమితం. దీర్ఘకాలిక ప్రాజెక్టుల విషయంలో ప్రైవేట్ పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉంటారు.

బీజింగ్ నిశ్శబ్దంగా మార్కెట్ వాటాను వదులుకోదు. ఇది ప్రపంచ మార్కెట్లను సబ్సిడీ అయస్కాంతాలతో ముంచెత్తవచ్చు. అది భారతీయ ఉత్పత్తిదారులను తగ్గించవచ్చు. ఇది కీలకమైన శుద్ధి పరికరాల ఎగుమతులను పరిమితం చేయవచ్చు. ఇది ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ భాగస్వాములను ఏదో ఒక వైపు ఎంచుకోవాలని ఒత్తిడి చేయవచ్చు. చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు భారతదేశ ప్రభుత్వ రంగం కంటే లోతైన జేబులు, ఎక్కువ రాజకీయ పరిధిని కలిగి ఉన్నాయి.

అత్యంత కపటంతో భారతదేశ స్వీయ నియంత్రణ బలహీనతలను చైనా ఉపయోగించుకోగలదు. పర్యావరణ అనుమతులలో జాప్యం, భూ వివాదాలు, అధికార అంతర్గత తగాదాలు గతంలో భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చంపేశాయి. చైనా ఈ ఘర్షణ అంశాలను తమ మనుషుల ద్వారా, సైబర్ అంతరాయం లేదా వ్యూహాత్మక తప్పుడు సమాచారం ద్వారా విస్తరించగలిగితే, అది ఎటువంటి ప్రయత్నం చేయకుండానే భారతదేశ ప్రణాళికలను పట్టాలు తప్పిస్తుంది.

భారతదేశం అరుదైన భూమి మూలకాల వృద్ధి అమెరికాకు అవకాశం, సంక్లిష్టత రెండూ కలిగిస్తాయి. చైనాకు వాషింగ్టన్ ప్రత్యామ్నాయాలను కోరుకుంటుంది. కానీ, అది నియంత్రణను కూడా కోరుకుంటుంది. అమెరికాకు కాకుండా యూరప్, ఆసియాకు ఎగుమతి చేసే భారతదేశం పెంటగాన్ సేకరణను క్లిష్టతరం చేస్తుంది. అయినప్పటికీ అమెరికా కపటంగా కనిపించకుండా భారతదేశం ప్రయత్నాలను బహిరంగంగా వ్యతిరేకించదు.

చైనాకు, దాని గుత్తాధిపత్యానికి భారతదేశం మొదటి విశ్వసనీయ ఆసియా సవాలుదారుని సూచిస్తుంది. న్యూఢిల్లీ విజయం సాధిస్తే, అది బీజింగ్ ధర నిర్ణాయక శక్తిని విచ్చిన్నం చేస్తుంది. వియత్నాం, కజఖస్తాన్, మంగోలియా వంటి ఇతర దేశాలు సైతం వారి స్వంత అరుదైనభూమి మూలకాల పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవడానికి ధైర్యం చేస్తాయి.

పాకిస్తాన్‌కు సందేశం స్పష్టంగా ఉంది. ఆ దేశ అరుదైనభూమి మూలకాల రేసు ఆరంభానికి ముందే ముగిసింది. ఇస్లామాబాద్‌లో పోటీ పడటానికి స్థాయి, స్థిరత్వం, స్వేచ్ఛ లేదు. చైనాపై ఆధారపడితే, అది ప్రత్యర్థిగా కాకుండా సేవలు వినియోగించుకునే వినియోగదారుడిగానే ఉంటుందని నిర్ధారిస్తుంది.

అయితే, భారతదేశం అరుదైన భూమి మూలక వ్యూహం కేవలం అయస్కాంతాలు లేదా క్షిపణుల గురించి కాదు. సంకల్పం, మూలధనం, ఓపిక కలిగి ఉంటే మధ్యతరహా శక్తులు ప్రపంచ సరఫరా గొలుసులను ఇప్పటికీ రూపొందించగలవని నిరూపించగలదు. 21వ శతాబ్దపు భౌగోళిక రాజకీయాలలో, అరుదైన భూమి మూలకాలను శుద్ధి చేసే దేశాలు ఒకప్పుడు చమురును శుద్ధి చేసే దేశాల స్థాయిలో ప్రభావాన్ని చూపవచ్చు.

భారతదేశం 890 మిలియన్ల డాలర్ల ఎత్తుగడలో విజయవంతమవుతుందా లేదా అనేది అనిశ్చితంగా ఉంది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికే లెక్కలను మార్చింది. ప్రపంచం ఇకపై చైనా అయస్కాంతాలపై మాత్రమే ఆధారపడి లేదు. అది కూడా ఒక రకమైన శక్తి.

(ఐపిఎ సర్వీస్)

# విత్తన బిల్లు–2025 ఎవరికోసం?



పులి రాజు
సామాజిక కార్యకర్త

పదివేల సంవత్సరాల క్రితం భారతదేశంలో వ్యవసాయం ప్రారంభమైందని చరిత్ర చెబుతుంది. గతంలో ఎన్నడూ కూడా మన వ్యవసాయం విత్తనాలు ఉత్పత్తి చేసిందే కానీ విత్తనాలు కొనుగోలు చేయలేదు. కానీ హరిత విప్లవం తర్వాత హైబ్రిడ్ విత్తనాల పేర్లతో విత్తనాల అమ్మకం, దిగుమతి పెరిగింది.

గత 20, 25 సంవత్సరాలు క్రితం ప్రతి రైతు ఇల్లు ఒక 'విత్తన భాండాగారమే'! అప్పుడు రైతులు పండించిన పంటలో కొంత మంచి భాగాన్ని విత్తనాలుగా నిలువ చేసుకొని అదే విత్తనాలను మళ్లీ పెట్టుకుని పెట్టుబడులేని వ్యవసాయం చేసేవారు. కానీ 20, 25 సంవత్సరాల నుండి ప్రభుత్వం మరియు కార్పొరేట్ విత్తన కంపెనీలు క్రమంగా రైతుల దగ్గర నుండి విత్తనాలను దూరం చేసి ఇప్పుడు ఏ చిన్న పంట పెట్టుకోవాలన్న విత్తనాల కంపెనీలపైన ఆధారపడి భారతదేశ వ్యవసాయ రంగం నడుస్తుందని అనడంలో అతిశయోక్తి లేదు.

రైతులకు విత్తనాలు భారం కావడంతో పెట్టుబడులు పెరిగి రైతుల ఆత్మహత్యలకు విత్తనాల కొనుగోలు కూడా ఒక ప్రధాన కారణం.

దేశవ్యాప్తంగా 540 విత్తన కంపెనీలు ఉన్నాయి. అవి సంవత్సరానికి దాదాపు 65 నుండి 70వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం చేస్తున్నాయని ఒక అంచనా!

వ్యవసాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో విత్తనం కూడా అంతే ముఖ్యమైనది. ఇది గమనించిన విత్తన కంపెనీలు ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయల నకిలీ విత్తనాలు అమ్ముతున్నాయని ఒక అంచనా!

ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక దగ్గర నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను చూస్తూనే ఉన్నాం.

తాజాగా మెదక్ జిల్లా, చేగుంట మండలం, రుక్మాపూర్ గ్రామంలో ఒక విత్తన కంపెనీ వరి నకిలీ విత్తనాలతో సుమారు 45 మంది రైతులు 100 ఎకరాలలో వరి పంట వేస్తే ఒక ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఆ నకిలీ విత్తనాలతో ఒక ఎకరాకు 6, 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో ఆ రైతులు ఆత్మహత్యలే శరణ్యమని లబోదిబో మంటున్నారు. ఈ నకిలీ విత్తనాలతో పంట దిగుబడి రాలేదని ఎవరికి ఫిర్యాదు చేయాలో ఎవరికి మొరపెట్టుకోవాలో కూడా సరైన వ్యవస్థ లేక రైతులు నష్టపోతున్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ విత్తన బిల్లు 2025 పై డిసెంబర్ 11వరకు రైతులు, రైతు సంఘాలు సూచనలు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది.

ఈ బిల్లు 'సాగుదారుల కోసమా? కార్పొరేట్ల కోసమా?' అని రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి.

ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికడుతుందని చెబుతోంది, కానీ విమర్శకులు కార్పొరేట్ పక్షపాతం మరియు జన్యు వైవిధ్యానికి ముప్పు, దేశ విత్తనాల ప్రస్తావనలేదని హెచ్చరిస్తున్నారు.

విత్తన రంగాన్ని నియంత్రించే నిబంధనలను సమూలంగా మార్చడానికి భారత ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనాల బిల్లు, 2025, 1966 విత్తనాల చట్టం మరియు 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వులను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త చట్టం నాణ్యమైన విత్తనాల సరఫరాను మెరుగుపరుస్తుందని, నకిలీలను అరికట్టగలదని, రైతులకు ఎక్కువ రక్షణ కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.



కానీ, 2004, 2019లో మునుపటి ప్రయత్నాల మాదిరిగానే, ఈ బిల్లు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటుంది. రైతు సంఘాలు, విత్తన నిపుణులు మరియు పౌర సమాజ సంస్థలు ప్రతిపాదిత చట్టం సాధారణ సాగుదారుల కంటే, ముఖ్యంగా సాంప్రదాయ, రసాయన రహిత వ్యవసాయంపై ఆధారపడే వారి కంటే విత్తన కంపెనీలు, వ్యవసాయ వ్యాపారాలకు బాగా సరిపోతుందని అంటున్నారు.

రైతు విత్తనాలు కొన్నప్పుడు విత్తనాలు అమ్మే కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. జిల్లాలో ఏ డీలర్‌కు ఎంత సీడ్ ఇచ్చారో కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి.

జిల్లా వ్యవసాయ అధికారికి కంపెనీ వారు సీడ్ ఎక్కడ ఉత్పత్తి చేసింది ఏ రైతు వద్ద ఉత్పత్తి చేసినది తనిఖీ చేసి రిపోర్ట్ ఇచ్చిన అధికారి, కంపెనీ వివరాలు మ్యానుఫ్యాక్చరింగ్ చేసిన యూనిట్ వివరాలు అన్నీ కూడా ఇవ్వాలి. సర్టిఫై చేసిన ఇన్స్పెక్టర్ ఇచ్చిన వివరాలు కూడా ఇవ్వాలి.

కంపెనీ వేరే రాష్ట్రంలో నమోదు అక్కడ కార్యకలాపాలు చేస్తుంటే కంపెనీ ఆఫీస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో వేరే రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఆ కంపెనీ సీడ్ అమ్ముతున్న రాష్ట్రంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవా లి.

డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది మరియు రైతుకు బిల్లు ఇవ్వాలి బిల్లులో డీలర్ సంతకం మరియు వేలిముద్ర వేయాలి.

డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి.

రైతు తన పొలంలో పండిన పంటను విత్తనం కొరకు వాడిన ఇతర రైతులకు విత్తనం కొరకు అమ్ముకున్న జిల్లా వ్యవసాయ అధికారి కి తెలియజేయాలి విత్తనం కొన్న రైతులు కూడా ఏ రైతు వద్ద నుండి కొన్నది ఆ రైతు వివరాలు జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి.

జిల్లా వ్యవసాయ అధికారి మరియు ఉద్యానవనాధికారి ఆధ్వర్యంలో జిల్లాకు ఇద్దరు సీడ్ వెరిఫికేషన్ అధికారులను ప్రభుత్వం నియమించాలి.

1. నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేసి సరఫరా చేసిన వ్యక్తులకు లేదా కంపెనీలకు కఠినమైన శిక్షలను తక్షణమే అమలు చేయాలి.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం పొందడానికి సులభమైన మార్గం ఉండాలి.

2.స్థానిక మండల వ్యవసాయ అధికారి రిపోర్టు ఆధారంగా నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం ఒక నెల లోపు అందించే విధంగా చట్టం ఉండాలి.

3. విత్తనాల పైన ధరల రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.

4. విత్తనాలు ఉత్పత్తి పైన ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ, పర్యవేక్షణ కూడా ఉండాలి.

5. విత్తనాల పైన కృత్రిమ కొరత సృష్టిస్తే భవిష్యత్తులో ఆ కంపెనీకి అనుమతులు ఇవ్వకూడదు.

6. దేశీయ లేదా సంప్రదాయ విత్తనాలను కాపాడుకొని భద్రపరిచే విధానం చట్టంలో ఉండాలి.

7. రైతులు పాత పద్ధతులలో విత్తనాలు కాపాడుకునే పద్ధతిని ప్రోత్సహించాలి.

60 శాతం పైగా ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ప్రధానమైన విత్తన చట్టాన్ని సవరణ చేస్తున్న ఇంత పెద్ద చట్ట సవరణకు తూతూ మంత్రంగా కొన్ని రోజులు కాకుండా ఒక సంవత్సరం దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన ఒక పెద్ద చర్చ పెట్టి మట్టి మనుషులైన రైతుల నుండి రైతు సంఘాలు, మేధావుల నుండి అభిప్రాయాలు తీసుకొని చట్ట సవరణ చేయాలి.

# భూమాతను కాపాడుకుంటేనే జీవకోటి మనుగడ

02 డిసెంబర్ 1984 రాత్రి భోపాల్ సమీప యూనియన్ క్యాడ్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ నుంచి లీక్ అయిన అత్యంత ప్రమాదకర మిథైల్ ఐసోసయనేట్ వాయువు పేల్చడంతో దాదాపు 5.6లక్షల సమీప ప్రాంత అమాయక ప్రజలు తీవ్రంగా ప్రభావితం కావడం. అందులో కనీసం 3,787 మంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక విపత్తుగా ఈ దుర్ఘటనను గుర్తించడం జరిగింది. ఈ అత్యంత విషాదకర విపత్తుకు వ్యతిరేకంగా కాలుష్య నియంత్రణ ప్రయత్నాలకు చేయూతనిస్తూ, ప్రతి ఏట 02 డిసెంబర్ రోజున జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం (నేషనల్/వరల్డ్ పొల్యూషన్ కంట్రోల్ డే) పాటించుట ఆనవాయితీగా మారింది. నేటికీ మహానగరాలతో పాటు ఇతర పట్టణాల ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా కాలుష్య కోరల్లో చిక్కి ఊపిరాడకుండా బతుకులు ఈడుస్తున్నారు. 2025 జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం ఇతివృత్తంగా సుస్థిర జీవనవిధానంతో హరిత భవిష్యత్తు (సస్టేనబుల్ లివింగ్ ఫర్ ఏ గ్రీనర్ ఫ్యూచర్) అను అంశాన్ని తీసుకోవడం జరిగింది.

జీవకోటి ఆరోగ్యం, పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగించే ప్రమాదకర పదార్థాలను నేల, నీరు లేదా గాలిలోకి విడుదల కావడాన్ని కాలుష్యం అని పిలుస్తాం. కాలుష్య కట్టడి మన ఇంటిలోంచి మాత్రమే ప్రారంభం కావాలి. కాలుష్య వ్యాప్తికి మనం కారణం కాకుండా జాగ్రత్త పడాలి. నేటి విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు గాలి, నేల, నీటి, శబ్ద కాలుష్యాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు వాటిని తగ్గించేలా మార్గాలను కూడా వివరించడం జరుగుతుంది. ప్లాస్టిక్స్ వాడకాన్ని తగ్గించడం, జీవ విచ్ఛిన్న వస్తువులు లేదా పదార్థాలను వాడడం, ట్రాఫిక్ నియంత్రణలు పాటించడం, ప్రజా రవాణను ప్రోత్సహించడం, పునరుత్పాదక ఇంధనాలను వాడుకోవడం, శిలాజ ఇంధనాలను తగ్గించడం లాంటి చర్యలను నిరంతరం తీసుకోవాలి.

**కాలుష్య నియంత్రణ మార్గాలు:**

అడవుల నరికివేత, పారిశ్రామిక వ్యర్థాలు, అసంబద్ధ నీటి నియంత్రణ, అశాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, శక్తి ఉత్పత్తి పరిశ్రమలు, శిలాజ ఇంధన ఆధారిత రవాణా వ్యవస్థలు లాంటి కారణాలతో కాలుష్యం పెరుగుతుంది. కాలుష్యంవల్ల మట్టి మర్యాద మంటగలుస్తుంది. గాలి గరళం అవుతుంది. నీటి నాణ్యత గతి తప్పుతుంది. వీటికి తేడుగా రేడియోధార్మిక, శబ్ద, ప్లాస్టిక్ కాలుష్యాలు మానవ జీవితాలను మరింత జటిలం చేస్తున్నాయి. కాలుష్యం పెరిగితే మానవాళితో పాటు సకల జీవకోటి రోగాలు చుట్టుముడతాయి. కాలుష్యానికి అడ్డుకట్ట వేయకపోతే అదే ఉచ్చులో మనం ప్రాణాలు నిలుపవలసి వస్తుంది. సమర్థవంతమైన నీటి నియంత్రణ మార్గాలు, సుస్థిర రవాణా వ్యవస్థలు, తరగని ఇంధనాల వినియోగాలు, ఆరోగ్యకర సాగు పద్ధతులు, ప్లాస్టిక్ రహిత పౌర జీవనాలు, పర్యావరణహిత అడుగులు, వ్యర్థాల నియంత్రణ, జీవ విచ్ఛిన్న వ్యర్థాలు, పౌర సమాజాన్ని అవగాహన పరచడం, కాలుష్య




నియంత్రణ సాంకేతికత వినియోగం, శక్తి వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ చట్టాల కఠిన అమలు లాంటివి రేపటి ఆరోగ్యకర సమాజ స్థాపనలకు దోహదపడతాయి.

మనకు జీవన ఆధారమైన భూమిని పవిత్రంగా చూసుకుందాం. నేటి పరిశుభ్రత రేపటి ఉజ్వల ఆరోగ్య భవిష్యత్తు. మన జీవనశైలిలో చిన్న చిన్న మార్పులతో రేపటి పౌరుల ఆరోగ్యాల కు పునాది అవుతాయి. కాలుష్య నివారణే రేపటి తరాలకు వరప్రసాదం అవుతుంది. జీవకోటి ఆరోగ్యకర మనుగడకు నేల, నీరు, గాలి పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాలుష్య కట్టడికి పౌర సమాజం చేయిచేయి కలిపి మానవ హారం పట్టాలి. నేటి హరిత ఆలోచన ఆచరణ మార్గాలే రేపటి తరాలకు ఆరోగ్య గొడుగులు అవుతాయి. కాలుష్య భూతం మనల్ని మింగేయక ముందే మనం దానికి అడ్డుకట్ట వేయాలి.

(02 డిసెంబర్ జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా)

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఈ నెల 17 న జరగ నున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో తేదిన నామీనేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా మండలం లో ఏర్పాటు చేసిన నామీనేషన్ కేంద్రాలను కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పెనుబల్లి మండలంలోని నామిషన్ దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసి పరిశీలించారు. పెనుబల్లి మండలంలో 9 నామినేషన్ స్వీకరణ దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెనుబల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, పెనుబల్లి, వియ్యం బంజర్, తాళ్లపెంట పంచాయతీ కార్యాలయంలో బ్రహ్మలకుంట, గంగదేవి పాడు, కరాలపాడు, కేంద్రాల వద్ద 500 మీటర్ల హద్దును ఏర్పాటు చేసి 100 మీటర్ల దూరంలో బారికేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. త్రించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖని ఆదేశించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : సర్వేశ్వరరెడ్డి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఇ బ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు సర్వేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే లా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. మొదటి దశ నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, రెండోదశ కొనసాగుతోందన్నారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నియంత్రణ చర్యలు అమలు చేయాలన్నారు. అభ్యర్థుల ఖర్చు, పత్రికా ప్రచారం, సోషల్ మీడియా వ్యూహాలు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా పాల్వంచ మండల పరిధిలోని ఉల్వనూరు, బంజర, సత్యనారాయణ పురం, కోడిపుంజుల వాగు గ్రామపంచాయితీలను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను సర్వేశ్వరరెడ్డి పరిశీలించి ఏర్పాట్లు పరిశీలించారు.

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై అవగాహన

### జిల్లా వైద్యాధికారి తుకారామ్ రాథోడ్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రక్తం ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.తుకారామ్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైధానంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, దాక్కు సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత చెడు వ్యసనాల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ఆరోగ్యాన్ని వారు కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రత్యేక జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజమల్లు అన్నారు. అదే విధంగా డా సైదులు మాట్లాడుతూ మొబైల్ వాడకం అధికంగా ఉన్న ఈ రోజుల్లో హెచ్ఐవిపై పూర్తి అవగాహన పెంచుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. హెచ్ఐవి సోకి చికిత్సలు పొందుతున్న వారికి ప్రభుత్వం ఉండి అందుతున్న సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డా. తేజస్విని వివరించారు. సురక్షిత లైంగిక సంబంధాలు, సురక్షిత రక్తమార్పిడి వంటివి పాటించాలని, ట్యాటూలు వేయించుకునే విషయంలో జాగ్రత్తలు తీ సుకోవాలని, హచ్ఐవి అంటుకునే వ్యాధికాదని, అంటించుకునే వ్యాధని, ఈ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం కళాజాతాల ప్రదర్శనతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, వైద్యులు, మెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

## బిఆర్ఎస్ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని గుండెపుడి గ్రామ పంచాయితీలో దుద్దుకూరి సుమంత్ ఆధ్వర్యంలో (బిఆర్ఎస్) పార్టీ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి గ్రామ పెద్దలు కాళ్లూరి వెంకటేశ్వరావు, కొమ్మినేని కృష్ణమూర్తి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు గాదె కృష్ణయ్య వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అన్నారు. పే దలకు ఉచిత కరెంటు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు, రుణమాఫీ, వరికి బోనస్ ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ అలాగే అభివృద్ధి చేస్తూ ముంఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు పోతున్నారని, కాబట్టి ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అండగా ఉండాలన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సొసైటీ సభ్యులు కళ్యాణపు నరేష్, జవ్వాది వీరయ్య, గోగుల వెంకటేశ్వర్లు, ఆనంగంటి ధనమయ్య, చింతకాయల శ్రీను, గాదె సురేష్, బోడ హరి బాబు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## బుజ్జగింపులు.. ప్రలోభాలు !



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇప్పుడు నాయకులు బుజ్జగింపులు, ప్రలోభాలను ప్రారంభించారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్ స్థానాలకు 254, 308 వార్డు స్థానాలకు 795 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మంగ్యాతండా గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఏకగ్రీవమైనప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పదుల సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల మూడున (బుధవారం) సాయంత్రం మూడు గంటల వరకు ఉప సంహరణలకు గడువు ఉండడంతో నామినేషన్‌లు వేసిన వారిని బుజ్జగించడంతో పాటు ప్రలోభాలకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కార్యకర్తలను చేర్చుకుంటున్నారు.గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. పోటీ చేసే అభ్యర్థులు తమకు అనుకూలమైన వారిని కలుస్తూ తమను గెలిపించాలని కోరుతున్నారు.

## చిన్న గ్రామ పంచాయతీలు

### దొంగతోగులో 88 మంది ఓటర్లు

### అడవి రామవరంలో 85 మంది ఓటర్లు






**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ అభ్యర్థులు, ఓటర్లు ఖర్చు తదితర విషయాలపై చర్చలు జరుగుతుండటం సహజమే. ఓటర్ల సంఖ్య స్థానిక ఎన్నికల్లో ప్రధానమైంది. అతి తక్కువ ఓటర్లతో రెండు గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో బుల్లి పంచాయతీలుగా రికార్డుకెక్కాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలు ఉండగా అడవి రామవరం గ్రామ పంచాయతీలో 85 మంది మహిళలు ఉన్నారు. గ్రామ పంచాయతీని నాలుగు వార్డులుగా విభజించారు. ఒక వార్డుకు 22 ఓట్లు ఉండగా మిగిలిన మూడు వార్డుల్లో 21 ఓట్ల చొప్పున ఉన్నాయి. ఇదే మండలం దొంగతోగు గ్రామ పంచాయతీలో 88 ఓట్లు ఉన్నాయి. 48 మంది పురుషులు కాగా 40 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామ పంచాయతీని కూడా నాలుగు వార్డులుగా విభజించి ఒక్కో వార్డుకు 22 ఓట్లు చొప్పున కేటాయించారు. గతంలో దొంగతోగు పంచాయతీలో కేవలం 32 మంది ఓటర్లు మాత్రమే ఉండేవారు. అయినా భౌతిక పరిస్థితుల దృష్ట్యా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. దొంగతోగు, అడవి రామవరం రెండు పూర్తిగా అటవీ గ్రామలు. రోడ్డు మార్గం చేరాలంటే ఏటైనా ఏడు నుంచి 10 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. దొంగతోగు గుండాలకు 11 కిలో మీటర్ల దూరంలో దట్టమైన అడవిలో కిన్నెరసాని నది పక్కన ఉంటుంది. మూడవ విడతలో ఈ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి ఓటర్లంతా గిరిజనులు సమీప బంధువులు కావడంతో ఏకగ్రీవం చేసుకుంటారో లేదా ఎన్నికలకు వెళ్తారో వేచి చూడాలి.

# నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి

### మార్చి నాటికి రిటైనింగ్ వాల్ పనులు పూర్తి

### భూ సేకరణ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలి

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ సమావేశ మందిరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులపై మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మున్నేరు నదికి ఇరువైపులా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రస్తుతం వర్కింగ్ సీజన్ నడుస్తుందని పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు మొదటి ప్రాధాన్యతగా కేబుల్ నుంచి ప్రకాష్ నగర్ బ్రిడ్జి వరకు రెండవ ప్రాధాన్యతగా పెండింగ్ భూసేకరణ త్వరగా క్లియర్ చేయాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం భూముల బదలాయింపు కోసం అడ్వాన్స్ పోజిషన్ వెంటనే అందించాలని సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులను మంత్రి చరవాణిలో ఆదేశించారు. మార్చి 2026 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. నూతన టెక్నాలజీతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగాలని, హైదరాబాద్ దుర్గం చెరువు, కరీంనగర్ మానేరు నదిపై గతంలో కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మూడవ కేబుల్ బ్రిడ్జి ఖమ్మం నగరంలో నిర్మాణమవుతుందని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుగుణంగా అవసరమైన పవర్ లైన్స్, విద్యుత్ స్తంభాల తరలింపు పక్షం రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీటి పైపులైన్, పవర్‌లైన్ తరలింపు పనులు సమాంతరంగా జరగాలన్నారు. కేబుల్ బ్రిడ్జిపై లైటింగ్ అద్భుతంగా ఉండేలా చూడాలన్నారు. ఖమ్మం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టిపి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలను ఒప్పించి భూ సేకరణ పూర్తి చేసి సంబంధిత ఏజెన్సీలకు భూమి అప్పగించాలన్నారు.పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, విద్యుత్ ఎస్ఈ, తహసీల్దార్లు రాంప్రసాద్, సైదులు, ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## కొత్తగూడెంకుఎర్త్ సైన్స్ యూనివర్సిటీ గర్వ కారణం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ ప్రాంతంలో నూతనంగా స్థాపించబడుతున్న చారిత్రాత్మక డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున ఈ కార్యక్రమానికి తరలిరావాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కో రారు. సోమవారం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం జిల్లాలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ స్థాపన గర్వకారణం అని తెలిపారు. డిసెంబర్ 2న జరిగే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జ్ మ ంత్రి వాకిటి శ్రీహరి, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవె న్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు కూనంనేని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.విజయవంతం చేయాలని కూనంనేని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన 10 మంది అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి 10 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తే వాటికి హాజరు కాని 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

## భారీ కాన్వాయ్‌తో నూతి ప్రమాణస్వీకారం





**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సోమవారం వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అత్యంత సన్నిహితుడు అయిన నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారానికి సోమవారం పెద్ద ఎత్తున భారీ ర్యాలీతో తరలివెళ్లారు. నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారానికి బయల్దేరిన సందర్భంలో మహిళలు పెద్ద ఎత్తున నుదుట తిలకం దిద్ది హారతి పలికారు. నూతి సత్యనారాయణ నివాసం నుండి ప్రారంభమైన ర్యాలీ ఖమ్మం వరకు కొనసాగింది. ఖమ్మం రెస్టారెంట్ వద్ద పట్టణ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వైరాలో కాంగ్రెస్ ప్రమాణ స్వీకార ర్యాలీని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని ప్రారంభించారు. నూతి ప్రమాణస్వీకారం నేపద్యంలో వైరా పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు పండుగ వాతావరణాన్ని చూపించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా నాయకులు బాలాజినాయక్, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీ కృష్ణ, పమ్మి అశోక్, మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, కొప్పురావూరి సుమంత్, ఫణితి సైదులు, పొదిలి హరినాథ్, వేముల రత్నాకర్, వీరంశెట్టి సీతారాములు, ఫణితి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ డైరెక్టర్ వేల్పుల మురళి, జవ్వాజి నాగరాజు, మిట్టపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## స్వీకరించిన దరఖాస్తులు పరిశీలన

### ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** మూరుమూల గిరిజన గ్రామాల నుండి వచ్చి సమర్పించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి ఎన్నికల కోడ్ ముగియగానే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. ఐటిడిఏ సమావేశపు మందిరంలో సోమవారం నర్విహించిన ప్రజావాణికి ఆయన హాజరై గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిఓ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి దశవారీగా అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల మోడల్ కోడ్ ఉన్నందున, ఆ కోడ్ ముగిసిన అనంతరం ప్రతీ దరఖాస్తును శాఖల వారీగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

## పల్లెల్లో వేడెక్కిన 'స్థానిక' సమరం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో మూడో తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మండలంలో పేరువంచ, చిన్న కోరుకొండి, ముగ్గ వెంకటాపురం, మర్లపాడు పెద్ద కోరుకొండి, చంద్రు పట్ల, తెలగారం, రఘునాథ గూడెం, లక్ష్మీ పురం, ఎర్రబోయినపల్లి, పోచారం, ఓబులరావు బంజర్ ఆయా గ్రామాలలో అభ్యర్థులు ఎంపికలు పోటాపోటీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు ఎంపికలో కార్యకర్తలు నాయకుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అదే విధంగా చెన్నూరు గ్రామంలో సోమవారం ఇరువురు పార్టీలు సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఎంపికలు మధ్యాహ్నం వరకు సమావేశాలు వేరువేరుగా నిర్వహించారు. నామినేషన్ ప్రక్రియ మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు కొనసాగుతుండగా వార్డు సర్పంచ్ అభ్యర్థులు ఎంపికలు ఇప్పటికే పూర్తి చేసుకుని రహస్యంగా ఉంచుకోగా మరికొన్ని గ్రామాలలో అభిప్రాయ సేకరణ జరుగుతోంది. ఆర్థికంగా, ప్రజల్లో బలంగా ఉన్న అభ్యర్థుల ఎంపికలో ఇరువురు పార్టీలు కీలకంగా రహస్యంగా ఎంపికలు కొనసాగిస్తున్నారు. ఈ సమయంలో కార్యకర్తలు నాయకుల అభిప్రాయాలను సేకరించుకొని సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కలిగిన గ్రామాల్లో కూడా సన్నాహక సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు సిద్ధం చేసుకు ఉన్నారు. ఇరువురు సామాజిక వర్గాలలో ప్రజల్లో ఉన్న బలం, ఆర్థికంగా తట్టుకునే వ్యక్తులను రహస్యంగా ఉంచారు. ఎంపికలు పూర్తిచేసుకుని అంతర్గతంగా ఉంచారు. బేధాభిప్రాయాలలో ఎంపిక చేయడంలో వర్గ విభేదాలు ఉండటం తో పంచాయతీ అధిష్టానానికి చేర్చారు. కాంగ్రెస్ పా ర్టీ ఎంపిక ఉండగా రెండో స్థానంలో బిఆర్ ఎస్ ఉంది. అధికార పార్టీ అభ్యర్థులను బట్టి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు ఉంది. అందరి అభ్యర్థుల పేర్లను మూడో తేదీ నుంచి 5వ తేదీ లోపల నామినేషన్ ప్రక్రియలో బహిర్గతం కానుంది.

## 5మండలాలలో మొదటి విడత ఎన్నికలు

### 95 పంచాయతీలలో ఓటింగ్

### సర్పంచ్‌లకే అత్యధికంగా నామినేషన్లు

**ప్రజాపక్ష/మణుగూరు:** పినపాక నియోజకవర్గంలో ఐదు మండలలోని 95 పంచాయతీలకు మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయి. గతంలో కంటే అత్యదికంగా సర్పంచ్ స్థానానికి నామినేషన్లు రావటం జరిగింది. పినపాక మండలలోని 23 పంచాయతీలలో సర్పచ్ స్థానానికి 121 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. కరకగూడెం మండలంలోని 16 పంచాయితీలలో సర్పంచ్ స్థానానికి 57 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.మణుగూరు మండలంలోని 14 పంచాయతీలకు 65 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. అశ్వాపురం మండలంలోని 24 పంచాయతీలకు 127 మంది అభ్యర్థులు పోటిపడుతున్నారు. బూర్గంపాడు మండలం లోని18 పంచాయతలకు 104 మంది అభ్యర్థులు పోటిపడుతున్నారు. మణుగూరు మండల పరిధిలోని బుగ్గ గ్రామ పం చాయతీలో సర్పంచ్‌కి 3 గురు పోటిలో ఉండగా 6వార్డులకు 11 మంది పోటి పడుతున్నారు. దమ్మక్కపేట పంచాయితీలో సర్పంచ్‌గా 3గురు బరిలో ఉండగా,8 వార్డులకు గాను 24 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. గుట్టమల్లారం పంచాయతీలో సర్పంచ్‌గా ఐదుగురు పోటిలో ఉండగా, 8వార్డులకు గాను 19 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. ఇప్పల సింగారం పంచాయతీలో సర్పంచ్‌గా ముగ్గురు పోటిలో ఉండగా,10 వార్డులకు గాను 20 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. కట్టుమల్లారం పంచాయతీలో సర్పంచ్‌గా ముగ్గురు పోటిలో ఉండగా,8 వార్డులకు గాను 17 మంది పోటిపడుతున్నారు. కునవరం పంచాయతీలో 7గురు సర్పంచ్ స్థానానికి పోటి పడుతుండగా,16 వార్డులకు గను 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. లంకమల్లారం పంచాయతీలో సర్పంచ్‌గా ఇద్దరు పోటిలో ఉండగా, 6వార్డులకు గాను 19 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. తొగ్గూడేం పంచాయతీలో సర్పంచ్‌గా 4గురు పోటిలో ఉండగా,8 వార్డులకు గాను 18 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. తిర్లాపురం పంచాయతీలో సర్పంచ్ స్థానానికి 7గురు పోటిలో నిలవగా,8 వార్డులకు గాను 37 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. సమితి సింగారం పంచాయతీలో సర్పంచ్‌గా 6గురు పోటిలో ఉండగా,16 వార్డులకు టీను 56 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. రామానుజవరం పంచాయతీలో సర్పంచ్‌గా5గురు పోటిపడుతుండగా, 12 వార్డులకు గాను 55 మంది అభ్యర్థులు పో టిలో ఉన్నారు. పగిడేరు పంచాయతీ పరిధిలో సర్పంచ్‌గా 6 గురు పోటిలోఉండగా,10 వార్డులకు గాను 22 మంది అ భ్యర్థులు పోటి పడుతున్నారు. ముత్యాలమ్మ నగర్ పంచాయితీ పరిధిలో సర్పంచ్‌గా 4గురు పోటిలో ఉండగా, 8 వా ర్డులకు గాను 28 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు.

## ఖమ్మం వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు






**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు అక్రమ రవాణ నియంత్రణలో భాగంగా పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జనసంద్రమైన ప్రాంతాలు, లాడ్జిలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. నియోజక వర్గ, మండల కేంద్రాలలోని ప్రధాన రహదారుల్లో వాహనాలు తనిఖీ చేపట్టారు. డ్రంకెండ్‌డ్రైవ్‌లు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులను విచారించి వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితుల నుంచి వేలిముద్రలను సేకరిస్తున్నారు. విజబుల్ పోలీసింగ్‌ను పట్టిష్టంగా అమలు చేస్తేనే నేరాలు అదుపులోఉంటాయని పోలీసు ఆదిశగా తనిఖీలు విస్తృతం చేయాలని పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ ఆదేశించారు. బస్టాండ్‌లు, లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించి వారి నుంచే సమాధానాల ఆధారంగా వేసులు బాటు ఉంటే వదిలివేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి, ఇసుక, రేషన్‌బియ్యం అక్రమరవాణను కట్టడిచేయాలని ఎస్‌హెచ్‌ఓలు, ఏసిపిల ను సిపి ఆదేశించారు.

## రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/కల్లూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెచ్చగొట్టే పోస్టులుపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిత హెచ్చరించారు.ఎన్నికల కోడ్ అమలులోఉన్నందున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హాని కలిగించే పోస్టులు షేర్ చేసిన నేరంగా పరిగణించి గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యులనుగా చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనుక సోషల్ మీడియా లో ప్రచారం చేసే వ్యక్తులు అప్రమత్తం గా ఉండాలని ఎస్ఐ సూచించారుప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బిఆర్ఎస్, సిపిఎం పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన బిఆర్ఎస్, సిపిఎం పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు సమష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్, నాయకులు మహేందర్ రెడ్డి, కుమారస్వామి, రమేష్, మల్లేష్, ఐలయ్య, అశోక్, రాజశేఖర్, మల్లయ్య, భాస్కర్, ముత్తయ్య, రాజు, పన్నీరు రాజు, పవన్ పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎసిపి

**ప్రజాపక్షం / వేలేరు :** మండలంలోని నాలుగు క్లస్టర్ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ రెండవ రోజు 32 మంది సర్పంచ్ అభ్యర్థులు 59 వార్డు సభ్యులు నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అధికారి లక్ష్మీ ప్రసన్న ఒకప్రకటనలో తెలిపారు.మండలంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను సోమవారం కాజీపేట ఏసిపి పింగిళి ప్రశాంత్‌రెడ్డి ఎస్సై ఎ సురేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు ధర్మసాగర్ సిఐ శ్రీధర్ వేలేరు మండల కేంద్రంలోని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో మాట్లాడారు, గ్రామపంచాయితీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలో ఎవ్వరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు సంబంధించిన పోస్టులు వివిధ సామాజిక మాధ్యమాలలో గాని వాట్సప్ గ్రూపులలో గాని పోస్టు చేసిన వారిపై,గ్రూప్ అడ్మిన్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.కాజీపేట ఏసిపి ప్రశాంత్‌రెడ్డి,ధర్మసాగర్ సిఐ శ్రీధర్,ఎస్ఐ ఎ సురేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## 3న మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3న హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ వద్ద గల రాష్ట్ర సమాచార కార్యాలయం ముందు జరిగే మహా ధర్నాలో భాగంగా జిల్లా కేంద్రంలో మహా ధర్నా పోస్టర్ లను టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ సెక్రటరీ సామల శ్రీనివాస్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందని, జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడేషన్లతో పాటు ఇంటి స్థలాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న టియుడబ్ల్యుజె (ఐజెయు) యూనియన్ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా లో భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ ఏట వీరభద్ర స్వామి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ ఎగ్జామినేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ములుగు:** జనవరి, ఫిబ్రవరి 2026న జరగబోయే టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్ ఎగ్జామినేషన్(టిసిసి)కు సంబంధించిన అప్లికేషన్ ఫామ్స్ డిఈఓ ఆఫీస్, ములుగు వద్ద స్వీకరించడం జరుగుతుందని డ్రాయింగ్ లోయర్, హైయర్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హైయర్ గ్రేడ్లకు సంబంధించిన అభ్యర్థులు ఫైన్ లేకుండా డిసెంబర్ ఐదవ తేదీ వరకు రూ.50 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు రూ.75 ఫైన్‌తో, డిసెంబర్ 19వరకు చెల్లించవచ్చునని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి, పరీక్షల నియంత్రణ అధికారి కె వినోద్ కుమార్ తెలిపారు.

## స్ట్రీట్ వెండర్స్‌కు గొడుగుల పంపిణీ




**ప్రజాపక్షం/ములుగు:**ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ములుగు లయన్స్ క్లబ్‌లో నూతనంగా చేరిన కొత్త సభ్యుల చేతుల మీదుగా ములుగు జిల్లా కేంద్రంలో స్ట్రీట్ వెండర్స్కు నీడనిచ్చే పెద్ద లయన్స్ గొడుగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ములుగు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్లపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు అమ్ముకునే వ్యాపారులకు లయన్స్ పెద్ద గొడుగులు వారికి వర్షానికి ఎండకు ఉపయోగపడతాయని అన్నారు. ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ చుంచు రమేష్, కోశాధికారి ఆడెపు రాజు, పిజడ్‌సి సానికొమ్ము రవీందర్ రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ మెరుగు రమేష్, కొండి సాంబ శివ, దొంతిరెడ్డి బలరాంరెడ్డి, నూతన లయన్స్ క్లబ్ సభ్యులు సోమ నర్సయ్య, డాక్టర్ ఎం రాజా రుద్రోజ్, వంశీ, రుద్రోజు ఆనంద్, గంద్రత్ శ్రీధర్, పెట్టెం రాజేందర్, ములుగు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## మొదటి దశ ఎన్నికలకు సర్వం సిద్ధం

### మండలానికి చేరిన బ్యాలెట్ బాక్సులు


**ప్రజాపక్షం/గూడూరు:** తెలంగాణ వ్యాప్తంగా మొదటి దశ ఎన్నికల సంఘం సర్వం చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో మొదటి దశ స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది.అందులో భాగంగా ఆదివారం బ్యాలెట్ బాక్సులు గూడూరు మండలానికి చేరుకున్నాయి.రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయగా మహబూబాబాద్ జిల్లాలో మొదటి దశ నిర్వహించే మండలాల్లో గూడూరును చేర్చింది.నవంబర్ 27న నోటిఫికేషన్ జారీ చేయగా ఆరోజు నుండే గూడూరు మండలంలో నామినేషన ప్రక్రియ మొదలై మూడు రోజుల్లో పూర్తి చేశారు.ఈనెల 11వ తేదీ మొదటి దశె ఎన్నికలు జరగనుండగా మండలంలోని 41 గ్రామపంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందిపోలింగ్ అవసరమైన బ్యాలెట్ బాక్సులు గూడూరు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోగా మొత్తం 467 బ్యాలెట్ బాక్స్లను అందుబాటులో తెచ్చేందుకు సిద్ధంగా ఉంచాలి సర్పంచ్ వార్డుసభ్యులుకు వేరు వేరు రంగులో ఉండే బ్యాలెట్ పేపర్లను పోలింగ్‌కు ఉపయోగించనున్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని కంచనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి దేవస్థానం గట్టయ్య, బీజేపి నుండి అమృతం అంజయ్య జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, కంచనపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు లోనె రవీందర్, కొలిపాక మల్లేష్, పురుషోత్తం, రఘునాథపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రోజు భార్యాభర్తలు మృతి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఒకే రోజు భార్యభర్తలు మృతిచెందిన సంఘటన మండలంలోని మండెలగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తిని ఎల్లమ్మ (54) గత 13 సంవత్సరాల క్రితం ఆటో ప్రమాదంలో గాయపడి అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమైంది. దీంతో భర్త బత్తిని సత్తయ్య (70) భార్య బాగోగులు చూసుకుంటూ సేవలు చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం అనారోగ్యంతో ఎల్లమ్మ మృతిచెందడంతో మనస్థాపం చెందిన భర్త సత్తయ్య సైతం నాలుగు గంటల వ్యవధిలోనే మృతిచెందాడు. గ్రామంలో ఒకేరోజు భార్యభర్తలు మృతిచెందడంతో విషాద చాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ భార్యభర్తలు అన్యోన్యంగా ఉంటూ కష్టకాలంలో కూడా ఒకరికొకరు తోడుగా ఉంటూ ఒకే రోజు మృతిచెందడం చాలా బాధాకరమని వారన్నారు.

# నగర ప్రాముఖ్యతను తెలిపేలా హోర్డింగ్స్

### ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు






**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగ రాజు పాల్గొన్నారు. తొలుత ఇటీవల మరణించిన పలువురు మాజీ కౌన్సిలర్లకు నివాళులు అర్పిస్తూ 2నిముషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని నాగరాజు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు తడి పొడి చెత్త విభజించడం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కార్పొరేటర్ల సహకారంతో ట్రేడ్ లైసెన్స్ చెల్లించని వారి జాబితాను అధికారులు తయారు చేసి వసూళ్లు చేసేలా చూడాలని మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. జెఎన్ఎస్ స్టేడియంలో మరింత మెరుగైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సమావేశంలో ఆదేశించారు. వరంగల్ మహానగరం వరదముప్పుకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గోపాలపురం చెరువుకు సైడ్ వాల్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధికి 1/3 ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, స్టాంప్ డ్యూటీ మా డివిజన్‌లో నుండి ఎక్కువ వస్తుందని అన్నారు. మేడారం మహా జాతరకు వెళ్లే భక్తులు ఔటర్ నుండి నేరుగా వెళ్తారని, వారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తూ మన నగర ప్రాముఖ్యతను తెలిపేలా హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, రహదారిపై లైటింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని ఎంఎల్ఏ నాగరాజు కోరారు. బల్దియా పరిధిలో సీజనల్ వ్యాధుల వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఓపెన్ ప్లాట్స్, ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వడ్డేపల్లి చర్చి సమీపంలో ట్రాఫిక్ ఇబ్బంది ఉందని, ప్రత్యేక రోడ్డు నిర్మించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, తుఫాన్ ప్రభావం నేపథ్యంలో 55, 56, ఇతర డివిజన్‌లలో తీవ్ర నష్టం వాటిల్లిందని, వారికి అండగా ఉందామన్నారు. అధికారులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అం దించేలా చర్యలుతీసుకోవాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రూ.135 కోట్ల అభివృద్ధి పనులు బల్దియా కౌ న్సిల్ ఆమోదం తెలిపింది.ఈ కార్యక్రమంలో క మిషనర్ చాహత్ బాజ్ పాయ్, ఎమ్మెల్యేలు నా యిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

## సజావుగా నామినేషన్ ప్రక్రియ

### ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్ ఆదేశం



**ప్రజాపక్షం / జనగామ:** నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవికిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జనగామ మండలంలోని శామీర్‌పేట, బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామల్లో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ రవికిరణ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్ల వివరాలు, టి పోల్ ఎంట్రీ ప్రక్రియని పరశీలించ ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ డ్యూటీలు ఏమైనా చేశారా అని అడిగి నామినేషన్ ప్రక్రియ సాఫీగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. రెండవ దశకి సంబంధించి నామినేషన్‌కి చివరి తేదీ మంగళవారం అయనందున గ్రామ పంచాయతీల్లో నామినేషన్ మీద అవగాహన కల్పిస్తూ టామ్ టామ్ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులకు తెలిపారు. మండల తహసీల్దార్లు హుస్సెన్, చారీ పాల్గొన్నారు.

**జనగామ, నర్మెటలో పరిశీలించిన అదనపు కలెక్టర్ :**జనగామ మండలంలోని వడ్లకొండ, నర్మెట మండలంలోని హన్మంతాపూర్ గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ పింకేషన్‌కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి, ఎంపిడిఓ, ఎంపిఓ తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి

### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** శ్రీసమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోపు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ వెంకటేష్‌లతో కలిసి శ్రీఋుసమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ విఐపి, వివిఐపి పార్కింగ్ స్థలాలను రహదారులను, గద్దెల ప్రాంగణ అభివృద్ధి పనులు, రెడ్డిగూడెం అంతర్గత రహదారులను వాటి పనుల పురోగతిని ఆర్‌డిఓ వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండొద్దు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం /దుగ్గొండి/నల్లబెల్లి/ గీసుగొండ :** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని దుగ్గొండి మండలంలోని శివాజీనగర్ లతో పాటు నల్లబెల్లి మండల కేంద్రంలో రేలకుంట, గీసుగొండ మండలంలోని కోనాయి మాకుల, మచ్చాపూర్ లలో గ్రామ పంచాయతీలను కలెక్టర్ ఆకస్మికంగా సోమవార సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

## పార్లమెంటు సమావేశాలలో బిసి బిల్లులు ఆమోదించాలి

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** పార్లమెంటుసమావేశాలలో బిసి బిల్లులు ఆమోదించాలని, ఇండియా కూటమి సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుండి ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో బిజెపి ప్రభుత్వం బిసిల బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించాలని, అందుకు కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పోరాడి సాధించాలని డిమాండ్ చేశారు. 19వ తేదీ వరకు కొనసాగే సమావేశాలలో కొత్తగా 14బిల్లులను ప్రవేశపెడతామని కేంద్రం ప్రకటించిందని కానీ అందులో బిసిల రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులు లేకపోవడం అత్యంత దుర్మార్గ మన్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బిసిలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో పెట్టి ఆమోదించే విధంగా కాంగ్రెస్ ఇండియా కూటమి ఎంపీలు పోరాడాలని, లేనిచో బిసిల విశ్వాసాన్ని కోల్పోతారని హె చ్చరించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న బిసిల ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని చట్టసభలలో బి సిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఈ సమావేశాల్లోనే ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. లేనిచో బిసిల పోరాటాలు ఉధృతమైతే అందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్లలో బిసి కోటా, బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనాభాలో సభానికి పైగా ఉన్న బిసిల సంక్షేమానికి అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని తదితర డిమాండ్స్ సాధనకు, అంతిమంగా రాజ్యాధికారం కోసం బిసిలు సమైక్యపోరాటాలకు సమయత్తం కావాలని పిలుపునిచ్చారు

## మెడికవర్ ఆసుపత్రిలో 'ఠాగూర్ సీన్' రిపీట్

### ఆసుపత్రి ఎదుట రోగి బంధువుల ఆందోళన




**ప్రజాపక్షం/హనుమకొండ :** నిర్లక్ష్యంగా వైద్యం అందించి రోగి ప్రాణాలు బలిగొన్నారని పేర్కొంటూ వరంగల్ హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి ఎదుట మృతుని బంధువులు ఆందోళనకు దిగారు. భూపాలపల్లి మండలం చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన ప్రభాకర్ ను బంధువులు ఆదివారం సాయంత్రం మెడికవర్ ఆస్పత్రిలో జాయిన్ చేయించారు. అత్యవసర విభాగంలో జాయిన్ చేయించిన వైద్య సిబ్బంది.. వైద్య సేవల కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని చెప్పడంతో.. కొంత అమౌంట్ కట్టి.. మిగతా అమౌంట్ తయారు చేసుకోవాలని చెప్పారు.ఆ ప్రకారమే బంధువులు బిల్లు పే చేశారు. బిల్లు చెల్లింపు ప్రక్రియ పూర్తయిన కొద్దిసేపటికే రోగి ఆరోగ్య పరిస్థితి సీరియస్ గా ఉందని బంధువులకు తెలియజేసి.. హైదరాబాద్ లోని మరో కార్పోరేట్ ఆస్పత్రికి తరలించాలని వెల్లడించారు. బంధువులకు చెప్పిన కొద్దిసేపట్లో పేషంట్ చనిపోయినట్లుగా నిర్ధారణ చేయడం గమనార్హం.

**ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన:** మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు డబ్బుల కోసమే వైద్యం అందజేస్తున్నట్లుగా నాటకమాడారంటూ మృతుడు ప్రభాకర్ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డబ్బులు రాబట్టుకున్న తర్వాత చనిపోయినట్లుగా చెప్పారంటూ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ప్రశ్నించేందుకు వెళ్లిన తమ పై వ్యక్తిగత బౌన్సర్ల తో బంధువులపై దాడి చేశారంటూ ఆరోపించారు. మృతదేహం అప్పగించేందుకు రూ. 80వేలు డిమాం డ్ చేస్తున్నారంటూ మీడియాకు వివరించారు. ఇదిలా ఉం డగా.. విషయం బయటకు రావడంతో సంతకం పెట్టి బాడీని తీసుకెళ్లడంటూ సిబ్బంది రోగి బంధువులకు సమాచారం ఇవ్వడం కూడా మెడికల్ జరిగిందన్న ఆరోపణలకు బలం చేకూర్చినట్లవుతోంది.

## పథకాల అమలు లోపాలపై ప్రశ్నించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సోమవారం లోక్‌సభలో వరంగల్ లో నైపుణ్యాభివృద్ధి పథకాల అమలుపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కింద వరంగల్ జిల్లాలో జరుగుతున్న పనులపై ఎంపీ ప్రశ్నించారు. ప్రధానంగా శిక్షణా కేంద్రాల పని తీరు, మహిళలు–ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు, పరిశ్రమల అనుసంధానం, ఉద్యోగావకాశాల ఫలితాలపై సమగ్ర వివరాలను ఎంపీ కోరారు.ఈ మేరకు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, "పీఎంకేవీవై ప్రారంభం నుంచి వరంగల్‌లో ఎనిమిది శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం అమలులో ఉన్న పీఎంకేవీవై–4.0లో ఒక్క కేంద్రం కూడా పనిచేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యువతకు తక్షణ శిక్షణ కోర్సులు లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, ఎస్సీ వర్గాల కోసం పీఎంకేవీవై–4.0లో ప్రత్యేక రిజర్వేషన్లు లేకపోవడం దురదృష్టకరం అని ఎంపీ విమర్శించారు. గతంలో 4,592 మంది ఎస్సీ అభ్యర్థులు శిక్షణ పొందగా 76 శాతం సర్టిఫికేషన్, 12,461 మంది మహిళలు శిక్షణ పొందగా 80 శాతం సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ, ప్రస్తుత దశలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకపోవడం అన్యాయం అని అన్నారు. "బలహీన వర్గాల అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టాలని ఎంపి డాక్టర్ కావ్య డి మాండ్ చేశారు.పరిశ్రమలతో ఒప్పందాల ద్వారా అప్రెంటిస్‌షిప్, ఆన్–ది–జాబ్ ట్రైనింగ్ (ఓజేటి) వంటి అవకాశాలు ఉన్నప్పటికీ, 2015–2022 మధ్య శిక్షణ పొందిన 15,398 మంది అభ్యర్థుల్లో కేవలం 6,322 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించడంతో ప్లేస్‌మెంట్ రేటు 41 శాతంకు పరిమితమైందని ఎంపీ విమర్శించారు. "ప్లేస్‌మెంట్ తర్వాత వేతనవృద్ధి, స్థిరమైన ఉపాధిపై సమర్థవంతమైన ట్రాకింగ్ ఉండాలి అని ఈ సందర్భంగా సూచించారు.ఈ మేరకు ఎంపీ డా. కడియం కావ్య గారు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌధరీ సమాధానం ఇచ్చారు. పీఎంకేవీవై–4.0లో రిజర్వేషన్లేమీ లేవని, కానీ కెరీర్ ఆధారిత ఓజేటిపై దృష్టి పెట్టామని తెలిపారు. వరంగల్ సామర్థ్యానికి తగినట్లుగా యువతను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ కావ్య తెలిపారు. జిల్లాలో యువతకు నైపుణ్యాలే భవిష్యత్తు" అంటూ సమస్య పరిష్కారం కొరకు తాను పోరాడుతానని స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తొద్దు

### భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సివిల్ సప్లై, ట్రాన్స్ పోర్ట్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, కోపరేటివ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోళ్ల చేపట్టాలని అన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు అందుబాటులో ఉండడం లేదని, ట్యాబ్ ఎంట్రీ చేసి నివేదికలు అందించే విషయం ఆలస్యం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో లేని నిర్వాహకులను సస్పెండ్ చేస్తామని, అలాగే సంబంధిత అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సెంటర్ ఇంచార్జీలు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు రిజిస్టర్లు లో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్రతి రోజు తేమ శాతం పరీక్షించి రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ఏ రోజు కారోజు కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేయాలని తెలిపారు.. మండలాలలో మండల ప్రత్యేక అధికారులు తహసిల్దార్లు ప్రతి రోజు పర్యవేక్షణకు పంపిస్తానని అలసత్వం వహిస్తే కేంద్రాల ఇంచార్జీలను సస్పెండ్ చేస్థానాన్ని, సమన్వయం ఉండాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, ఆర్టిఓ సంధాని, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డిఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఎన్ని ట్రక్కులు మిల్లులకు వెళ్లాయని, ఓపిఎంఎస్ ద్వారా ఎంతమంది రైతుల వివరాలను ఎంట్రీ చేశారని, గత సీజన్లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, ప్రస్తుత సీజన్లో ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని, ధాన్యానికి సంబంధించిన ఇతర వివరాలను జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రక్ సీట్లను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని అన్నారు. ఓపిఎంఎస్ లో ధాన్యము విక్రయించిన రైతుల వివరాలను నమోదు చేసి వారి ఖాతాలో డబ్బులు పడే విధంగా చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, స్థానిక తహసిల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం దేవానంద్, సీసీ శ్రీనివాస్, దాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు , రైతులు పాల్గొన్నారు.

**ధర్మసాగర్‌లోని విజయ డెయిరీని సందర్శించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

ధర్మసాగర్ లోని విజయ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రం (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్) ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం సందర్శించారు.పాడి రైతులకు చెల్లిస్తున్న పాల బిల్లుల విధానం, చెల్లింపుల ప్రక్రియపై సమగ్ర సమాచారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు.

# క్రీడ




## సేఫ్టీ క్లియరెన్స్ వస్తేనే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు!

చిన్నస్వామి స్టేడియంలో ఐపిఎల్ 2026 మ్యాచ్‌లు జరగడం కష్టంగానే కనిపిస్తోంది. ఈ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటే ముందుగా సేఫ్టీ క్లియరెన్స్ నివేదికను అందజేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కి అధికారిక నోటీసును జారీ చేసింది. స్టేడియంకు సంబంధించి వివరణాత్మక నిర్మాణ భద్రత నివేదికను సమర్పించాలని ఆదేశించింది. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ ధ్రువీకరించిన నిపుణులతో నివేదికను రూపొందించాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగానే చిన్నస్వామి మైదానంలో మ్యాచ్‌లకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటుంది. ఐపిఎల్ 2025లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవగా.. జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అప్పుడు స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తొక్కిసలాట ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. ఇందులో పెద్ద కార్యక్రమాలు నిర్వహిస్తే జనాలను అదుపు చేయలేక మళ్లీ తొక్కిసలాట లాంటి పరిస్థితులు ఏర్పడతాయని, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించింది. తొక్కిసలాట జరిగినప్పటి నుంచి ఈ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించడం లేదు. ఇప్పుడు తిరిగి మ్యాచ్‌లు నిర్వహించాలంటే స్టేడియంలో ప్రేక్షకుల గ్యాలరీలు, మొత్తం నిర్మాణం పెద్ద ఈవెంట్లు నిర్వహించడానికి సురక్షితంగా ఉందని నిరూపించాలి. స్టేడియంకు సేఫ్టీ క్లియరెన్స్ ఉంటేనే ఐపిఎల్ 2026లో మ్యాచ్‌లకు అనుమతిస్తామని కర్ణాటక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌సీబీ ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించింది. పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియంలో 2026 ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సమాలోచనలు చేస్తోంది.



## రెండో వన్డేకు ముందు
## గంభీర్, అగార్కర్‌తో బిసిసిఐ సమావేశం!

రాంచి వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి వన్డేలో టీమ్‌ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రెండో వన్డే రాయ్‌పుర్‌లో డిసెంబర్ 3న జరగనుంది. ఈ నేపథ్యంలో బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. రెండో వన్డేకు ముందు ఆకస్మికంగా.. టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, మరికొందరు ఉన్నతాధికారులతో బిసిసిఐ సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, జాయింట్ సెక్రటరీ ప్రభ్‌తేజ్ సింగ్ బాటియా ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బిసిసిఐకి ఇటీవలే అధ్యక్షుడిగా నియమితుడైన మిథున్ మన్హాస్ సమావేశానికి హాజరవుతారా? లేరా? అనే విషయం తెలియరాలేదు. ప్రస్తుతం టీమ్‌ఇండియా ప్రదర్శన, ఆటగాళ్ల ఎంపిక తదితర అంశాల మీద వీరంతా చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ 20 తేడాతో ఓడిపోవడంపై సమీక్ష జరిపే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వీరు కసరత్తు చేయనున్నట్లు సమాచారం. 'ప్రస్తుతం టీమ్‌ఇండియా వ్యూహాలు మైదానంలో, వెలుపల కొన్నిసార్లు గందరగోళానికి గురి చేస్తున్నాయి. తదుపరి టెస్ట్ సిరీస్‌కు దాదాపు ఎనిమిది నెలల సమయం ఉంది. ఈ నేపథ్యంలో మేం మరింత స్పష్టత, ముందస్తు ప్రణాళికను కోరుకుంటున్నాం' అని ఓ బిసిసిఐ అధికారి 'స్పోర్ట్స్ స్టార్'కు తెలిపారు. 'వచ్చే సంవత్సరం టీ20 వరల్ కప్ జరగనుంది. భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఆ తర్వాత సంవత్సరం వన్డే వరల్ కప్ జరగనుంది. ఈ నేపథ్యంలోనే జట్టులోని సమస్యలను త్వరగా పరిష్కరించాలనుకుంటున్నాం' అని ఆ అధికారి పేర్కొన్నారు. అలాగే డిసెంబర్ 9 నుంచి టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జట్టును కూడా ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం.

## ఫిట్‌నెస్ పరీక్షకు సిద్ధమవుతున్న గిల్..

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో గాయపడిన శుభ్‌మన్ గిల్ గురించి కీలక అప్డేట్ వచ్చింది. మెడకు గాయంతో వన్డే సిరీస్‌కూ సైతం దూరమైన గిల్ పునరాగమనానికి సిద్ధమవుతున్నాడు.



వరుసగా సఫారీలతో రెండు సిరీస్‌లలో ఆడని భారత కెప్టెన్ తదుపరి టీ20 సిరీస్ లోపు ఫిట్‌నెస్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. అందుకని.. భారత కెప్టెన్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు. డిసెంబర్ 9 నుంచి మొదలయ్యే పొట్టి సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశముంది. ఇటీవలే టెస్టు, వన్డే పగ్గాలు స్వీకరించిన శుభ్‌మన్ అనుకోకుండా గాయంతో జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. కోల్‌కతా టెస్టులో హార్మర్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోయి మెడకు బంతి తగిలించుకున్న గిల్ ఆ తర్వాత నుంచి మైదానంలోకి దిగలేదు. మెరుగైన చికిత్స కోసం ముంబై వెళ్లిపోయిన గిల్.. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నాడు. రాంచీలో తొలి వన్డేకు ముందు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ గిల్ ఆరోగ్యంపై కీలక అప్డేట్ ఇచ్చాడు. భారత సారథి ఆరోగ్యం మెరుగైందని.. అతడు త్వరలోనే మైదానంలోకి దిగుతాడని మోర్కెల్ చెప్పాడు. అతడు అన్నట్టే.. గిల్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు. సోమవారం సాయంత్రం లోపు గిల్ సీఓఈలో అడుగుపెడుతాడని బిసిసిఐ వర్గాలు తెలిపాయి. అక్కడ నిపుణుల సమక్షంలో ఫిట్‌నెస్ పరీక్షలో పాల్గొనాలనకుంటున్నాడు టీమిండియా కెప్టెన్. అయితే.. ప్రస్తుతానికైతే గిల్‌కు అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు 50 శాతమే అవకాశముందని సమాచారం. కాబట్టి.. గిల్ రిస్క్ తీసుకుంటాడా? లేదంటే మరి కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటాడా? అనేది తెలియాల్సి ఉంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య డిసెంబర్ 9న టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. వన్డేలకు దూరమైన ప్రధాన పేసర్ బుమ్రా సైతం టీ20ల్లో ఆడే అవకాశముందని టాక్.

# ఫోకస్ యువతరంగం


ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్న మానసిక రుగ్మతగా భావోద్వేగ అస్థిరతను పేర్కొనాలి. ఈ సమస్యవల్ల ఉద్యోగ, వ్యాపార నైపుణ్యాలు దారుణంగా దెబ్బతింటాయి. అక్కౌంటెంట్‌కు లెక్కల నైపుణ్యం వంటి హార్డ్ స్కిల్స్ ఉద్యోగానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు. కానీ, సాఫ్ట్ స్కిల్స్ అనేవి కెరీర్‌ను నిర్మించగలవు లేదా ధ్వంసం చేయగలవు.



## నైపుణ్యాలను దెబ్బతీసే భావోద్వేగ అస్థిరత!

సాఫ్ట్ స్కిల్స్ ఇతరులతో సఖ్యతగా ఉండడం, సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడం, సహకరించడం, కార్యాలయంలో భావోద్వేగాలను నియంత్రించడం వంటి నైపుణ్యాలను కలిగి ఉంటాయి. అందుకే, సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి కేంద్రీకరించాలి. ఇవి లోపించినప్పుడు భావోద్వేగ అస్థిరత ఏర్పడుతుంది. ఎవరైనా ఫీడ్‌బ్యాక్ ఇచ్చినప్పుడు, వాటిని గమనించకపోవడం, విమర్శ ఎదుర్కోవాలనే భయంతో సహచరులు, మేనేజర్లతో సంభాషణలను తప్పించుకోవడం వంటి లక్షణాలను భావోద్వేగ అస్థిరతగా పేర్కోవచ్చు. అదే విధంగా ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారిలో సమయపాలన కొరవడుతుంది. స్వీయనింద లేదా తమను తాము నిందించుకోవడం పెరుగుతుంది. జట్టు సభ్యులతో సఖ్యతగా ఉండలేకపోతారు. తమను అప్పుగా అర్థం చేసుకుంటారేమోనన్న అనుమానంతో, వారికి సహకరించకుండా దూరంగా ఉండిపోతారు. అతిగా ఆలోచించడం లేదా నిర్ణయాలు తప్పుగా నిరూపితమవుతాయన్న భయంతో అసలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం వంటి పరస్పర విరుద్ధ భావనలతో సతమతమవుతారు. సమావేశాల్లో ఆసక్తి చూపరు. చర్చల్లో చురుగ్గా పాల్గొనరు. గందరగోళపడుతూ, తప్పుగా మాట్లాడడం లేదా అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా జరుగుతుంది. ఇమెయిల్స్‌కి త్వరగా స్పందించడం, సందేశం ఎలా అర్థం అవుతుందో ఆలోచించకపోవడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను ఎంత త్వరగా అధిగమిస్తే, అంత మంచిది. సామాజిక పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనటానికి, వృత్తిపరమైన సంబంధాలను మెరుగుపరచటానికి, సరైన నిర్ణయాలు తీసుకోవటానికి, ఒత్తిడిని తట్టుకోవటానికి భావోద్వేగ నియంత్రణ సహాయపడుతుంది. ఇందుకుగాను, ముందుగా మిమ్మల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న విషయాలను గుర్తించాలి. వాటిని రాసుకొని, ఏ విధంగా ప్రభావం చూపుతున్నాయో అర్థం చేసుకోవాలి. తద్వారా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహాలను రూపొందించవచ్చు. ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకాన్ని కల్పించుకోవాలి లేదా యోగ వంటి భావోద్రేక నియంత్రణ విధానాలను అనుసరించాలి. ఇతరుల దృష్టికోణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రతిస్పందించే ముందు ఇతరు మాటలను శ్రద్ధగా వినండి. మాట్లాడే ముందు చిన్న విరామం తీసుకోవాలి. మీ భావోద్వేగాలను గుర్తించాలి. ఎదుటివారి స్థానంలో మీరు ఉన్నట్లుగా ఊహించుకుంటే, సహానుభూతిని పెంచుతుంది. అదనంగా, థెరపిస్టు లేదా కోచ్ సహాయంతో మీ భావోద్వేగ నియంత్రణ నైపుణ్యాలను మెరుగుపరచవచ్చు.

## ప్రతిభే గుర్తింపు..



వేసుకున్న బట్టలు.. చేసుకున్న షోకులు కాదు.. ప్రతిభతోనే మనిషికి గుర్తింపు వస్తుంది. గౌరవం లభిస్తుంది. ఈ విషయాన్ని గ్రిగోరి పెరెల్మాన్ నిరూపించాడు. అత్యంత సాదాసీదా జీవితం గడిపిన అతను చూడడానికి ఇల్లూవాకిలి లేని నిర్భాగ్యుడిగానో, మతి స్థిమితం కోల్పోయి ఒంటరిగా తిరుగుతున్న వ్యక్తిగానో కనిపిస్తాడు. కానీ, అసాధారణ గణితవేత్తగా ప్రపంచం ఈ రష్యన్ తాత్వికుడిని కీరిస్తున్నది 1966, జూన్ 13న జన్మించిన పెరెల్మాన్ జీవితం ఒక అద్భుత కావ్యం. గణితశాస్త్రంలో అతని విప్లవాత్మక కృషి, నిత్య జీవితంలో అనుసరిస్తున్న అత్యంత వినయమైన జీవనశైలి ప్రపంచానికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. చిన్నతనం నుండే అతనిలో గణిత ప్రతిభ కనిపించేది. 1982లో ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాన్ని సాధించినప్పుడు గణిత ప్రపంచం యావత్తు అతనివైపు సంభ్రమాశ్చర్యాలతో చూసింది. అతని పరిశోధనలు.. ప్రధానంగా రీమానియన్ జ్యామితి, జ్యామితిక విశ్లేషణ, టాపాలజీ రంగాల్లో సాగాయి. సుమారు శతాబ్దకాలంగా ప్రపంచ గణిత శాస్త్రానికి చిక్కుప్రశ్నగా మారిన 'పాయంకరే కాన్జెక్చర్'ను అతను 2002–2003 మధ్యంలో అతి తక్కువ పేజీల పరిశోధనా పత్రాలతో పరిష్కరించాడు. ఈ సమస్యను పరిష్కరించడంలో అతను రిచ్చీ ఫ్లో అనే కొత్త తాత్విక పద్ధతిని ఉపయోగించాడు. ఈ ఘనతకు గాను ఇతడికి 2006లో 'ఫీల్డ్స్ మెడల్' (గణిత శాస్త్రంలో నోబెల్ బహుమతి సమాన ప్రతిష్ఠ)తోపాటు క్లే మాథమెటిక్స్ సంస్థ నుండి 'మిలియన్ డాలర్ మిల్లెనియం పురస్కారం' సంపాదించిపెట్టింది. కానీ, ఇతడు ఆ అవార్డులను, డబ్బును నిరాకరించాడు. 'నా పరిశోధనా ఫలితాలు వాస్తవంగా ఉండటం చాలు, ధనఖ్యాతులు నాకు అవసరం లేదు. నేనొక ప్రదర్శన జంతువులా చేదుగా ప్రజల్లో ఉండాలి అనిపించడం లేదు' అనడమేకాదు.. ఆచరణలో చూపెడుతున్నాడు. పెరెల్మాన్ తన పరిశోధన విజయాన్ని ఇతర శాస్త్రవేత్తలతో సమానంగా పంచుకోవాలని భావించాడు. తనకు వచ్చిన బహుమతిని కూడా తిరస్కరించాడు. తక్కువగా మాటాడుతూ, నిరాడంబర జీవితం గడపడం తనకు ఎంతో ఇష్టమని అంటాడు పెరెల్మాన్. అతనికి స్నేహితులు లేరు.. శత్రువులు అసలే లేరు. అత్యంత సాధారణమైన జీవితాన్ని గడుపుతున్నాడు. కోరుకుంటే విలాసవంతమైన జీవితం అందుబాటులో ఉంటుంది కానీ, అతను ఎప్పుడు దానిని కోరుకోలేదు. కోణిజెక్చర్ పజిల్‌ను పరిష్కరించడం ద్వారా ప్రపంచ గణితశాస్త్ర చరిత్రలో అసాధారణమైన వ్యక్తిగా పేరు సంపాదించినప్పటికీ, ఒదిగిన విద్యా జీవితం, వినయం, నిజాయితీ, విజ్ఞానం వంటి లక్షణాలతో సామాన్యుడిలా కనిపించే అసమాన్యుడు పెరెల్మాన్.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# భూషయ్య సేవలు చిరస్మరణీయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని





ప్రజాపక్షం/ఏన్కూరు : మేడా భూషయ్య పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల భారత కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు, అమరజీవి మేడా భూషయ్య సంస్మరణ సభ సోమవారం ఏన్కూర్‌లో ఆయన స్వగృహంలో జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సంతాప సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ మేడా భూషయ్య ఏన్కూర్ గ్రామంలో సిపిఐని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. సర్పంచ్, ఎంపిటిసిలను గెలిపించడంలో ఆయన పాత్ర కీలకం అన్నారు. పార్టీకి గడ్డు పరిస్థితులు వచ్చిన పెద్ద దిక్కుగా ఉండి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ,స్రీత్త అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాన్నారు. సీనియర్ నాయకులుగా పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. వారికి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సంతాప సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపటి రమేశ్, జిల్లా నాయకులు తెప్పాల సత్యం, అమరజేని వీరభద్రమ్, చంద్ర నరేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, దొంతిబోయిన నాగేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు విజయబాయి, టిడిపి నాయకులు తాళ్లూరి అప్పారావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల వేతనం

ఎఐటియుసి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ : ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణకు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ల కాలపరిమితి ముగిసిందని, వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని, అపాయింట్మెంట్ లెటర్స్, ఐడి కార్డులు ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం డిసెంబర్ 2 నుంచి 4 వరకు ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 5న కోటిలోని మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి, కోశాధికారి నగేష్, కార్మికులు కృష్ణ, నీల, రాజయ్య, గంగన్న, కమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతకు రాజకీయ సైద్ధాంతిక శిక్షణ



సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి సురేష్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : యువతకు రాజకీయ సైద్ధాందిక శిక్షణ అవసరమని సిపిఐ ఖమ్మం జిల్లాకార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. యువతలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని ఆయన తెలిపారు. సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఖమ్మం నగర స్థాయి జన సేవా దళ్ శిక్షణా శిబిరం సోమవారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో ప్రారంభమైంది. శిక్షణను సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కలిగిన యువత పాలక వర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైతన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. నిరుద్యోగం పెరిగిన నేపథ్యంలో పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరుపుకుంటుందని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐదువేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తుమన్నారు. శారీరకంగా ధృడత్వం కలిగి ఉన్నప్పుడే మానసిక పరిపక్వత లభిస్తుందని శారీరక ధృడత్వం కలిగి సమాజ ఉన్నతికి కృషి చేయాలని ఆయన యువతను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, నగర నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, సైదా, మాలకొండయ్య, రావుల హన్మంతరావు, మాదుగుల నాగేశ్వరరావు, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడికి గుర్తింపుకార్డు తప్పనిసరి

తాండ్ర సదానందం



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రతీ కార్మికుడికి గుర్తింపు తప్పనిసరి అని ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు తాండ్ర సదానందం పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు తాండ్ర సదానందం, జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి భవన యజమానులకు, కార్మికులతో మాట్లాడారు. యూనియన్‌లో పనిచేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనియన్ గుర్తింపు కార్డు తీసుకోవాలని, ప్రతి నెలా సమావేశం నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని సదానందం స్పష్టం చేశారు. ప్రధానంగా, యూనియన్ నిర్ణయించిన ధరలకు మాత్రమే పనులు చేయాలని, ఆ ధరలను తగ్గించి పని చేయడంతో నాణ్యత లోపిస్తుందని ఆయన హెచ్చరించారు. ఇంటి యజమానులు తక్కువ రేటుకు పనిచేసేవారిని ఆశ్రయిస్తే భవిష్యత్తులో రిపేర్లకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, తక్కువ ధరలకు పని చేయించుకుంటే తలెత్తే సమస్యలకు యూనియన్ బాధ్యత వహించదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్రేతర మరియు ఇతర జిల్లాల నుంచి వస్తున్న కార్మికుల వల్ల నాణ్యత లోపాలు ఎదురవుతున్నందున, రాజరాజేశ్వర అసోసియేషన్ యొక్క యూనియన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఇంటి పనులు అప్పగించాలని భవన యజమానులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కల్లెపెల్లి మోహన్, సంయుక్త కార్యదర్శి దొమ్మటి రాజేష్, ఉపాధ్యక్షులు గడ్డం మధు, కోశాధికారి గడ్డం తిరుమల్, సహాయ కోశాధికారి లోకేష్ మీనా, ప్రచార కార్యదర్శి మిరియాల రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి సర్పంచ్ అభ్యర్థిగా యాదగిరి నామినేషన్



ప్రజాపక్షం/వేములపల్లి: వేములపల్లి సర్పంచ్ అభ్యర్థిగా సోమవారం సిపిఐ నాయకుడు జిల్లా యాదగిరి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వేములపల్లి సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తనను ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పలువురు పాల్గొన్నారు. కాగా మండలంలోని రెండవ దశ స్థానిక సంస్థల ఎన్నికలలో నామినేషన్‌లు రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. అన్నపురెడ్డిగూడెం బుగ్గ బాయ్ గూడెం వేములపల్లిలో సర్పంచ్ అభ్యర్థులు వార్డు మెంబర్లు పోటాపోటీగా నామినేషన్లను సమర్పించారు, ప్రధాన పార్టీల నాయకులకు టికెట్లు రాకపోవడంతో పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు.

# నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే

సిపిఐ రాష్ట సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు




ప్రజాపక్షం/రంగారెడ్డి: నిరంతరం నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పారీ ఒక్కటేనని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర సీనియర్ నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ఎఆర్ దేవరాజ్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో సిపిఐ రాజేంద్రనగర్ మండలంలోని పార్టీ శాఖను పునర్ నిర్మించడం జరిగింది. సమావేశం సయ్యద్ ఖాజా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పుస్తకాల నర్సింగ్‌రావు హాజరై మాట్లాడుతూ రాజేంద్ర నగర్ మండలంలోని అర్హులైన నిరుపేదల అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, కొత్తరేషన్ కార్డులను, కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఆయన అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జరిగే సిపిఐ శతజయంతి ముగింపు మహాసభకు పెద్ద ఎత్తున రాజేంద్రనగర్ మండలం నుంచి బయలుదేరి వెళ్లి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని గాంధీనగర్‌లో స్థానికంగా 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలకు కనీస సౌకర్యాలు లేవన్నారు. కరెంట్ మీటర్లు ఇవ్వడం లేదని, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, అన్ని సౌకర్యాలు కల్పించాలని వారికి పట్టాలు ఇవ్వాలని, పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కన్యగారి లక్ష్మి, మండల సహాయ కార్యదర్శి ఎండి షఫీ, మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సాబీర్, రామచందర్, కృష్ణ, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...** అనంతరం సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌డి సర్దార్, సహాయ కార్యదర్శిగా పర్వీన్ బేగం, శాఖ కౌన్సిల్ సభ్యులుగా మునీర్ ఉన్నిసా, మహ్మద్ అఖిల్, షకీల్ అమిత్, అలీషా బేగంను ఎన్నుకున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎన్నికల నేపథ్యంలో నలుగురు బైండోవర్

**ప్రజాపక్షం/ హాజీపూర్:**రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా నేర చరిత్ర కలిగిన నలుగురు వ్యక్తులను సోమవారం బైండోవర్ చేశారు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ ఆధ్వర్యంలో వీరిని మండల తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే సమక్షంలో హాజరుపరిచారు. సత్ప్రవర్తన కోసం ఏడాది కాలానికి వీరిని బైండోవర్ చేసినట్లు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా ఉంటుందని తెలిపారు. బైండోవర్ అయిన వారిలో హాజీపూర్ గ్రామానికి చెందిన మండి మల్లయ్య, వేంపల్లికి చెందిన కుంచం శ్రీనివాస్, నర్సింగాపూర్‌కు చెందిన గోనె సతీష్, పడ్తన్‌పల్లికి చెందిన సస్పెక్ట్ హిస్టరీ షీటర్ మడిపల్లి బుచ్చన్న ఉన్నారు.



## గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఐఎన్‌టియుసి సీనియర్ నేత జెట్టి శంకర్ రావు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:**శ్రీరాంపూర్ లోని గనులలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. సోమవారం యూనియన్ ప్రతినిధులతో కలిసి సివిల్ డిజిఎం ఆనంద్ కుమార్‌తో ఆయన చర్చలు జరిపారు. ఏరియాలోని ఆర్‌కె 5, ఎస్ఆర్‌పి 3, ఐకె 1ఎ, ఆర్‌కె 7 గనులలో కార్మికులకు రెస్ట్ షెల్టర్ షెడ్స్, టాయిలెట్లు అత్యవసర మరమ్మతులు చేయాలని, వాటిని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఐకె 1ఎ మైన్ లో టాయిలెట్లు దూరంగా ఉండటం వల్ల రాత్రి వేళల్లో ఇబ్బందులు కలుగుతున్నాయని, కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో రెస్ట్ హాల్స్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతులు కల్పించాలని, పిట్‌హెడ్ల వద్ద స్నానాల గదులు, లాకర్ల గదులకు మరమ్మతులు చేయాలని కోరారు. సమస్యలపై డిజిఎం సానుకూలంగా స్పందించారని, జిఎం పరిధిలోని పనులను వెంటనే పరిష్కరిస్తామని, కార్పొరేట్ పరిధిలోని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగ స్వామి, జీవన్ జోయల్ పాల్గొన్నారు

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: సిఐ



**ప్రజాపక్షం/ జైనూర్:**పంచాయతీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జైనూర్ సిఐ రమేష్ హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా సోమవారం జైనూర్ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ ఎస్ఐలు రామకృష్ణ, ఉల్లాస్, గంగన్న, మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది, తెలంగాణ ప్రత్యేక పోలీసుల బృందం పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీసు యాక్ట్ అమలు :ఎస్‌పి



**ప్రజాపక్షం/సంగారెడ్డి:**జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ తెలిపారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు అనగా డిసెంబర్ 1 నుండి 31 వరకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా ప్రజలు ప్రజా ప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్‌పి సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడతే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగ స్థానిక సంస్థకు సంబంధించి ఎన్నకల కోడ్ అమలులో ఉన్నందున ఇతర వ్యక్తులను ,రాజకీయ పార్టీలను ,కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినా సామాజిక మాద్యమాలలో పోస్టులు పెటిన చట్ట రీత్య కఠిన చర్యలు తప్పవని జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠనంగా అమలు చేయడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు.

## మార్కెట్ తరలింపు కోసం ధర్నా



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**వ్యాపార సంస్థలకు ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారిన కూరగాయల మార్కెట్‌ను తరలించాలని వ్యాపారులు, అఖిల పక్షం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. గత మూడు, నాలుగు నెలల నుండి మార్కెట్‌ను ఓల్డ్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు వినతులు చేసినా అధికారులు మార్కెట్ తరలింపులో నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నారు. కొందరు కూరగాయల వ్యాపారులు వ్యాపారస్తుల షాప్స్ ఎదుట వారి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఇబ్బంది చేస్తున్నారు. దాంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది చేస్తున్నారు. విసుగు చెందిన వ్యాపారులు అఖిలపక్షం సహకారంతో సోమవారం ఆందోళనకు దిగారు. మున్సిపల్ కమిషనర్ తీరును నిరసించారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సోమవరం సంతలో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన వారిని తహసీల్దార్ ఓపెన్ ప్లేస్‌కు తరలించారు. చిన్నచిన్న షాపుల వారు ఆందోళనకారుల వినతి మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి వెళ్లగా, మరి కొందరు అధికారుల ఆదేశాల మేరకు షాప్స్ తీసేందుకు అంగీకరించారు. తహసీల్దార్ షబ్బీర్, సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు సందీప్, రాము, అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అయ్యప్ప పడి పూజలో ఎమ్మెల్యే కోవలక్ష్మి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్‌టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని దూడేల అశోక్ నివాసంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప పడి పూజా మహోత్సవంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# లోటు పాట్లు లేకుండా నామినేషన్ల ప్రక్రియ



### కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ,నామినేషన్ కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు.నామినేషన్లు దాఖలు చేసే వారికి కుల ధ్రువపత్రాల జారి,బ్యాంకు ఖాతాలు తెరవడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అడిగారు.అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ,హెల్ప్ డెస్క్‌లో అందుబాటులో ఉంటూ,అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు.అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.క్లస్టర్‌లో ఇప్పటి వరకు దాఖలు అయిన సర్పంచ్,వార్డు సభ్యుల నామినేషన్‌ల వివరాలు వారి నుంచి అడిగి తెలుసుకున్నారు.నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా,ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు.నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు.రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు.ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో డిపిఓ శ్రీనివాస్,తహసీల్దార్ ప్ర భాకర్,ఎంపిడిఓగజానన్,ఎన్నికల అధికారులు,సిబ్బం ది,ఇతరఅధికారులు,సిబ్బంది,పాల్గొన్నారు.



**ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన**

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌డిఓకార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది.జెడ్‌పి కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ,అధికారులు ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ,కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు.వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. జిల్లాలో ప్రసూతి మరణాల తగ్గింపులో కింది స్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు.గతంలో ఉన్న ప్రసూతి మరణాల కేసులను అమలుతో,క్షేత్రస్థాయి సిబ్బంది చొరవతో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు చెప్పారు.ముమ్ముందు ప్రసూతి మరణాల రహిత జిల్లాగా నిర్మాణం తీర్చిదిద్దేలా మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు.ర్యాలీ సందర్భంగా కళాజాత బృందాలు ఉప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఎంహెచ్‌ఓ రాజేందర్,డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక,డిఇఓ భోజన్న, ఎఎన్‌ఎం,ఆశా కార్యకర్తలు,విద్యార్థులు,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే -65 అభివృద్ధి పనులు పూర్తి



**ప్రజాపక్షం /సంగారెడ్డి :**జిల్లాలో ఎన్‌హెచ్ 65 పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారి 65 (ఎన్.హెచ్65) విస్తరణ అభివృద్ధి పనుల పురోగతి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం జిల్లా కలెక్టరేట్ లోనిసమావేశ మందిరంలో నేషనల్ హైవే ఆథారిటీ విభాగం (ఎన్.హెచ్65) విద్యుత్ ,ట్రాపిక్, పోలీసు తదితర అనుబంద శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ .హెచ్ –65 పనులు జిల్లాలలో కీలకమైనవని, వివిధమైన జా ప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను ముందుగానే సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని ,ఆయా శాఖల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. హైవే పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైన్ డిపార్ట్మెంట్స్ అన్ని సమన్వయంతో పనిచేయాలని అదేశించారు. హైవే పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు ఈ సందర్భంగా చేపట్టిన పనుల పురోగతి పెండింగ్‌లో ఉన్న పనులు భూసేకరణ ,యేటీలిటీల మార్పిడి వంటి అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలకు సంబంధించి కలెక్టర్ సంబధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మాదురి, అడిషనల్ ఎస్‌పి రఘునందన్‌రావు ,నేషనల్ హైవే ఆథారిటీ ఎస్ఇ దర్మారెడ్డి ,ఇఇ రమేష్, ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ శాస్త్రీ సంగారెడ్డి, ఆర్‌డిఓ రాజేందర్ వక్స్‌బోర్డు దేవాదాయ విద్యుత్ ట్రాన్స్పోర్ తదితర విభాగాల అధికారులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు పాల్గొన్నారు.

## గ్లోబల్ సమ్మిట్ పై జూమ్ మీటింగ్

### ఎస్‌పి డా.జి.జానకి షర్మిల హాజరు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి,శాంతిభద్రతలు,పరిపాలనా సామర్థ్యం పెంపు,స్మార్ట్ గవర్నెన్స్ వంటి కీలక అంశాలపై దృష్టి సారించే లక్ష్యంతో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపిఎస్ ఆధ్వర్యంలో ఈ రోజు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 పేరిట ఒక ముఖ్యమైన జూమ్ సమావేశం నిర్వహించబడింది.ఈ ఉన్నత స్థాయి సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఐపిఎస్ అధికారులు,డిప్యూటేష న్ యూనిట్ల అధికారులు,చీఫ్ ఆఫీస్‌కు చెందిన స్టాఫ్ ఆఫీసర్లు హాజరయ్యారు.రాష్ట్ర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,అలాగే భవిష్యత్తు పట్టణ, గ్రా మీణ అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా పోలీసింగ్ విధానాలను మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. నిర్మల్ జిల్లా నుండి జిల్లా ఎస్‌పిడా.జి.జానకి షర్మి ల ఐపిఎస్ ఈ జూమ్ సమావేశానికి హాజరయ్యారు.జిల్లాలో తాము అమలు చేస్తున్న మంచి పద్ధతులు,భద్రతా చర్యలు,ప్రజలకు మెరుగైన సేవల విస్తరణ కోసం చేపడుతున్న వినూత్న విధానాల గురించి ఆమె వివరించారు.అదే సమయంలో,భవిష్యత్‌లో తెలంగాణను ఒక గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టే దిశగా పోలీస్ శాఖ పాత్ర,నూతన వ్యూహా లు, సాంకేతిక ఆధారిత సేవల విస్తరణ వంటి అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసి, స్మార్ట్,స్పందనాత్మక,పారదర్శక పోలీసింగ్ వైపు బలంగా అడుగులు వేయడానికి ఈ సమావేశం అత్యంతకీలకంగానిలిచిందనిజిల్లా ఎస్‌పితెలిపారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు






**ప్రజాపక్షం/నిజాంపేట్:**ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని కోడునుఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ నగేష్, డిఎస్‌పి నరేందర్ గౌడ్ అన్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఎంపిడిఓ కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభ్యర్థులు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ వద్ద సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఎన్నికల కోడును ఉల్లంఘిస్తే చట్టపర ంగాలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామాయంపేట సిఐ వెంకటరాజగౌడ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రాజేష్, ఎంపిడిఓ రాజీరెడ్డి తదితరులు ఉన్నారు.

## సజావుగా నామినేషన్ ప్రక్రియ నిర్వహణ

### అదనపు కలెక్టర్ నగేష్..



**ప్రజాపక్షం/రామాయంపేట:**మినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అదికారులకు సూచనలు చేశారు. సోమవారం రెండవ విడత పంచాయతి ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల రెండో రోజు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ ధరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్‌లను రోజువారిగా నోటీస్ బోర్డులపై ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను తూ.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూ డాలన్నారు. ఎలాంటి సందేహాలున్న అధికారులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఎంపిడిఓషాజిలోద్దీన్‌తో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్‌పి నరేందర్ గౌడ్‌లుపరిశీలించిభద్రతనుకట్టుదిట్టంచేయాలనిఆదేశించారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



### డిసెంబర్ 3న హైదరాబాద్‌లో మహా ధర్నా

### జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య ఆగ్రహం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో గత,ప్రస్తుత ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(టి.యు.డబ్ల్యూ.జెఐ.జె.యు) ఉద్యమ బాట పట్టిందన్నారు.సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 3వ తేదీన హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ వద్ద గల రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం ముందు మహా ధర్నాను విజయవంతం చేయాలని భూమయ్యఅన్నారు.స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయంలో కరపత్రం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు దాదాపు పన్నెండేళ్లుగా (పుష్కర కాలంగా)అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని,ప్రభుత్వాలు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమై,వారికి మొండిచేయి చూపించిందన్నారు.ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు''తమ ప్రభుత్వం ఏర్పడితే సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం'' అని గట్టి హామీ ఇచ్చినా,రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీలు ఆచరణకు నోచుకోలేదని,కేవలం మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతోందని తీవ్ర విమర్శలు చేశారు.ప్రభుత్వాలు కేవలం హామీలకు పరిమితం కావడాన్ని నిరసిస్తూనే ఈ మహా ధర్నాకు పిలుపునిచ్చామని స్పష్టం చేశారు.

ఈ ధర్నా ద్వారా జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరుతున్న ప్రధాన డిమాండ్లు వారి సంక్షేమానికి,అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి.ఉద్యోగులకు అందించే తరహాలో జర్నలిస్టులకు కూడా మెరుగైన హెల్త్ కార్డుల పంపిణీని చేపట్టాలి.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల కేటాయింపు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలి.ఈ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా నుండి జర్నలిస్టులందరూ భారీ సంఖ్యలో తరలి వచ్చి,ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని వెంక గారి భూమయ్య విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ మీడియా కన్వీనర్ టి.యోగేష్ కుమార్,జిల్లా సంయుక్త కార్యదర్శులు జల్దా మనోజ్,సట్ల హనుమాన్లు,సభ్యులు జహీర్ హైమద్,బి.భానుచందర్,డి.ఎస్. మధు,ప్రసాద్,నరేష్,లింగేశ్వర్,రాజేశ్వర్,ఇంతియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను పూర్తి: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**నగరపాలక సంస్థ పరిధిలో సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష జరిపారు. ఒక్కో జోన్ వారిగా మంజూరైన పనులపై ప్రస్తావిస్తూ ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయి ఏ మేరకు నిధులు ఖర్చు చేశారు. ఎక్కడెక్కడ సదుపాయాల పునరుద్ధరణ జరిగింది తదితర వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలోసిసి, బిటిరోడ్ల ప్యాచ్ వర్క్ పనులు, రోడ్ల నిర్మాణాలు ఇంకనూ ప్రారంభం కాకపోవటం పట్ల కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో పనులు చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో ఒప్పందం ఉన్నప్పటికీ పనులను ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనులు చేపట్టకపోతే అగ్రిమెంట్ రద్దు చేసుకుని సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. ప్రజలకు సౌకర్యాల కల్పన విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని కాంట్రాక్టర్లకు వత్తాసు పలికే ధోరణిని అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాప్యానికి తావు లేకుండా ఆయా విభాగాల వారిగా పనులను విభజించుకుని, ఏకకాలంలో జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గడువులోపు పనులన్ని పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ఏ చిన్న పని కూడా పెండింగ్‌లో ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, తదుపరి సమీక్ష జరిపే సమయానికి అన్ని పనులు ప్రారంభమై స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ సహాయ రవీంద్రసాగర్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కబ్జా,అక్రమ నిర్మాణంపై ఆర్‌టిసి కండక్టర్ నిరసన!



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**కడం మండలంలోని పెత్తరపుగ్రామ నివాసి,ఆర్‌టిసి కండక్టర్ అయిన జాడి రాజన్న..తన స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ,ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం రోజు కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.గత మూడు నెలలుగా నచ్చనిల్లాపూర్ తండాకు చెందిన అజ్మీరా శేఖర్ తన స్థలాన్ని కబ్జా చేసి బిల్డింగ్ నిర్మాణం చేస్తున్నాడని,ఈ విషయంపై అధికారులకు అనేకసార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ,వారు బిల్డింగ్ నిర్మాణాన్ని ఆపకుండా కాలయాపన చేయడాన్ని జాడి రాజన్న తీవ్రంగా వ్యతిరేకించారు.తక్షణమే తన స్థలం లో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని ఆపాలని, తన భూమిని తనకు తిరి గి ఇప్పించాలని కోరతూ ఆయన కలెక్టర్‌ను వేడుకున్నారు.నిరసనఅనంతర ంఆయ నతన దరఖాస్తు నుకలెక్టర్‌కార్యాలయంఇ న్వార్డ్‌లోసమర్పించారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## జీవితానికి సైన్స్ ఉపయోగపడాలి

జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య

**ప్రజాపక్షం/ కరీంనగర్:** సైన్స్ అనేది మానవ జీవితానికి ఉపయోగపడాలి తప్ప వినాశనానికి కాదని, నూతన ఆవిష్కరణలు మానవ వికాసానికి దారి తీయాలని జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్లో మూడు రోజులుగా జరిగిన బాల వైజ్ఞానిక ప్రదర్శిని సోమవారం ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకలో డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తను వెలికితీయాలని సూచించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఐఐటి, నీట్ కాకుండా పరిశోధనల వైపు మొగ్గు చూపాలని, ఐఐఎస్సి, ఐసిఐఆర్ వంటి సంస్థల్లో చేరి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని కోరారు. మూడు రోజుల్లో దాదాపు 176 పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించారని పేర్కొన్నారు.

# అన్ని రంగాలలో అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్/ప్రజాపక్షం:** ముఖ్య మంత్రి రేవంతు రెడ్డి అధ్వర్యంలో కాంగ్రేస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టి రెండు ఏళ్లు గడుస్తున్నసందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు హుస్నాబాద్‌కు వస్తున్నారని ముఖ్య మంత్రి పర్యాటనతో హుస్నాబాద్ రూపురేఖలు మారిపోతాయయని తెలంగాణ బిసి మరియు రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం అయన హుస్నాబాద్ పట్టణంలో ఏనే సమీపంలో అమరుల స్తూపం ప్రాంగణలో నిర్వహించనున్న సభ వేదికను అధికారులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై సమవేశానికి వచ్చె వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండ, రోడ్డలపై వాహనాల పార్కింగ్ నీటి వసతులు శాంతి భద్రత తదితర అంశలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నిక కోడ్ ఉన్నందున మేము కోడ్‌ను దుర్వినియోగం చేయడంలేదని గతంలో మంజూరు అయిన అభివృద్ధి పనులకు మాత్రమే శంకుస్తాపని చేస్తున్నామని తెలిపారు. కోడ్ లేక పోతే గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాశితులకు పరిహారం చెక్కులను పంచేవాళ్లమని కోడు అయిపోయిన తరువాత వారికి పరిహారం చెక్కులను ఇస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రన్ని అభివృద్ధి చేయడానికి కోర్‌అర్బంన్, రీజియన్, సేమీఅర్బన్‌రీజియన్ , రూరల్ ఏరియా లు విభజించి ప్రత్యేక ప్రణాళికబద్దంగా ముందుకు పోతున్నమని తెలంగాణను ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దవిధంగా అనేక ప్రణాళికలను రచిస్తున్నమని తెలిపారు. నేడు కేంద్రలో బిజెపి ప్రభుత్వాం కాంగ్రేస్ జాతీయ నాయకులైన రాహుల్‌గాందీ, సోనియాగాంధీగారిపై అక్రమ కేసులు పెట్టి పార్లమెంటులో ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపిస్తారేమోన్ని పలు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందని కాంగ్రేస్ పార్టీకి కొతేమి కాదని అన్నారు. రాహుల్ గాంధీపై పెట్టిన కేసుల పట్ల తీవ్రంగా ఖండిస్తున్నమని అన్నారు. హైద్రాబాదుకు సకల సౌకర్యాలు కల్పించి స్వచ్ఛమైన వాతవరణం కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. గతంలోచంద్రబాబు విజన్ 20 20 విజన్‌తో ముందుకు పోయారు, కెసీ అర్ బంగారుతెలంగాణపేరుతో ముందుకు పోతే మేము విజన్ 2047తో ముందుకు పోతున్నమని పేర్కోన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, అర్‌డివో రాంమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్, మున్సిపల్ కమీషనర్, మల్లికార్జున్, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు , చిత్తారి పద్మ, చిత్తారి రవిందర్, తదితరులు పాల్గోన్నారు.

## ఎయిడ్స్ పై విస్తృత అవగాహన



**ప్రజాపక్షం/కరీంనగర్ :** హెచ్ఐవి వ్యాధి నివారణకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, వ్యాధి తగ్గుముఖం పడుతున్నప్పటికీ కేసులు జీరోకు వచ్చేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని కరీంనగర్ లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ పమేల సత్పతితో కలిసి ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ రోడ్డులోని ఫిలిం భవన్ వరకు కొనసాగింది. అనంతరం ఫిలిం భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో హెచ్ఐవి వ్యాధి రోజురోజుకు తగ్గుముఖం పడుతోందని తెలిపారు. వ్యాధి సోకిన వారు ధైర్యంగా ఉంటూ ఎప్పటికప్పుడు మందులు వాడుతూ ఉండాలని సూచించారు. హెచ్ఐవి పట్ల అవగాహన పెంచి అపోహలను తొలగించాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ మాట్లాడుతూ హెచ్ఐవి నివారణకు టీకా తయారు చేసేందుకు పరిశోధనలు జరుగుతున్నాయని, త్వరలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అన్నారు. అనంతరం విశిష్ట సేవలందించిన ఐసిటిసి కౌన్సిలర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపన్యాస పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ, డిటిసిఓ డాక్టర్ రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సాజిద, డాక్టర్ రాజగోపాల్ రావు, డాక్టర్ సన జవేరియా, డెమో రాజగోపాల్, డిపిఓ ఎన్ హెచ్ ఎం స్వామి, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి నరేందర్, పలు ఎన్జీవో సంఘాల ప్రతినిధులు, ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ అధ్యక్షులు, విద్యార్థులు, కౌన్సిలర్లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకొని మహమ్మారిని తరిమి కొట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. సోమవారం వరల్డ్ ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా ఏరియా ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రక్షణ లేకుండా శరీరక సంబంధం ద్వారా ఎయిడ్స్ వ్యాధి వ్యాపిస్తుందని, హెచ్ఐవికి మందు లేదని, వ్యాధి సోకిన వారు ఆందోళన చెందకుండా ఆర్ట్ కేంద్రాల ద్వారా మందులు వాడితే ఎక్కువ సంవత్సరాలు జీవించగలరని వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. సురక్షితమైన జీవనశైలితో ఎయిడ్స్ నివారించవచ్చన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఏప్రిల్ 25 నుండి నవంబర్ 25 వరకు 2521 మంది గర్భిణీ స్త్రీలను పరీక్షలు చేయగా1 పాజిటివ్, అనుమానిత హెచ్ఐవి 4118 కేసులో పరీక్షలు చేయగా26 మందికి పాజిటివ్ వచ్చిందని తెలిపారు. గ్రామాలలో ఎన్జీవోలు, గ్రామ మహిళా సమైక్య సభ్యులు, లింక్ వర్కర్ల ద్వారా ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన కల్పించి ఎయిడ్స్ వ్యాధిని అరికట్టటకు కృషి చేయాలని అన్నారు. సరైన సమయంలో చికిత్స ఆరంభిస్తే జీవిత కాలం పెంచే అవకాశం ఉందన్నారు. ఉత్తమ సేవలు అందించిన వారికి మేమేంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రెసిడెంట్ చింతోజు భాస్కర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, ఏవో శ్రీనివాస్, దేవి సింగ్, రాజకుమార్, గవర్నమెంట్ హాస్పిటల్ ఎయిడ్స్ కౌన్సిలర్ గంగయ్య, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందొద్దు: ఎస్‌పి




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరికి గురైన 28 లక్షల విలువగల 136 మొబైల్ ఫోన్లను బాధితులకు సోమవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అందజేశారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సిఇఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరి గురైన 28 లక్షల విలువగల 136 సెల్ ఫోన్లలను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. సెల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందవద్దు : ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సిఇఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. సిఇఐఆర్ వెబ్ సైట్ లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 3.5 కోట్ల విలువగల 1548 ఫోన్లలను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సెల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని, సిఇఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ సిఇఐఆర్ టీం ఆర్.ఎస్.ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ లు,అజర్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. సాంకేతిక ఉపయోగించి పోయిన సెల్ఫోన్లను తిరిగి కనిపెట్టి తమకు ఇచ్చినందుకు బాధితులు ఎస్పీ కి ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపిఒకు షోకాజ్ నోటీసు జారీ

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపిఒకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. జగదేవ్‌పూర్ మండల పంచాయతీ అధికారి ఖా జమోహినొద్దిన్ ఎన్నికల సంబంధించిన వివరాలను సహాయ రీటర్నింగ్ అధికారితో పాటు జిల్లా అధికారులకు సరైన సమాచారం పంపనందున ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## బాధితులకు రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయాలని సిఎంకు వినతి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు లో శని వారం జరిగిన అగ్ని ప్రమాధం తో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా కల్పించారు. సోమవారం తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మ ణ్ కుమార్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సెక్రటేరియట్లో కలిసి కొండగట్టు అగ్ని ప్రమాద ఘటనను ముఖ్యమంత్రికి వివరించారు. అర్ధరాత్రి మంటలు అంటుకొని దుకాణాలు కాలిపోయాయని, దుకాణాలను నమ్ముకొని జీవిస్తున్న వారు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారని ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వివరించారు. ప్రభుత్వం తరపున అగ్ని ప్రమాద బాధితులకు రూ. 5 లక్షల పరిహారం మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు. పరిహారం అందజేయడానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అగ్ని ప్రమాద నివేదికను తయారుచేసి పంపించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పరిహారం మంజూర చేయాలని కోరగానే సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# 4హౌస్‌ల విభజనతో విద్యార్థులకు మేలు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పాఠశాలల్లోని విద్యార్థులను 4 హౌస్‌ల కింద విభజించడంతో వారికి మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం పెద్దపల్లి పట్టణంల విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా గ్రంథాలయం, పురపాలక భవనం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. మున్సిపల్ ఆఫీసులో పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సంస్థల్లో పిల్లలను 4 హౌసెస్ గా విభజించామని, రెడ్ హౌస్‌కు అబ్దుల్ కలాం పేరు, గ్రీన్ హౌస్‌కు శకుంతల దేవి, బ్లూ హౌస్‌కు సి.వి.రామన్, యేల్లో హౌస్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు పెట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పిల్లలు వ్యక్తిత్వ వికాసం పెంచేందుకు, నాయకత్వ లక్షణాలు ఇంప్రూవ్ చేసేందుకు ఈ హౌస్ ల మధ్య వ్యాసరచన పోటీలు, క్విజ్ కాంపిటీషన్, క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ పాఠకులకు అవసరమైన వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పాఠకులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణ పరిధిలో టియూఎఫ్ఐడిసి క్రింద మంజూరై పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో పాత నీటి ట్యాంకరు కూలుస్తున్న విషయం ప్రజలకు తెలియజేయాలని, నూతన వాటర్ టాంకర్ నిర్మించే వరకు త్రాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మార్చి 31 నాటికి పెద్దపల్లి పట్టణంలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్, నీటి పన్ను, ఇతర పన్నుల సేకరణ నిర్దేశిత లక్ష్యం ప్రకారం 100% వసూలు చేయాలని అన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, బహిరంగ ప్రదేశాలు చెత్త వేస్తే భారీ జరిమానాలు విధించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ గంగయ్య, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎం ఈ.ఓ. సురేందర్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** రెండవ విడత సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జగిత్యాల మండలంలోని మోతె, నర్సింగాపూర్ గ్రామంలోని సర్పంచి ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ల ప్రక్రియను అక్కడ అధికారులతో అడిగి తెలుసుకుని నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధి నిబంధనలను అమలు చేయాలని నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా వ్యక్తులను పంపవద్దని సీఐ సుధాకర్ అన్నారు. వారి వెంట ఎస్.ఐ ఉమాసాగర్, సిబ్బంది, తదితరులున్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నుస్తులాపూర్, రామకృష్ణ కాలనీ, ఇందిరానగర్ పంచాయతీలకు, కొత్తపల్లి గ్రామపంచాయతీలో కొత్తపల్లి, రేణిగుంట పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాలను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజువారీగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల వివరాలు పత్రాలలో పూర్తిగా నమోదు చేసేందుకు హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని తెలిపారు. ప్రతి చిన్న అంశాన్ని అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో అభ్యర్థులకు వివరించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** 2వ సాధరణ గ్రామపంచాయతీ ఎనికల 2025 ప్రక్రియలో భాగంగా సోమవారం నంగునూరు మండలం పాలమాకుల, బద్దిపడగ క్లస్టర్లలో రెండోవిడుత నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పాలమాకుల క్లస్టర్‌లో పాలమాకుల, రాజ్‌గోపాల్‌పేట. ముండ్రాయి, జెపి తండా, దర్గాపల్లి గ్రామాల నామినేషన్‌లు స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల రెండవ దశలో 10మండలాలు అక్బర్‌పేట భూంపల్లి, తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూర్, చిన్నకోడురు, నారాయణరావుపేట. బెజ్జంకి మండలాల్లో ఈనెల 2వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు 58 క్లస్టర్లలో 182 గ్రామపంచాయతీలు, 1644 వార్డులకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం క్లస్టర్ నామిని అభ్యర్థులు సహాయార్థం హెల్ప్‌డెస్క్. ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 ఆర్‌ఓలు నామిని అభ్యర్థులు అప్లికేషన్లు క్షుణ్ణంగా పరిశీలించి తర్వాతనే స్లిప్ అందచేయాలన్నారు. ప్రతి రోజు నామిని పత్రాలను టిపోల్ యాప్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. క్లస్టర్ చుట్టు 100 మీటర్ల పరిధిలో నామిని అభ్యర్థులతో పాటు ఇద్దరిని మాత్రమే లోనికి అనుమతించాలని, 144 సెక్షన్ అమలులో గట్టి బందోబస్తును నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## ఎన్నికల వేళ శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు: ఎసిపి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఎసిపి నరసింహులు హెచ్చరించారు. సోమవారం జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ట్రబుల్ మాంగర్స్, సస్పెక్ట్స్‌లతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అక్రమాలు, వివాదాలు, ఘర్షణలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే నేర చరిత కలిగి ఉన్న వ్యక్తులను స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేయాలని ఎస్ఐని ఆదేశించారు. అలాగే గ్రామాలలో ఉద్రిక్తతలు తలేత్తకుండా పోలీసులు ప్రత్యేక చోరవ చూపాలని సూచించారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలైన తిగుల్ , జగదేవ్‌పూర్ గ్రామాలలో ఎసిపి ఆధ్వర్యంలో పోలీసులు సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఇసి నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహణ

ఇన్‌చార్జి కలెక్టర్, గరిమ అగర్వాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఇసి) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు(ఆర్ఓ)లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వివిధ అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ తో కలిసి శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్ మాట్లాడారు. ఎస్ ఈ సీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఆర్ ఓ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోనేలా పీఓ లు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ షరీపుద్దిన్, నోడల్ అధికారి భారతి, ట్రైనర్లు పాల్గొన్నారు.

**స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ప్రశంసా పత్రాలు**

జిల్లాలోని స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ఎంపికైన హెచ్ఎంలు, బాధ్యులకు ఇన్‌చారి కలెక్టర్ గరిమ అగర్వాల్ ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల కోసం సర్వే నిర్వహించగా, జిల్లాలోని 650 స్కూల్స్ సర్వేలో పాల్గొన్నాయి. ఇందులో నుంచి అత్యధిక స్కోర్ పొందిన 8 పాఠశాలలు ఎంపిక అయ్యాయి.

**కేటగిరి 1 (1 నుంచి 8వ తరగతి వరకు)** ఎంపీపీఎస్ నేరేళ్ల, యూ పీ ఎస్ శ్రీ వాణి పోతుగల్, ఎంపీపీఎస్ మర్రిగడ్డ, ఎంపీపీఎస్ సిరిసిల్ల నెహ్రూ నగర్, కేటగిరి 2 కింద (9 నుంచి 12వ తరగతి వరకు) జడ్పీ హై స్కూల్ జిల్లెల్ల, జడ్పీ హై స్కూల్ వెల్జిపూర్, కేజీబీవీ ముస్తాబాద్, వివేకానంద హైస్కూల్ వేములవాడ ఎంపికకాగా, ఆయా విద్యా సంస్థల హెచ్ఎంలు, బాధ్యులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించి, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ ప్రశంసా పత్రాలు అందజేసి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, అధికారి సతీష్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి: ఎస్‌పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆర్జిదారుల నుండి 27 ఫిర్యాదులు స్వీకరించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు.

**జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# రీల్

## 'పిల్లా ఇట్టసూడవే తొంగి నన్ను చూడవే' పాట ఆవిష్కరణ



ఓ అబ్బాయి అమ్మాయిని ప్రేమించటం కష్టం కాకపోవచ్చు.. కానీ ఆ అమ్మాయి నుంచి ప్రేమ సిగ్నల్ అందుకోవాలంటే మాత్రం నానా తిప్పలు పడాల్సిందే. ఐ లవ్ యు చెప్పిన తర్వాత ప్రేయసి ఏమంటుందోనని పడే టెన్షన్ మామూలుగా ఉండదు. ఇలాంటి సమయంలో ప్రేమికుడికి ప్రేయసి ఓకే చెప్పేస్తే.. ఎలా ఉంటుంది.. అతని మనసు ఎలా ఊయల ఊగుతుంది. ఇద్దరు కలిసి ఎవరికీ తెలియకుండా కళ్లతో మాట్లాడుకునే మాటలు, సైగలు చూడచక్కగా ఉంటాయి. ఇదే పాటను ఇప్పుడు ఆవిష్కరించారు. 'దండోరా కొట్టు కుందురో.. గుండెల్లో కొత్తగుందిరో నింగి నేల ఇలా.. దారి కుదిరిందెలా కళ్లారా చూడబోతినో.. కల్లోలం లాగ ఉంటదే దాగి దాగి అలా దగ్గరైపోయావే ఇలా పిల్లా ఇట్టసూడవే.. తొంగి నన్ను చూడవే..' అంటూ సాగే ఈ పాట మనసుల్ని హత్తుకుంటోంది. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న సినిమాలోని ఈ పాటను అదితి భావ రాజు, అనురాగ్ కులకర్ణి పాడిన ఈ పాటను పూర్ణాచారి రాశారు. దండోరా సినిమాలో ప్రేమికుల మనసుల్లో దాగిన భావాలను అందంగా ఆవిష్కరించిన పాట ఇది.

# మోహన్‌బాబు 50 వసంతాల వేడుక

### అతిథిగా హాజరైన రజనీకాంత్



ప్రముఖ నటుడు, నిర్మాత డాక్టర్ ఎం.మోహన్ బాబు తన 50 ఏళ్ల సినీ ప్రయాణానికి సంబంధించిన కార్యక్రమంలో భారతీయ సినిమా, రాజకీయ ప్రముఖుల్ని ఒకే వేదికపైకి తీసుకు వచ్చారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్లో జరిగిన ఈ వేడుకలో తారలంతా సందడి చేశారు. ఈ కార్యక్రమానికి రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఎందరో రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుంచి బ్రహ్మానందం, హరీష్ శంకర్, టీజీ విశ్వ ప్రసాద్, అల్లు అరవింద్, దిల్ రాజు, మైత్రి శశి, జయసుధ,నాని, నాజర్, ఆది సాయి కుమార్, సందీప్ కిషన్, వీకే నరేష్, గోపీచంద్, శ్రీకాంత్, శ్రీను వైట్ల, శ్రీకాంత్ ఓదెల వంటి వారు ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ఆయన చాలా కేరింగ్ పర్సన్

### - హర్షాలి మల్హోత్రా



భజరంగి భాయిజాన్ హిందీలో వచ్చిన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన ఈ సినిమాలో ఒక చిన్న పిల్ల మూగా అమ్మాయిగా నటించింది. ఆ అమ్మాయి పేరు హర్షాలీ మల్హోత్రా. ఇప్పుడు ఈమె తెలుగు తెరపై కనిపిస్తోంది. నందమూరి బాలకృష్ణ హీరోగా వస్తున్న 'అఖండ –2' సినిమాలో హర్షాలీ జనని అనే కీలమైన పాత్రలో నటించింది. 'అఖండ –2' డిసెంబర్ 5న విడుదల అవుతున్న సందర్భంగా హర్షాలీ మల్హోత్రా మీడియాతో చిట్ చాట్ నిర్వహించింది. బజరంగీ భాయిజాన్ తర్వాత చాలా పాత్రలు వచ్చాయి. అయితే నేను ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూశాను. అలాంటి సమయంలో అఖండ2 అవకాశం వచ్చింది. లెజెండరీ నందమూరి బాలకృష్ణతో నటించడం ఒక గొప్ప అవకాశం. నేను ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూశాను. దాదాపు పదేళ్ళు తర్వాత మళ్లీ నేను థియేటర్స్‌కి వస్తున్నాను. ఈ చిత్రంలో జనని అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను చాలా స్వీట్, కేరింగ్. తనకి అఖండ బ్లెస్సింగ్స్ ఉంటాయి. జనని లైఫ్ ఎప్పుడు డేంజర్‌లో ఉన్న అఖండ తనకోసం వస్తారు. బాలకృష్ణ సినిమాలో సెలక్ట్ అయ్యాక నేను ఆయన సినిమాలు కొన్ని చూశాను. భగవత్ కేసరి, వీరసింహారెడ్డి, డాకు మహారాజ్, అఖండ సినిమాలు చూశాను. బాలకృష్ణ వెరీ కూల్. ఒక లెజెండరీ యాక్టర్‌తో కలిసి నటించడం అంటే మొదట చాలా నెర్వస్ ఫీల్ అయ్యాను. అయితే ఆయన చాలా కేరింగ్ పర్సన్. నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఒక ఫ్యామిలీ మెంబర్ లాగానే చూసుకున్నారు. అఖండ షూటింగ్ మైనస్ డిగ్రీస్ ఉన్న కొన్ని లొకేషన్స్ లో చేశాం. అంత చలి ప్రదేశాలలో షూటింగ్ వెరీ చాలెంజింగ్. అలాగే ఈ సినిమాలో యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను. బజరంగీ భాయిజాన్ తర్వాత వచ్చిన గ్యాప్‌లో స్టడీస్‌పై ఫోకస్ చేశాను. అలాగే కథక్ నేర్చుకున్నాను. ఒక మంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఈ సినిమా వచ్చింది. 'అఖండ –2' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి రావడం చాలా ఆనందంగా ఉంది. నా రెండో సినిమానే తెలుగు సినిమా కావడం, ఒక లెజెండరీ యాక్టర్‌తో నటించడం అద్భుతమైన అనుభూతి. బోయపాటి ఎంతో కేర్ తీసుకున్నారు. షూటింగ్ చేస్తున్నప్పుడు నెర్వస్‌గా ఫీల్ అయితే నువ్వు తప్పకుండా చేయగలవని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత అద్భుతంగా చేసావని అభినందించేవారు. ఆయన ప్రోత్సాహం నాలో మరింత ఎనర్జీని నింపింది. జననీ పాత్ర కోసం బోయపాటి నన్ను ఎంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సల్మాన్ ఖాన్‌తో చాలా అందమైన జ్ఞాపకాలు ఉన్నాయి. మేం టేం టెన్నిస్ ఆడేవాళ్ళం. చాలా సరదాగా ఉండేది. అలాగే బాలయ్య తో కూడా చాలా మంచి ఫన్ మూమెంట్స్ ఉన్నాయి .ఆయన షూటింగ్ ఎనర్జీ కోసం కషాయం తాగమని చెప్పేవారు. కానీ నాకు అల్లం అంటే ఇష్టం ఉండదు. ఆయన ఒక ఫ్యామిలీ మెంబర్ లానే చూసుకున్నారు.తెలుగులో మీకు ఇష్టమైన స్టార్స్ బాలయ్య, అల్లు అర్జున్, ప్రభాస్. నాకు సంజయ్ లీలా బన్సాలీ సినిమాలో చేయాలని ఉంది. ఆయన హీరోయిన్స్‌ని చూపించే విధానం చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే నాకు అన్ని రకాల జానర్స్ చేయాలనీ వుంది. మంచి కాంబినేషన్స్‌లో మెయిన్ లీడ్‌గా చేయాలని ఉంది. అలాగే ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేయాలని ఉంది.

## సమంత పెళ్లి



తెలుగు సినిమా హీరోయిన్ సమంత మరో పెళ్లి చేసుకుంది. తన స్నేహితుడు రాజ్ నిడిమోరుతో సోమవారం వివాహం జరిగింది. కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్ వేదికగా వీరిద్దరూ ఒకటయ్యారు. ఈ వివాహం జరిగిన ఫోటోలను సమంతకు సంబంధించిన పిఆర్ వంశీకాక మీడియాకు విడుదల చేశారు. సమంతకు ఇది రెండో వివాహం. హీరో నాగార్జున కుమారుడు అక్కినేని నాగ చైతన్యను సమంత మొదట వివాహం చేసుకున్నారు. కొంతకాలం తరువాత నాగ చైతన్య, సమంత విడాకులు తీసుకున్నారు. ఏడాది క్రితం నాగ చైతన్య కూడా రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు సమంత కూడా రెండో వివాహం చేసుకుంది. ఈ కొత్త దంపతులు జీవితాంతం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సోషల్ మీడియాలో అందరూ ఆశీర్వదిస్తున్నారు.



## తెలుగు టెలివిజన్ రచయితల సంఘం

### అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి గణపతి రావు

రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి గణపతి రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి శశాంక, కోశాధికారిగా వై.నరేంద్ర కుమార్, ఎగ్జి క్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బివి రామరావు, జాయింట్ సెక్రెటరీగా ఎం.ఫణి కుమార్ ఎన్నికైయ్యారు. ఫిలిం ఛాంబర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల స్వర్గస్తులైన రచయిత అందెశ్రీకు రెండు నిముషాలు మౌనం పాటించి ఘనంగా నివాళ్లర్పించారు. దర్శకులు శివ నాగేశ్వర్ రావు, నటుడు కాదంబరి కిరణ్ కూడా ఈ ఎన్నికలకు హాజరైయ్యారు.

## 5 నుంచి 'అవతార్' అడ్వాన్స్ బుకింగ్ షురూ




ప్రపంచ సినిమా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న విజువల్ వండర్ హాలీవుడ్ సినిమా 'అవతార్'. ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో ఈనెల 5వ తేదీ నుంచి అడ్వాన్స్ బుకింగ్ షురూ చేస్తున్నారు. ఐమాక్స్ ఫార్మాట్ లో వస్తున్న ఈ సినిమా కోసం దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ఐమ్యాక్స్ థియేటర్లలో అవతార్ థీమ్‌తో డిజైన్ చేసిన బాక్స్ ఆఫీస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. బుకింగ్ ప్రారంభమైన క్షణం నుంచే ఫ్యాన్స్ కు ఫోటో సెటప్లు, థీమ్లతో ప్రాంగణంతో అద్భుతంగా మారబోతోంది. మొదటిసారిగా ఈ ఫ్రాంచైజీ డాల్బీ విజన్ సినీ అనుభవంలో కూడా అందుబాటులోకి రాబోతుంది. జేమ్స్ కామెరన్ సృష్టించిన ఈ మహత్తర 'అవతార్: ఫైర్ అండ్ ఆష్'ను 20th సెంచరీ స్టూడియోస్ డిసెంబర్ 19న ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనుంది.

## యుఫోరియా టీజర్ రిలీజ్

తమిళ నటుడు, దర్శకుడు గౌతమ్ మీనన్, నటి భూమిక చావ్లా ప్రధాన పాత్రలో దర్శకుడు గుణ శేఖర్ తెరకెక్కిస్తున్న సినిమా యుఫోరియా. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. డ్రగ్స్, మాఫియా, యూత్ ఎంటర్టైన్మెంట్స్ ప్రధాన అంశంగా రూపొందిస్తున్న సినిమా ఇది. రాజశేఖర్, సారా అర్జున్, ఆదర్స్ బాలకృష్ణ, నాజర్, కేశవ్ దీపక్, కల్పలత, నారా రోహిత్, లిఖిత నాయుడు, సాయి శ్రీనిక రెడ్డి, నవీన రెడ్డి తదితరులు నటిస్తున్నారు. నీలిమ గుణ, యుక్త గుణ నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాను ఫిబ్రవరి 6వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.






## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు

# పటిష్ఠ ఏర్పాట్లు

### సంబంధిత అధికారులతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ట ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి సోమవారం సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ సమిక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో పలువురు ప్రముఖులతో పాటు దేశ, విదేశీ అతిథులు పాల్గొననున్నారని వారికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయాలన్నారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి ప్రత్యేకంగా ప్రజా భవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్వహించే ఈ అతిపెద్ద సమ్మిట్‌లో రాష్ట్రానికి సంబంధించి అన్నిశాఖలు తమ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ప్రధానంగా ప్లీనరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వన్ టు వన్ సమావేశాలు, వివిధ సంస్థలతో ఎంఓయూలే ప్రధాన అంశాలుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 13 వరకు కొనసాగనున్న ఈ సమ్మిట్ ఉప్పల్ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్‌తో ముగుస్తుందని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సబ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయాలపై బిజెపి గుడ్డి జపం

### మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే బిజెపి పనిగా పెట్టుకుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 2022లో బిఆర్ఎస్ ప్రభుత్వం లీజ్ ల్యాండ్‌ను ఫ్రీ హోల్డ్ చేస్తే బిజెపి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఇది బిజెపి, బిఆర్ఎస్ కలసి ఆడుతున్న నాటకం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాలుష్యం పెరిగి పాఠశాలలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనేదే ప్రజా ప్రభుత్వ ప్రయత్నం అని అన్నారు. ఢిల్లీ కాలుష్య పరిస్థితి హైదరాబాద్‌లో రావాలని బిజెపి, బిఆర్ఎస్ కోరుకుంటున్నాయన్నారు. హిల్ట్ పాలసీ జీవో సొంత భూములపై కన్జర్వేషన్ ఫీజు విధించాం, ప్రభుత్వ భూములను దారాదత్తం చేసిందే బిఆర్ఎస్..యెదేచ్ఛగా టైటిల్ మార్చారన్నారు. నిరుపయోగంగా ఉన్న పరిశ్రమల భూములను ఉపయోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీకి సంబంధించిన వంద ఎకరాల ల్యాండ్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం కన్జర్వేషన్ చేసింది. అప్పుడు బిఆర్ఎస్ కు నిబంధనలు గుర్తుకురాలేదా అని అన్నారు. బిఆర్ఎస్ తెచ్చిన గ్రిడ్ పాలసీలో 30శాతం ఎస్ఆర్ఒ పెడితే పరిశ్రమలు ముందుకు రాలేదు.. అందుకే మేము ఒక అడుగు ముందుకు వేసి ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ అలసత్వం వల్లే హైదరాబాద్ పరిసరాల్లో కాలుష్యకారక పరిశ్రమలు పెరిగాయన్నారు. లీజ్ ల్యాండ్‌లను ఫ్రీ హోల్డ్ చేసేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం జీవో తెచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు... ఇండస్ట్రీల వద్ద ఉన్న భూముల గురించే పాలసీ రూపొందించామన్నారు. మా ప్రభుత్వం తెచ్చిన పాలసీపై నాచారం ఇండస్ట్రీయల్ అసోసియేషన్ మద్దతు తెలిపిందని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే అడ్డుకుంటరు. కాలుష్యకారక పరిశ్రమలు తరలిస్తామంటే అడ్డుకుంటరు ఇదేక్కడి న్యాయమని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండస్ట్రీ భూముల కన్వర్షన్‌పై విచారణ జరుపుతామన్నారు. పాలసీ లేకుండా కన్వర్షన్ చేశారు. ఇది కొందరికి లాభం జరిగిందన్నారు. కెటిఆర్ రాహుల్ గాంధీకే కాదు ఎవరికైనా లేఖ రాయవచ్చు, నాలుక ఉందని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. దమ్ముంటే ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు రుజువులు చూపించాలని సవాల్ విసిరారు. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే ఎకరం భూమి ఇండస్ట్రీలకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్నాయి, పట్టణాల్లో కాదన్నారు.



# కర్ణాటకలో సిపిఐ రాష్ట్ర జాతా

### ప్రారంభించిన ప్రధాన కార్యదర్శి డి.రాజా




**కోలార్ గోల్డ్‌ఫీల్డ్:** భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) శతవార్షికోత్సవాలలో భాగంగా కర్ణాటకలో కోలార్ గోల్డ్ ఫీల్డ్ నుండి రాష్ట్రవ్యాప్త జాతాను పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ప్రారంభించారు. కమ్యూనిస్టుపార్టీ ప్రఖ్యాత నాయకుడు పి.జీవానందం (జీవా) 70 సంవత్సరాలక్రితం ఎక్కడైతే పార్టీ జెండా ఎగురవేసి ప్రసంగం చేశారో అదే ప్రదేశంలో డి.రాజా మొదట సిపిఐ పతాకాన్ని ఎగురవేసి ఆ తర్వాత పార్టీ రాష్ట్రస్థాయీ జాతాను ప్రారంభించారు. కోలార్ జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి జ్యోతి బసు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కర్ణాటక రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి సాథి సుందరేశ్, సిపిఐ(ఎం) కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శాసనసభ్యుడు టి.రామచంద్రన్, తమిళనాడు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు సంతోష్, రఘు, ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీశ్ బాల, డి.ఎం.కె, కాంగ్రెస్, విసికె, ఎండిఎంకె పార్టీలకు చెందిన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రాజకీయపార్టీలు, సంస్థలు ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు అభినందనలు తెలియజేశారు. సాథి సుందరేశ్ నాయకత్వంలో జరిగే ఈ రాష్ట్ర జాతా కర్ణాటకలోని అన్ని జిల్లాలమీదుగా ప్రయాణించి డిసెంబరు 23వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది.

## షోకాజ్ నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసిన తొలి రాష్ట్రం కేరళనే. భారత సంస్థలు విదేశాల్లో స్థానిక కరెన్సీలో కాకుండా భారత కరెన్సీలో వీటిని జారీ చేశాయి. దేశీయంగా వృద్ధికి దోహదపడేలా విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సేకరించడం, రూపాయి అంతర్జాతీయాకరణ వీటి ఉద్దేశం. ఈ బాండ్ల ద్వారా కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కెఐఐఎఫ్‌బి) రూ.2వేల కోట్లమేర సమీకరించింది. తర్వాత అవి లండన్ ఎక్స్ఛేంజీకి ఎంట్రీ ఇవ్వడం ద్వారా ఆ మొత్తం విలువ రూ.2,150 కోట్లకు పెరిగింది. రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లను సేకరించే ప్రణాళికలో భాగంగా పినరయి విజయన్ ప్రభుత్వం ఈ బాండ్లను తీసుకువచ్చింది. అయితే ఈ నిధులను అక్రమంగా మళ్లించారని, ఫెమా చట్టాన్ని ఉల్లంఘించారని ఇడి ఆరోపిస్తోంది. దానిలో భాగంగా ఈ జనవరిలో థామస్‌కు దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసింది. ప్రస్తుతం ఇచ్చిన షోకాజ్ నోటీసులు రూ.468 కోట్ల లావాదేవీలకు సంబంధించినవని అధికారులు వెల్లడించారు. ఈ నోటీసుల కింద సిఎం వ్యక్తిగతంగా దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాల్సిన అవసరం లేదు.

## 1000 మంది మృతులు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. మరోవైపు భారత ప్రభుత్వం శ్రీలంకలో నిలిచిపోయిన భారతీయులను వెనక్కు తీసుకువచ్చే ప్రక్రియ సోమవారం ముగించింది. చివరి బ్యాచ్‌లో 104 మంది భారతీయులను ''ఆపరేషన్ సాగర్ బంధు'' లోభాగంగా కొలంబో నుండి తిరువనంతపురానికి తీసుకువచ్చింది. ఉదయం 6.30 గంటలకు ఐఎఫ్ విమానంలో వీరంతా తిరువనంతపురం చేరుకున్నారు. శ్రీలంకలో దిత్వా తుఫాను, వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘోర సంఘటనల్లో మృతులసంఖ్య 355కు పెరిగింది. ఇంకా మరో 366 మంది జాడ తెలియడంలేదు. వారి మృతదేహాలకోసం సహాయ బృందాలు తీవ్ర గాలింపు చేస్తున్నాయి. కొండచరియలు విరిగిపడిన రాళ్ళు, మట్టి, బురదను తొలగించే పని కొనసాగుతున్నది. ఇక ఇండోనేసియాలో కూడా వరదలు, భారీ వర్షాల వల్ల మరణించినవారి సంఖ్య 604కు పెరిగింది. థాయ్‌లాండ్‌లో వరదలవల్ల మరణించినవారి సంఖ్య176కు చేరింది. వరదల కారణంగా శ్రీలంక,ఇండోనేసియా దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ రెండు దేశాలూ తమ తమ సైన్యాలను సహాయ కార్యక్రమాల నిమిత్తం రంగంలోకి దించాయి. థాయ్‌లాండ్‌లో 12 రాష్ట్రాలు వరదలవద్ద దెబ్బతిన్నట్లు ప్రధాన మంత్రి అనుతిన్ ఛర్న్‌విరకుల్ చెప్పారు. 14 లక్షల కుటుంబాలు వదలవల్ల నష్టపోయాయని చెప్పారు. శ్రీలంకలో 1.48 లక్షలమంది నివాసితులు తాత్కాలిక కేంద్రాలలో తలదాచుకుంటున్నారు. ఉత్తర సుమత్రాలో 2,90,700 మంది వరదలవల్ల నష్టపోయారు.

## క్షమాభిక్ష వద్దు

(మొదటి పేజీ తరువాయి)

తరహాలు ప్రజలు దుస్తులు ధరించి వ్యంగ్య ధోరణిలో నినాదాలు చేశారు. దీర్ఘకాలంగా నెతన్యాహూపై అవినీతి కేసులు నలుగుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన సందర్భంగా ంతకుముందు కూడా నెతన్యాహూకు క్షమాభిక్ష ప్రసాదించాలని అధ్యక్షుడు హెర్జోగ్‌ను కోరారు. ఈ నేపథ్యంలో నెతన్యాహూ దేశాధ్యక్షుడికి ఒక పేజీలో క్షమాపణ లేఖ సమర్పించారు. ఐతే తాను ఏ తప్పు చేయలేదని మరోసారి ఆ లేఖలో ఆయన వాదించారు. ఆయన నేరాన్ని అంగీకరించలేదు. కానీ క్షమాపణలు చెప్పడం తన నైతిక బాధ్యత అన్నారు. ఐతే హెర్జోగ్ తొలుత ట్రంప్ విజ్ఞప్తికి స్పందిస్తూ, మొదట నెతన్యాహూ పద్ధతి ప్రకారం తనకు ఒక క్షమాపణ లేఖ ఇవ్వాలని కోరారు. ఈ లేఖపై స్పందిస్తూ, ఈ లేఖను ఆమోదించే విషయంలో చట్టపరమైన విషయాలను తాను క్షుణ్ణంగా పరిశీలిస్తానని హెర్జోగ్ చెప్పారు.

## ఎఐ ఎందుకు వాడట్లే?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు సూచించింది. దీంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. హర్యానాలో వృద్ధ దంపతులు డిజిటల్ అరెస్ట్ బారిన పడిన ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీం, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు దీని బారిన అధికంగా పడుతున్నారని అభిప్రాయపడింది. మరో వైపు సైబర్ మోసాలకు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంలో ఎఐ, మెషీన్ లర్నింగ్ లాంటి సాంకేతికతను ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించింది. ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ జోక్యం చేసుకుని వివరాలు అందించాలని, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో సిబిఐ దర్యాప్తునకు సహకారం అందించాలని ఆదేశించింది. పౌరులను మోసం చేయడంలో సహకారం అందించిన బ్యాంక్ అధికారులను గుర్తించాలని సిబిఐకి చెప్పింది. ఆఫ్‌శోర్ ట్యాక్సులు ఉన్న దేశాల్లో ఉంటూ మోసాలకు పాల్పడున్న నేరస్థులను పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని సిబిఐకి సూచించింది.

### సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు

సైబర్ మోసాలకు వాడే అవకాశం ఉన్నందున ఒక వ్యక్తికి అనేక సిమ్‌లు కేటాయించకుండా టెలికాం ఆపరేటర్లు ఆదేశాలు ఇవ్వాలని టెలికాం మంత్రిత్వ శాఖను అదేశించింది. ఆన్‌లైన్ మోసాలను అడ్డుకునేందుకు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెప్పింది. దీనిపై కేంద్ర హోం, టెలికాం, ఆర్థిక సహా పలు శాఖల స్పందన తెలియజేయాలంటూ సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. ప్రజలను మోసం చేసే ఖాతాలను ఫ్రీజ్ చేసేలా సీబీఐ సహా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ ఇవ్వాలని అభిప్రాయపడింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com